ఈనాడు

కరీంనగర్ 8-2-2018 గురువారం సిటీ సంపుటి 44 సంచిక 179
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పాపం కాంగ్రెస్‌దే

- మీవల్లే ఏపీని నాలుగేళ్లయినా వెంటాడుతున్న విభజన సమస్యలు
- అంజయ్య, సంజీవరెడ్డిలను అవమానించిన చరిత్ర మీది
- లోక్‌సభలో కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధానమంత్రి



■ అగ్గిరాజేయడం మీ(కాంగ్రెస్) చరిత్రలోనే ఉంది. దేశాన్ని విభజించినప్పుడు దేశం మండింది. అప్పుడు చిమ్మిన విషం... స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా దేశంలోని 125 కోట్ల జనం భరించాల్సి వస్తోంది.

■ టి.అంజయ్యకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది ఆయన్ను గౌరవించాలన్న ఉద్దేశంతో ఆంధ్రప్రజలకు సేవచేయడానికి ఎన్టీఆర్ సినిమాలను వదిలి రాజకీయాల్లోకి వచ్చారు.

■ ఈ దేశంలో 90 సార్లకుపైగా ఆర్టికల్ 356ని దుర్వినియోగంచేసి రాష్ట్ర ప్రభుత్వాలను, రాష్ట్రాల్లో పుట్టిన పార్టీలను కూకటివేళ్లతో పీకిపారేశారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికే అవకాశం ఇవ్వలేదు.

■ ఆనాడు రాజీవ్‌గాంధీ.. హైదరాబాద్ విమానాశ్రయంలో దిగినప్పుడు స్వాగతం పలకడానికి వచ్చిన ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన దళిత ముఖ్యమంత్రి టి. అంజయ్య(వాస్తవంగా దళితుడు కాదు)ను ఘోరంగా అవమానించారు. అలాంటి మీరా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేది?

ఈనాడు - దిల్లీ

ప్రధానమంత్రి మోదీ కాంగ్రెస్ పార్టీపై లోక్‌సభ సాక్షిగా నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యం పదాన్ని ఉచ్చరించే అర్హత కూడా ఆపార్టీకి లేదని దుమ్మెత్తిపోశారు. స్వార్థప్రయోజనాలకోసం పార్లమెంటు తలుపులు మూసేసి హడావుడిగా చేసిన విభజనవల్లే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులు పడుతోందన్నారు. బుధవారం మధ్యాహ్నం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ ఆయన మాట్లాడారు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకోడానికి కాంగ్రెస్, దాని మిత్రపక్ష ఎంపీలంతా వెల్‌లోకి వచ్చి నినాదాలు కొనసాగించడంతో ఆవేశానికి గురైన ఆయన కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని చరిత్రను తవ్విపోశారు. రాష్ట్రాల (మిగతా 2లో)

మా ఎన్నికల నినాదం కేసీఆర్



మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అని 2019 ఎన్నికల్లో ఓట్లడుగుతాం

- మరో 15 ఏళ్లకుపైగా సీఎంగా పనిచేసే సత్తా కేసీఆర్‌కు ఉంది
- మిషన్ భగీరథతో ప్రతి నీటి బొట్టులోనూ ఆయనే కనిపిస్తారు
- నాలుగేళ్లలో పన్నుల్లో వాటాతప్ప కేంద్రం నుంచి పైసా రాలేదు
- కేంద్రం వైఖరిపై ప్రజలే బుద్ధిచెబుతారు
- దేశంలోనే దౌర్భాగ్య పార్టీ కాంగ్రెస్
- వచ్చే ఎన్నికల్లో తెరాస అధికారంలోకి రాకుంటే రాజకీయాల్లోనే ఉండను
- కాంగ్రెస్ రాకుంటే ఉత్తమ్ వైదొలగాలి
- ఇష్టాగోష్ఠిలో మంత్రి కేటీఆర్ 2లో

జేఈఈపై తీరిన మోజు!

- మెయిన్‌కు ఏటా తగ్గుతున్న దరఖాస్తులు
- ఆర్కిటెక్చర్ పేపర్‌కు మాత్రం పెరుగుదల
- అభ్యర్థుల్లో మారుతున్న ధోరణీ కారణమే

ఈనాడు - హైదరాబాద్

జేఈఈపై మోజు తీరినట్లు కనిపిస్తోంది.. పరీక్షలకు పోటీ పడే అభ్యర్థుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. నాలుగేళ్ల క్రితం నాటి దరఖాస్తులతో పోలిస్తే ఈసారి దరఖాస్తుల సంఖ్య మరింత తగ్గింది. దీనికి భిన్న కారణాలు చెబుతున్నా అభ్యర్థుల్లో మార్పు వచ్చిందని నిపుణులు భావిస్తున్నారు. జాతీయస్థాయి సంస్థలైన ఎన్ఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణులు కావాలి. ఈ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. బీటెక్ కోర్సు కోసం పేపర్-1, బీఆర్క్ లేదా బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికైతే పేపర్-2 రాయాలి. దేశవ్యాప్తంగా విద్యార్థులు బీటెక్ కోర్సుకే ఆసక్తి చూపుతారు. అయితే పేపర్-1కు మాత్రం ఏటా దరఖాస్తుల సంఖ్య తగ్గిపోతోంది. 2015కు, 2018కి (ఏప్రిల్ 8, 15, 16 తేదీల్లో జరిగే పరీక్షకు) 1.57 లక్షలమంది విద్యార్థులు తగ్గిపోయారు. బీఆర్క్‌కు దరఖాస్తు చేసే వారి సంఖ్య మాత్రం పెరుగుతున్నట్లు గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. అంటే విద్యార్థులు కొంత భిన్నమైన కోర్సులను ఎంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

ఎందుకీ ఈ పరిస్థితి?

■ జేఈఈ మెయిన్ పేపర్-1 ర్యాంకులు ఆధారంగా కొన్ని రాష్ట్రాలు ఇంజినీరింగ్ సీట్లను భర్తీ చేసేవి. గత ఏడాది వరకు ఏడు రాష్ట్రాలు ఉండగా ఈసారి మహారాష్ట్ర, గుజరాత్ వైదొలిగాయి. దానివల్ల గత ఏడాదికి, ఈసారికి దాదాపు 51 వేలు తగ్గి ఉండొచ్చని భావిస్తున్నా..గత నాలుగేళ్ల నుంచి తగ్గుదల కనిపిస్తోంది కదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు.

■ 2012 నుంచి జేఈఈ మెయిన్ నిర్వహిస్తున్నందున ప్రస్తుతం విద్యార్థులకు ఆ పరీక్షపై స్పష్టత వచ్చిందని.. అందువల్ల ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసే పరిస్థితి ఉండటం లేదని జేఈఈ శిక్షణ నిపుణుడు ఒకరు అభిప్రాయబడ్డారు. ఎవరికి వారు తమ శక్తి సామర్థ్యాలు ఎంతో అంచనాకు వస్తున్నారని చెబుతున్నారు. ఉదాహరణకు ఎంసెట్‌కు 1.40 లక్షలమంది దరఖాస్తు చేస్తుంటే జేఈఈ మెయిన్‌కు తెలంగాణ నుంచి 80 వేల లోపే ఉంటోంది. వారిలో కూడా ఎక్కువమంది ఎన్ఐటీల్లో సీట్లువస్తాయని రాయటం లేదని, రాష్ట్రంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో చేరేందుకు జేఈఈ మెయిన్ ర్యాంకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో రాసేవారూ ఉన్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

■ ఈసారి తెలుగు రాష్ట్రాలు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లకు సంబంధించి జాతీయ కోటా (నేషనల్ పూల్)లో చేరితే మన విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు ఎక్కువ అందుబాటులోకి వస్తాయి. దానివల్ల బైపీసీలో చేరే వారి సంఖ్య మరింత పెరగవచ్చు. ఆ ప్రభావం ఇంటర్ ఎంపీసీ గ్రూపుపై పడుతుంది. అందువల్ల భవిష్యత్తులో మరికొంత తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే సమయంలో బాలికలకు ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రత్యేకంగా సీట్లు కేటాయిస్తున్నందున వారి దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండవచ్చని అంచనా.

జేఈఈ మెయిన్‌కు దరఖాస్తుల సంఖ్య ఇలా...

సంవత్సరం	పేపర్-1	పేపర్-2	మొత్తం
2015	12,92,711	1,41,250	14,33,961
2016	11,94,938	1,29,674	12,24,612
2017	11,86,454	1,44,086	13,30,540
2018	11,35,009	1,46,077	12,81,086





విమానాశ్రయాన్ని ఆనుకుని ఉన్న భూములు ఇవే • ప్రభుత్వానికి చెందినవంటూ అధికారులు ఏర్పాటుచేసిన బోర్డు

మరో భూమాయ

- లేని భూమిని పుట్టించి.. సర్వే నంబరు సృష్టి
- దాని ఆధారంగా మరో గ్రామంలో భూమి కబ్జా
- అధికారుల సాయంతో దర్జాగా రిజిస్ట్రేషన్
- ఆపై రియల్ వ్యాపారులకు అమ్మకం
- శంషాబాద్ విమానాశ్రయం దగ్గర బాగోతం

ఈనాడు - సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి
శంషాబాద్ గ్రామీణ - న్యూస్‌టుడే

లేని సర్వే నంబర్‌ను పుట్టించారు.. అందులో భూమి ఉన్నట్లు నకిలీ రికార్డులను సృష్టించారు. రిజిస్ట్రేషన్ అధికారులను మచ్చిక చేసుకుని దానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆపై వేరే గ్రామంలోని మరో సర్వే నంబర్‌లోని పదెకరాల భూమిని అక్రమార్కులు తమ పరం చేసుకున్నారు. ఇదంతా శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వే పక్కనే ఉన్న చిన్న గొల్లపల్లిలో చోటు చేసుకుంది. రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ప్రస్తుతం కొందరు అక్రమార్కుల అధీనంలోకి చేరిపోయిన వైనమిది. రెవెన్యూ రికార్డుల ప్రకారం చిన్న గొల్లపల్లి గ్రామంలో దాదాపు 3,000 ఎకరాల వరకు భూములున్నాయి. అవన్నీ సర్వే నంబర్ 1 నుంచి 260 వరకు ఉన్నాయి. ఈ గ్రామంలోని భూములన్నీ విమానాశ్రయ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించగా ప్రస్తుతం కొంత భూమి మాత్రమే మిగిలి ఉంది. అవి విమానాశ్రయం ప్రహారీకి ఆనుకొని ఉండడంతో పాటు (మిగతా 2లో)




నింగికెగిసిన 'బాహుబలి' రాకెట్

- విజయవంతమైన 'ఫాల్కన్ హెవీ' ప్రయోగం
- అంగారక కక్ష్యను దాటుకుని కారు పయనం
- సత్తా చాటుకున్న 'స్పేస్ఎక్స్' 2లో

ఇక తెలుగులోనూ ఉత్తర్వులు

- ప్రజలకు మరింత మెరుగైన సమాచారం అందించాలి
- వెబ్‌సైట్లను నవీకరించాలి
- కార్యదర్శులకు సీఎస్ జోషి ఆదేశం 11లో

TG



పరిధులు తేలుద్దాం రండి..

- కృష్ణా, గోదావరి బోర్డులపై 9న అత్యవసర సమావేశం
- దిల్లీకి రమ్మని ఛైర్మన్లకు పిలుపు

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిపై చర్చించేందుకు కేంద్రం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మూడేళ్లుగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో పలు దఫాలుగా చర్చలు జరిగినా ఓ కొలిక్కి రాకపోవడం, రాష్ట్రాలు లేఖలు రాసినా కేంద్రం స్పందించకపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా.. అదీ రెండు రోజులు మాత్రమే వ్యవధి ఇచ్చి సమావేశాన్ని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. కృష్ణా, గోదావరి బోర్డులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించేందుకు ఈనెల 15న కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ కార్యదర్శి రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఏయే అంశాలను చర్చించాలన్నదానిపై అజెండాను తయారు చేసి ఈనెల ఏడో తేదీలోగా పంపాలని రెండు బోర్డులకు కేంద్రం సూచించింది. ఈ సమావేశానికి బోర్డులు, రాష్ట్రాలు సిద్ధమవుతుండగా, అకస్మాత్తుగా ఈనెల 9న బోర్డుల పరిధిపై చర్చించేందుకు ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బుధవారం సమాచారం వచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఏర్పాటైన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పరిధిని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయాల్సి ఉంది. ఇది జరిగితే ప్రాజెక్టుల నిర్వహణ మొత్తం బోర్డు ఆధీనంలో ఉంటుంది.

ఎవరి వాదన వారిదే: వాస్తవానికి 2015 నుంచి బోర్డు పరిధిపై చర్చ జరుగుతూనే ఉంది. నీటి కేటాయింపు, ప్రాజెక్టుల వారీ వినియోగం తేలకుండా పరిధిని ఎలా నిర్ణయిస్తారని, నిర్ణయించి ప్రయోజనం ఏముందని తెలంగాణ ప్రశ్నిస్తోంది. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుపుతుందని, తుది తీర్పు వచ్చిన తర్వాతనే దీని గురించి ఆలోచించాలని తెలంగాణ చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ మాత్రం అన్ని ప్రాజెక్టులను లేదా కనీసం ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను బోర్డు పరిధిలోకి తీసుకోవాలని, లేకుండా ఏ రాష్ట్రంలోని హెడ్‌వర్క్సులను, స్లూయిస్‌లను ఆ రాష్ట్రమే నిర్వహించుకోడానికి అనుమతించాలని కోరింది. ఇదే విషయమై గతంలో కేంద్రానికి లేఖలుకూడా రాసింది. రెండు రాష్ట్రాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయగా, బోర్డు మాత్రం పరిధి లేకుండా ఎలా పని చేయగలమని పేర్కొంటోంది. ప్రాజెక్టులు తమ పరిధిలో ఉండాలని కోరుతోంది. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ కార్యదర్శి ఏర్పాటుచేసిన సమావేశానికి ప్రాధాన్యంఏర్పడింది. ఈ సమావేశానికి కేంద్ర జలసంఘం ఛైర్మన్, కృష్ణా, గోదావరిబోర్డుల ఛైర్మన్లు, జలసంఘం హైదరాబాద్ కేంద్రం చీఫ్‌ఇంజినీర్లను ఆహ్వానించారు.

పాపం కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటులో వాజ్‌పేయి చూపిన దార్శనికత వల్ల మూడురాష్ట్రాలు సాఫీగా కొనసాగుతున్నాయని, కాంగ్రెస్ హడావుడిగా విభజించిన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కావడంలేదని అన్నారు. "ఆంధ్రా ప్రజల మనోభావాలను లెక్కచేయకుండా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాన్ని విభజించారు. తెలంగాణ ఏర్పాటుకు మేం కూడా మద్దతిచ్చాం. తెలంగాణ అభివృద్ధికి ఈరోజుకూడా మద్దతిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కు ఆరోజు మీరు చేసిన అన్యాయంతో నాలుగేళ్ల తర్వాతకూడా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి" అని అన్నారు. "మీరు భరత మాతను ముక్కలు చేసిన తర్వాతకూడా ఈ దేశం మీ వెంట నిలిచింది. మొదటి మూడునాలుగు దశాబ్దాలు విపక్షం నామమాత్రంగా ఉంది. మీడియా పెద్దగా లేదు. ఉన్న మీడియాకూడా దేశ శ్రేయస్సు కోసం ప్రభుత్వంతో కలిసి నడిచింది. రేడియో మరో స్వరాన్ని వినిపించకుండా పూర్తిగా మీగీతాలే ఆలపించింది. టీవీ వచ్చిన తర్వాత అదీ మీకే పూర్తిగా సమర్పితమైంది. ఆరోజుల్లో న్యాయవ్యవస్థలో ఉన్నత నియామకాలు కూడా కాంగ్రెస్‌పార్టీ ద్వారానే జరిగేవి. నాడు కోర్టుల్లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసేవారులేరు. అద్భుతమైన నిర్ణయాలు తీసుకొనే వాతావరణం అప్పట్లో మీకు ఉండింది. అయినప్పటికీ మీరు మొత్తం జీవితకాలాన్ని ఒక కుటుంబ గీతాన్ని ఆలపించడానికే అంకితం చేశారు. మీరు కొంత బాధ్యతాయుతంగా పని చేసి ఉన్నా ఈ దేశం ఎక్కడి నుంచి ఎక్కడికో వెళ్లిపోయి ఉండేది" అన్నారు. నెహ్రూనే ఈ దేశానికి ప్రజాస్వామ్యం ఇచ్చారని చెబుతున్నారని మన దేశంలో లిచ్ఛవి రాజ్యం, బౌద్ధపరంపర కొనసాగినప్పుడుకూడా ప్రజాస్వామ్యం ఉందని ప్రధాని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రపతి అభ్యర్థి రూపంలో నీలంసంజీవరెడ్డిని నిలబెట్టి, రాత్రికి రాత్రి ఆయనకు వెన్నుపోటు పొడిచి అధికారిక అభ్యర్థిని ఓడించిన ఘనత కాంగ్రెస్‌దన్నారు. "మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ఓ పదాధికారి విలేకర్ల సమావేశంలో అందరి ముందు చించి చెత్తబుట్టలో పడేశారు. ఇదా ప్రజాస్వామ్యం? అందువల్ల దయచేసి మాకు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పొద్దు. దేశంలో స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. 15 కాంగ్రెస్ కమిటీల్లో 12 కాంగ్రెస్ కమిటీలు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఎన్నుకున్నాయి. మూడు కమిటీలు ఎవ్వరికీ ఓటేయలేదు. అయినప్పటికీ ఆ తర్వాత కాంగ్రెస్ నేతృత్వాన్ని ఆయనకు అప్పగించకుండా గద్దెపై నెహ్రూను కూర్చోబెట్టడం ఏ ప్రజాస్వామ్యం? ఆరోజే భారత తొలి ప్రధానమంత్రి సర్దార్‌వల్లభాయ్‌పటేల్ అయి ఉంటే కాశ్మీర్ పరిస్థితి ఇలా ఉండేది కాదు. గత డిసెంబరులో కాంగ్రెస్‌పార్టీ అధ్యక్ష ఎన్నిక ఎలా జరిగిందో చూడండి. కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఒక యువకుడు పోటీచేయడానికి నామినేషన్ పత్రం భర్తీచేయడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్నారు. అలాంటి పార్టీ నేతలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారా? ఈ గొంతు నొక్కడానికి మీరు చేసే ప్రయత్నాలకు లొంగేవాణ్ని కాదు" అని మోదీ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు.

'కాంగ్రెస్ రద్దు'.. గాంధీ నినాదమే

- స్వాతంత్ర్యానంతరం పార్టీని రద్దు చేయాలని ఆయన కోరుకున్నారు
- ఆ కలనే మేం సాకారం చేస్తున్నాం
- ప్రధాని మోదీ

ఈనాడు - దిల్లీ

సరికొత్త భారతావనిని సృష్టించాలని తాము కోరుకుంటుంటే కాంగ్రెస్ మాత్రం అత్యయిక పరిస్థితి, కుంభకోణాలు, సిక్కులపై హింస వంటి ఘటనలతో కూడిన పాత భారతదేశాన్నే కోరుకొంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ రహిత భారత్' అనేది మహాత్మా గాంధీ ఇచ్చిన నినాదమేననీ, ఆయన చూపిన మార్గంలో వెళ్తూ దానినే తాము ఇప్పుడు నిజం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బుధవారం పార్లమెంటు ఉభయ సభల్లో జరిగిన చర్చకు ప్రధాని సమాధానమిచ్చారు. కాంగ్రెస్‌పై పెద్దఎత్తున విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్ ముక్త్ భారత్ అనేది నేను ఇచ్చిన నినాదం కాదు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కాంగ్రెస్‌ను రద్దు చేయాలనీ, ఇక దాని ఆవశ్యకత లేదనీ గాంధీయే కోరుకున్నారు. మహాత్ముడు కోరుకున్న భారతదేశం మాకు కావాలి. మీకు (కాంగ్రెస్‌వారికి) మాత్రం సరికొత్త భారతదేశం అవసరం లేదు. బోఫోర్స్, హెలికాప్టర్ కుంభకోణాల భారత్ మీకు కావాలి...' అని మోదీ చెప్పినప్పుడు భాజపా సభ్యులు పెద్దఎత్తున బల్లలు చరిచారు. దేశాభివృద్ధిని పణంగా పెట్టి గాంధీ కుటుంబాన్ని స్తుతించడమే కాంగ్రెస్ పని అని విమర్శించారు. వేలాదిమంది సిక్కులు ఊచకోతకు గురయ్యే దేశాన్నే కాంగ్రెస్ కోరుకొంటోందన్నారు. 'కాంగ్రెస్ విమర్శిస్తున్నట్లుగా మేం కేవలం పథకాల పేర్లు మార్చేవాళ్లం (నేమ్ ఛేంజర్స్) కాదు. మేం లక్ష్యాన్ని మార్చేవాళ్లం (ఎయిమ్ ఛేంజర్స్). మేం కష్టపడి పనిచేస్తాం. ప్రభుత్వ పనితీరులో మార్పు తీసుకువచ్చాం. కొత్తకొత్త పనుల్ని ఆలోచించి, వాటిని సకాలంలో పూర్తి చేస్తున్నాం' అని ప్రధాని చెప్పారు. కాంగ్రెస్ తీరు మారకపోతే ఎప్పటికీ ప్రతిపక్షంలోనే స్థిరపడిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.


లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

అవినీతి పరులకు జైలు తప్పదు

అవినీతి కార్యకలాపాల్లో మునిగితేలేవారు బయటపడే ప్రసక్తేలేదని మోదీ తేల్చిచెప్పారు. ఎంతటివారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందేనన్నారు. ఇప్పటికే నలుగురు మాజీ ముఖ్యమంత్రులు ఊచలు లెక్కపెడుతున్నారని గుర్తుచేశారు. తాను పోరాడే మనిషినే తప్ప వెనక్కు తగ్గేవాడిని కాదన్నారు. దేశంలో నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏల) పాపం కాంగ్రెస్‌దేనని ధ్వజమెత్తారు. అందుకు వారు మూల్యం చెల్లించుకోకతప్పదని పేర్కొన్నారు. దేశాన్ని లూటీ చేసిన వారు దాన్ని కక్కాల్సిందేనన్నారు. తాను పోరాడే మనిషిని తప్ప తగ్గేవాడినికాదని చెప్పారు. 'ఎన్‌పీఏ పాపం గురించి దేశానికి తెలియాలి. దాని వెనుక గత ప్రభుత్వ వ్యవహారం ఉంది. వంద శాతం పాత ప్రభుత్వమే బాధ్యత అందుకు బాధ్యత వహించాలి. బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి, ఫోన్లు చేసి కావాల్సిన వారికి బ్యాంకర్లు, నేతలు, దళారులు కలిసి కోట్లకు కోట్లు రుణాలు ఇప్పించుకున్నారు. బ్యాంకుల నుంచి వెళ్లిన డబ్బు ఎప్పుడూ తిరిగి బ్యాంకులకు రాలేదు. నేను రాజకీయం చేయాలనుకుంటే మొదటి రోజే దేశం ముందు సత్యాలు పెట్టేవాణ్ని. కాకపోతే ఆ సమయంలో బ్యాంకుల దుర్దశవల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతినేది. దాన్నుంచి బయటపడటం కష్టమయ్యేది. అందుకే మీ పాపాలు తెలిసి, సాక్ష్యాలు ఉండికూడా ఇన్నాళ్లు మౌనంగా ఉన్నాను. దేశం శ్రేయస్సు కోసం మీ ఆరోపణలు భరిస్తూ వచ్చాను. ఇప్పుడు బ్యాంకులకు కావాల్సినంత బలం కల్పించాం. అందుకే దేశం ముందు సత్యాన్ని ఉంచుతున్నా. ఈ ఎన్‌పీఏ పాపం మీదేనని ఈ పవిత్ర సభలో నిల్చొని చెబుతున్నా. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క రుణం కూడా ఎన్‌పీఏ అయ్యేలా ఇవ్వలేదు. మీరు లెక్కలన్నీ దాచిపెట్టారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎన్‌పీఏ 36% అన్నారు. మేం 2014లో చూసినప్పుడు మీరు చెప్పినవన్నీ తప్పుడు లెక్కలు అని తేలింది. అప్పటికి 82%కి చేరాయి. దేశప్రజల ధనాన్ని లూటీ చేశారు. ఇప్పుడు ఎంత కష్టమైనా ప్రజలకు నిజాలు చెప్పాలని నిర్ణయించాం. నా స్వచ్ఛతా అభియాన్ కేవలం వీధులు శుభ్రం చేయడానికే కాదు.. ఆర్థిక వ్యవస్థలోని రుగ్మతలనుకూడా కడిగేయడం కూడా. అందుకే నిజాలు బయటపెడుతున్నాం. అప్పట్లో మీరు రూ.18 లక్షల నుంచి రూ.51 లక్షల కోట్ల రుణాలు లూటీ చేశారు. ఈరోజు పెరుగుతున్న పాపం మీ సమయంలో తీసుకున్న వడ్డీ పాపం తప్పితే మాదికాదు. దండిగా తిన్నవారే ఎక్కువ బురద చల్లుతుంటారు. మీరు ఎంతైనా చల్లండి మేం వెనక్కు తగ్గం. ఎవరు కావాలంటే వారు దోచుకోండి... కాకపోతే మమ్మల్నీ గుర్తుపెట్టుకోండి అన్న రీతిలో అప్పటి ప్రభుత్వం నడిచింది' అని మోదీ ధ్వజమెత్తారు.

ఎన్నికలపై అంత ఖర్చు భరించగలమా?

'తరచూ ఎన్నికలను నిర్వహించడానికి రూ.వేల కోట్లు ఖర్చవుతోంది. చాలా సమయాన్ని, వనరుల్ని కేటాయించాల్సి వస్తోంది. భారత్ వంటి దేశంలో అంత ఖర్చు భరించగలమా? దీనికొక పరిష్కారం కనిపెట్టడంలో విపక్షాలు సహకరించాలి. పార్లమెంటుకు, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడంపై నిర్మాణాత్మక చర్చ చేపట్టాల'ని ప్రధాని కోరారు. ఆధార్‌ను కాంగ్రెస్ తీసుకువచ్చిందని ఆ పార్టీ చెప్పుకోవడాన్ని ప్రస్తావిస్తూ ఇలాంటి వ్యవస్థ ఉండాలని మొట్టమొదటిసారిగా 1998లో ఎల్‌కే ఆడ్వాణీ రాజ్యసభలో చేసిన ప్రస్తావనను గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఓబీసీ బిల్లు, తలాక్ బిల్లులు ఆమోదం పొందడానికి సహకరించాల్సిందిగా విపక్షానికి మోదీ పిలుపునిచ్చారు. ముస్లిం పురుషులు జైలుకెళ్తే వారి కుటుంబాలు ఇబ్బందులు పడతాయన్న వాదనను ప్రస్తావిస్తూ- బహుభార్యాత్వంపై హిందూ పురుషులు అరెస్టయినప్పుడూ అలాంటి ప్రశ్నలే వేస్తారా అని ప్రశ్నించారు. తీర్మానాన్ని లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. కాంగ్రెస్, తృణమూల్, వామపక్షాలు వాకౌట్ చేశాయి. రాజ్యసభ కూడా తీర్మానానికి ఆమోదం తెలిపింది. అక్కడా తృణమూల్ వాకౌట్ చేసింది.

మరో భూమాయ

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలోంచి బాహ్య వలయ రహదారి రావడంతో వాటిపై రియల్ వ్యాపారుల కన్ను పడింది. గొల్లపల్లికి చెందిన కొంత మంది వ్యాపారులు తెలివైన ఆలోచన చేశారు. గొలపల్లిలో లేని కొత్త సర్వే నంబరును సృష్టించారు. ఈ గ్రామానికి చెందిన రెవిన్యూ రికార్డుల్లో సర్వే నెంబరు 261 ఉన్నట్లు, దాని కింద 10 ఎకరాల భూమి ఉన్నట్లు నకిలీ రికార్డులను సృష్టించారు. వాటిని ఆనుకొని ఉన్న సయ్యద్‌గూడ రెవెన్యూ సర్వే 24 నంబరులో ఉన్న పదెకరాల ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ వేశారు. ఇదే 261 సర్వే నంబరని పేర్కొంటూ 2013లో శంషాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మలక్‌పేటకు చెందిన రోజలిన్ దేవరాజుకు రిజిస్ట్రేషన్ చేయించారు. తరువాత ఆ భూమిని తరువాత సైదాబాద్‌కు చెందిన అచ్చేశ్వరి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో నాటి రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు కొంతమంది తోడ్పాటు అందించినట్లు తెలుస్తోంది. ఆ నకిలీ పత్రాలతోనే ఇక్కడ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటూ దరఖాస్తు చేస్తే సంబంధిత అధికారులు ఆ సౌకర్యం కూడా కల్పించారు. రెవెన్యూ అధికారులు అప్పట్లోనే ఓ అడుగు ముందుకేసి టైటిల్ డీడ్, పట్టాదారు పాసు పుస్తకం, పట్టా సంఖ్యలను కేటాయించడంతో స్థానికులు విస్తుపోయారు. విమానాశ్రయం ప్రహరీకి ఆనుకొని ఉన్న గొల్లపల్లి, సయ్యద్‌గూడ రెవెన్యూ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలంటూ వారు ఆందోళనకు దిగారు. వాటిని కొన్న రియల్ వ్యాపారులు చదును చేయడానికి ప్రయత్నించగా, రైతులు అడ్డుకోవడంతో ఇటీవల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

ఇటీవలే రెవిన్యూ అధికారులు ఈ 10 ఎకరాలు ప్రభుత్వ భూములంటూ బోర్డు పెట్టారు. తరువాత పట్టించుకోకపోవడంతో అందులోని కొంత భూమిని మరో రియల్ ఎస్టేట్ ప్రతినిధులకు విక్రయించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించి అమ్మేయడానికి చూస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ కబ్జా బాగోతంలో కొంతమంది స్థానిక మాజీ ప్రతినిధులు కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ చేసిన పది ఎకరాలతో పాటు మరో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ప్రస్తుతం తమ అధీనంలోకి తెచ్చుకున్నారని తెలిసింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న దేవరాజు, అచ్చేశ్వరి చిరునామాలకు గ్రామస్థులు వెళ్లి పరిశీలిస్తే అక్కడ అటువంటి వారెవరూ లేరని తేలింది. గొలపల్లిలో అసలు 161 సర్వే నంబరే లేదని వీఆర్‌ఓ శ్రీనివాస్ 'ఈనాడు' వద్ద ధ్రువీకరించారు. దీనిపై తహసీల్దారుకు నివేదిక పంపిస్తానని చెప్పారు.

'కేసీఆరే' మా ఎన్నికల నినాదం

- నాలుగేళ్లలో పన్నుల్లో వాటాతప్ప కేంద్రం నుంచి పైసా రాలేదు
- కేంద్రం వైఖరిపై ప్రజలే బుద్ధిచెబుతారు
- దేశంలోనే దౌర్భాగ్య పార్టీ కాంగ్రెస్
- వచ్చే ఎన్నికల్లో తెరాస అధికారంలోకి రాకుంటే రాజకీయాల్లోనే ఉండను
- కాంగ్రెస్ రాకుంటే ఉత్తమ్ వైదొలగాలి
- ఇష్టాగోష్ఠిలో మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: మరో పదిహేనేళ్లకు పైగా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసే సత్తా కేసీఆర్‌కు ఉందని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. తెలంగాణను ఇంతగా అభివృద్ధి చేసిన కేసీఆర్‌నే మళ్లీ సీఎం చేయాలని కోరుతూ 2019 ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని చెప్పారు. 2014 కంటే తెరాస బాగా బలపడిందని, ఈ సారీ ఒంటరిగానే పోటీచేసి మరిన్ని ఎక్కువ స్థానాలను గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. బుధవారమిక్కడ తన నివాసంలో కేటీఆర్ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. గత నాలుగేళ్లలో రాష్ట్రానికి పన్నుల వాటా మినహాయిస్తే పైసా సాయం కేంద్రం నుంచి అందలేదన్నారు. మిత్రపక్షాలకు సైతం ఎన్డీఏ సర్కారు మొండిచేయి చూపిందని.. తమకు నిధులు ఇస్తుందనే నమ్మకం లేదని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. కేంద్రం వైఖరిపై ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెరాస అధికారంలోకి రాకపోతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటాననే సవాల్‌కు కట్టుబడి ఉన్నానని, కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వైదొలగాలని కేటీఆర్ పునరుద్ఘాటించారు. గతంలో అనేక ఉప ఎన్నికల సందర్భంగా తన సవాళ్లపై కాంగ్రెస్ వెనక్కితగ్గిందని ఆయన ఎద్దేవా చేశారు. ఉత్తమ్ కుటుంబం మాటున రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలోనే దౌర్భాగ్య పార్టీ కాంగ్రెస్ అని, రాహుల్‌గాంధీ కంటే పెద్ద పప్పు ఎవరూ లేరని, సొంత నియోజకవర్గంలో పురపాలక సంఘాలను గెలిపించుకోలేని అసమర్థుడని విమర్శించారు.

"ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నాం. మేం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయి. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారు. 58 ఏళ్ల పాటు ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన వారు ప్రజలను పట్టించుకోలేదు. సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ భగీరథ చాలా గొప్ప పథకం. దాని గురించి గత పాలకులకు ఆలోచనే లేదు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యకు కాంగ్రెస్సే కారణం. అతి త్వరలోనే ఇంటింటికీ రక్షిత నీరు అందుతుంది. మహిళలు తీసుకునే ప్రతి నీటి బొట్టులో సీఎం కేసీఆర్ కనిపిస్తారు. ప్రాజెక్టులు, చెరువుల గురించి ఆలోచన చేసింది కేసీఆరే. ప్రతి వర్గానికి ఆయన మేలుచేశారు. తెలంగాణను ఇంతగా అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలని కోరుతూ ఎన్నికల్లో ఓట్లు అడుగుతాం.

ఉత్తమ్.. నోరు అదుపులో పెట్టుకోవాలి

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఆయన నోటిని అదుపులో పెట్టుకోవాలి. దేశంలో 30 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసిన సీఎం ఒక్క కేసీఆరే. నేను బచ్చా అయితే రాహుల్ కూడా బచ్చానే. దేశంలో అత్యయిక పరిస్థితి తెచ్చింది కాంగ్రెస్. నెహ్రూ నుంచి రాహుల్ వరకు తెలంగాణకు తీరని ద్రోహం చేశారు. వందల మంది విద్యార్థుల ప్రాణాలు పోవడానికి ఆ పార్టీదే బాధ్యత. సీఎం పదవి కోసం హైదరాబాద్‌లో మతకల్లోలాల ద్వారా నరమేధం సృష్టించింది కాంగ్రెస్ అని ఆ పార్టీ నేత చెన్నారెడ్డే స్వయంగా చెప్పారు. రేవంత్‌రెడ్డి ఏది పడితే అది మాట్లాడి బ్లాక్‌మెయిల్ చేస్తానంటే ఎవరూ ఊరుకోరు. తెరాసలో చేరతామని మా తలుపులు తట్టిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నారు. నల్గొండలో స్థానికంగా జరిగిన హత్యకు రాజకీయ రంగు పులిమి రాష్ట్ర సమస్యగా చేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మా కుటుంబంపై చవకబారు విమర్శలకు పాల్పడుతున్నారు. మా దెబ్బేంటో వచ్చే ఎన్నికల్లో రుచిచూపిస్తాం.

బాహుబలి వసూళ్లంత కూడా ఇవ్వలేదు..

ఈ సారి కేంద్ర బడ్జెట్ చప్పగా ఉంది. దీంతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. మనం ఎన్ని చెప్పినా మోదీ వినరు. మాది అరణ్య రోదనే. రాష్ట్రం నుంచి రూ.40 వేల కోట్ల ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లాయి. అయితే, బాహుబలి సినిమా వసూళ్లంత కూడా కేంద్రం రాష్ట్రానికి ఇవ్వలేదు. రాష్ట్ర పథకాలను కేంద్ర మంత్రులు, అధికారులు అద్భుతమని పొగుడుతున్నారే తప్ప రూపాయి ఇవ్వడం లేదు. కాళేశ్వరాన్నిగానీ మరో ప్రాజెక్టునుగానీ జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలన్నా పట్టించుకోలేదు. ఎయిమ్స్‌పై జైట్లీ స్వయంగా మాట ఇచ్చి మర్చిపోయారు. ఐటీఐఆర్ ఊసే లేదు. మిత్రపక్షం తెదేపావైపే భాజపా చూడడం లేదు.. మేం ఆందోళన చేస్తే ఇస్తారనే నమ్మకం లేదు. అయినా మళ్లీ గురువారం దిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులను కలుస్తా. భాజపా రాష్ట్ర నేతలు లక్ష్మణ్, కిషన్‌రెడ్డి నియోజకవర్గాలు దాటరు.. వారు దిల్లీకి వెళ్లి తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుంది.

నియోజకవర్గాలు పెరిగినా పెరగకపోయినా నష్టం లేదు

నియోజకవర్గాల సంఖ్య పెంచుతామని కేంద్రం విభజన చట్టంలో హామీ ఇచ్చింది. ఎందుకు ఆపుతున్నారో తెలియదు. నియోజకవర్గాలు పెరిగినాపెరగకపోయినా నష్టం లేదు. హైకోర్టునూ విభజించడం లేదు. రాజకీయాల్లోకి కొత్తపార్టీలు ఎన్నైనా రావచ్చు. ఫలితం ఏమిటనేది ఎన్నికల్లో తెలుతుంది"అని కేటీఆర్ పేర్కొన్నారు

గ్రహం అనుగ్రహం	8-2-2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
అష్టమి: మ. 1-21 తదుపరి నవమి
విశాఖ నక్షత్రం: సా. 5-24 తదుపరి అనూరాధ
అమృత ఘడియలు: ఉ. 8-04 నుంచి 9-46 వరకు
వర్జ్యం: రా. 9-42 నుంచి 11-25 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-19 నుంచి 11-05 వరకు
తిరిగి మ. 2-52 నుంచి 3-38 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5-54

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	13.0	30.6
మెదక్	13.9	34.6
కరీంనగర్	15.0	30.0
శ్రీకాకుళం	15.5	34.0
హైదరాబాద్	15.9	30.0
విశాఖపట్నం	16.4	30.8
హన్మకొండ	17.0	32.0
నిజామాబాద్	18.0	30.0
రామగుండం	18.0	30.6
విజయవాడ	18.1	31.2
ఖమ్మం	19.0	32.0
సూర్యాపేట	19.0	33.0
మహబూబ్‌నగర్	20.0	30.0

గాంధీలో 'ఆసుపత్రి పరిపాలన కోర్సు'

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో కొత్త కోర్సు అందుబాటులోకి వచ్చింది. ఎండీ ఆసుపత్రి పరిపాలన(హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్) పీజీ వైద్యవిద్య కోర్సులో గాంధీ వైద్యకళాశాలకు 3 సీట్లను 2018-19 సంవత్సరానికి భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) అనుమతించింది. 2018-19 వైద్యవిద్య సంవత్సరానికి నిజామాబాద్ వైద్య కళాశాలకు 3 ఫార్మకాలజీ పీజీ సీట్లను ఎంసీఐ అనుమతించింది.

నింగికెగిసిన 'బాహుబలి' రాకెట్

కేప్ కెనావెరాల్: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన రాకెట్ 'ఫాల్కన్ హెవీ'.. తొలి ప్రయోగం విజయవంతమైంది. ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్‌లోని కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి.. మంగళవారం ఈ రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. 1969లో చంద్రుడి మీదకు తొలిసారి మానవులను పంపడం నుంచి అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు సంబంధించిన అనేక కీలక ప్రయోగాలను నిర్వహించిన 39ఏ ప్రయోగ వేదిక నుంచే దీన్నీ ప్రయోగించారు.

ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించిన ఈ వాహకనౌకలో.. టెస్లా సంస్థకు చెందిన రోడ్‌స్టర్ ఎలక్ట్రిక్ కారు అంతరిక్షానికి చేరింది. చౌకలో రోదసి ప్రయోగాలకు, చందమామ, అంగారకుడి మీదకు మానవులను తీసుకెళ్లడానికి ఈ రాకెట్‌ను ఉపయోగించాలని దీని తయారీదారైన స్పేస్‌ఎక్స్ సంస్థ అధిపతి ఎలాన్ మస్క్ భావిస్తున్నారు. 23 అంతస్తుల ఎత్తు కలిగిన ఫాల్కన్ హెవీ ప్రయోగం విజయవంతమవడంతో.. రోదసి ప్రయోగ మార్కెట్‌లో స్పేస్‌ఎక్స్‌కు పైచేయి లభిస్తుందని పరిశీలకులు చెబుతున్నారు. అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఉపగ్రహ కంపెనీలు, అమెరికా సైన్యం నుంచి భారీగా ప్రయోగ కాంట్రాక్టులను ఒడిసిపట్టడానికి వీలవుతుందని విశ్లేషిస్తున్నారు.

ఫాల్కన్ హెవీలో 27 రాకెట్ ఇంజిన్లు ఉన్నాయి.



ప్రయోగ సమయంలో ఇవి 5 లక్షల పౌండ్ల శక్తిని వెలువరించాయి. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ ఎక్కువగా వినియోగిస్తున్న ఫాల్కన్-9తో పోలిస్తే ఇది మూడు రెట్లు ఎక్కువ. నిజానికి మూడు ఫాల్కన్-9 రాకెట్లను పక్కపక్కనే అమర్చడం ద్వారా దీన్ని రూపొందించారు. అంతరిక్ష ప్రయోగాల ఖర్చును తగ్గించడానికి ఉద్దేశించిన పునర్వినియోగ పరిజ్ఞానాన్ని దీనిలో ఉపయోగించారు. ఇందులోని మూడు ప్రధానబూస్టర్లలో.. రెండు బూస్టర్లు ల్యాంచ్ పాడ్ల మీద దిగాయి. మరో బూస్టర్ సముద్రంలో నౌకపై దిగాల్సి ఉండగా.. వేగ నియంత్రణలో వైఫల్యంతో నీటిని ఢీకొట్టుకుని పేలిపోయింది. సురక్షితంగా దిగినబూస్టర్లను తదుపరి ప్రయోగాల్లో ఉపయోగిస్తారు.


డెల్టా-4 కన్నా రెట్టింపు

ఫాల్కన్ హెవీ.. దిగువ భూ కక్ష్యలోకి 70 టన్నుల పేలోడ్‌ను ప్రవేశపెట్టగలదు. ఒక్కో ప్రయోగానికి 9 కోట్ల డాలర్లు ఖర్చవుతుంది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న శక్తిమంతమైన డెల్టా-4 రాకెట్ కన్నా రెట్టింపు బరువును మోసుకెళ్లగలదు. తాజా విజయంతో శాటర్న్-5 రాకెట్ల శకం తర్వాత.. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వాహకనౌకగా ఫాల్కన్ హెవీ ఘనత సాధించింది. ఇటు భూ కక్ష్య ఆవలకు పేలోడ్‌ను తీసుకువెళ్లిన తొలి ప్రైవేటు రాకెట్‌గానూ ఖ్యాతికెక్కింది.

సౌర కక్ష్యలోకి కారు..

మస్క్‌కే చెందిన టెస్లా సంస్థ రూపొందించిన రోడ్‌స్టర్ స్పోర్ట్స్ కారును ఈ రాకెట్‌లో పంపారు. 'అంగారకుడి కక్ష్య'లో దీన్ని ప్రవేశపెట్టి.. సూర్యుడి చుట్టూ తిరిగేలా చేయాలని భావించారు. అయితే మూడోసారి ఇంధనాన్ని మండించే ప్రక్రియలో.. కారు అనుకున్నదాని కన్నా ముందుకు వెళ్లింది. దీంతో అంగారకుడు, బృహస్పతి మధ్యలో ఉన్న.. గ్రహశకలాల వరుస వైపుగా అది పయనిస్తోంది. ఇది ఎన్నిరోజులు అంతరిక్షంలో మనుగడలో ఉంటున్నదానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ కారుకు మూడు కెమెరాలు ఏర్పాటు చేసి.. వాటి దృశ్యాలను ప్రత్యక్షప్రసారం చేశారు. కారు డ్రైవర్ సీటులో వ్యోమగామి బొమ్మను కూర్చోబెట్టారు.

ఇదీ సంగతి!



అడుక్కోటానికి నీకు మరో పాట దొరకలేదా?!

సెకనుకు గరిష్ఠంగా జీబీపీఎస్ వేగం

- టీ-ఫైబర్ ప్రాజెక్టు లక్ష్యమిదే
- ఇప్పటికే 30 వేల కి.మీ. కేబుల్ పూర్తి
- ఈ నెల 19న ప్రయోగాత్మకంగా ప్రారంభం
- టీ-ఫైబర్ ప్రాజెక్టు ఎండీ సుజయ్ కారంపూరి

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో ఇంటింటికీ అంతర్జాలం (ఇంటర్నెట్) అందించేందుకు చేపట్టిన టీ-ఫైబర్ ప్రాజెక్టు పూర్తయితే గరిష్ఠంగా సెకనుకు ఒక జీబీ వేగంతో కూడిన బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి వస్తుందని ఆ ప్రాజెక్టు ఎండీ సుజయ్ కారంపూరి తెలిపారు. పూర్తిస్థాయిలో ఈ పథకం అందుబాటులోకి వస్తే గ్రామీణ జీవన విధానంలో మార్పులతో పాటు జీవన ప్రమాణాలు మరింతగా పెరుగుతాయన్నారు. గ్రామీణులకు వైద్య ఆరోగ్య సమస్యల పరిష్కారం, వాస్తవిక శిక్షణ (వర్చువల్ లెర్నింగ్), ఒకే సమయంలో ఆన్‌లైన్ ద్వారా పాఠ్యాంశాల బోధనతో పాటు సందేహాల



నివృత్తి, పంటల సాగు, మార్కెటింగ్, యువతకు ఉపాధి లభించడం సహా సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నూతన ఆవిష్కరణలకు వీలుందని పేర్కొన్నారు. టీ-ఫైబర్ ద్వారా అందించే సేవలకు వసూలు చేసే రుసుములు మిగతా ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలతో పోలిస్తే తక్కువగా ఉంటాయని చెప్పారు. ఈ నెల 19 నుంచి హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సందర్భంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని నాలుగు గ్రామాల్లో తెలంగాణ సాంకేతిక పరిజ్ఞాన ప్రదర్శన నెట్‌వర్క్ పేరిట ప్రయోగాత్మక ప్రాజెక్టు అమల్లోకి వస్తుందన్నారు. ఒకే కనెక్షన్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్, హెడ్‌డీ నాణ్యతో కూడిన టీవీ కార్యక్రమాలు తదితర సేవలు అందించేందుకు వీలవుతుందని వివరించారు. బుధవారం ఆయన టీ-ఫైబర్ ప్రాజెక్టు విశేషాలను 'ఈనాడు'కు వివరించారు.

- రాష్ట్రస్థాయి నుంచి మండల కేంద్రం.. అక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాలకు ఒకేరకమైన వేగంతో కూడిన బ్రాడ్‌బ్యాండ్ వ్యవస్థను నిర్మిస్తున్నాం. గరిష్ఠంగా సెకనుకు ఒక జీబీ వేగంతో కూడిన ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుంది.
- ప్రభుత్వం దాదాపు రూ.5500కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టింది. 2018 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు 33వేల కి.మీ మేర కేబుల్ వేశాము. భూగర్భ మార్గం అందుబాటులో లేని చోట విద్యుత్తుశాఖ సహకారంతో స్తంభాలపై నుంచి కేబుల్ వేస్తున్నాం.
- తెలంగాణ చేపట్టిన టీ-ఫైబర్ ప్రాజెక్టులో భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ (బీబీఎన్) ప్రాజెక్టు అంతర్భాగంగా మారింది. మండలాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యాన్ని కల్పించేందుకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నిర్మాణాన్ని బీబీఎన్ నిధులతో చేపడుతున్నాం. గతంలోనే బీబీఎన్‌లో భాగంగా పూర్వ ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో పనులు మొదలయ్యాయి.
- ఇంటింటికీ అంతర్జాలం కింద ప్రతి గృహానికి ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ద్వారా కనెక్షన్లు ఇస్తాం. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఉచిత వైఫై సేవలు అందించే విషయమై మున్సిపల్ ఛైర్మన్లు, గ్రామ సర్పంచులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.
- టీ-ఫైబర్ అందుబాటులోకి వస్తే సర్వీసు ఆధారిత ఉద్యోగాలు గ్రామీణులకు అందుబాటులోకి వస్తాయి. బీపీవో సేవలు, కళలు, వృత్తినైపుణ్య శిక్షణ సొంతంగా అందించవచ్చు. రైతులు ఏయే పంటలు వేయాలి? తదితర వివరాలు తెలుసుకోవచ్చు. ఒకే రకమైనవి ఎక్కువగా ఉంటే ఇతర పంటలకు వెళ్లేందుకు వీలవుతుంది.
- టీ-ఫైబర్ ప్రయోగాత్మక ప్రాజెక్టును రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో చేపట్టేందుకు సిస్కో, నోకియా, స్టెరిలైన్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌ఎస్‌పీఎల్, హెచ్‌పీ సంస్థలు ముందుకొచ్చాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సొంతగా రూ.13కోట్లు వెచ్చించి పరికరాలు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సాంకేతికత(టెక్నాలజీ)పై అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ సిబ్బందికి శిక్షణ, బ్రాడ్‌బ్యాండ్ వినియోగం, ఈ-సేవలు తదితర విషయాలను వివరిస్తారు.
- టీ-ఫైబర్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ప్రజలకు సేవలు అందించేందుకు ప్రైవేటు సంస్థలు పోటీ పడే అవకాశముంది. దీంతో తక్కువ ధరలోనే సేవలు లభిస్తాయి. ప్రైవేటు సంస్థలు ఎంఎస్‌వోలుగా వ్యవహరించే అవకాశముంది.

ఆంధ్రా ఉద్యోగుల్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు

తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల ఐకాస

సోమాజిగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ నుంచి రిలీవ్ చేసిన ఆంధ్రా ఉద్యోగుల్ని ఎట్టి పరిస్థితిలోనూ తీసుకునేందుకు వీల్లేదని తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల ఐకాస పేర్కొంది. యాజమాన్యాలు వెనక్కి తగ్గి వారిని తీసుకునే ప్రయత్నం చేస్తే ఉద్యమం తీవ్రతరం చేయడానికి వెనుకాడేది లేదని హెచ్చరించింది. విద్యుత్తు సంస్థలోని పలు సంఘాలతో ఏర్పడిన తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల ఐకాస బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఐకాస కన్వీనర్ అంజయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. టీఎన్జీవోస్ అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజన తగదని న్యాయస్థానం ఉత్తర్వులు వెలువడటం విచారకరమన్నారు. ఉద్యోగుల విషయంలో యాజమాన్యం అలసత్వం వహిస్తే ఊరుకునేదిలేదన్నారు. ఐకాస ఛైర్మన్ శివాజీ మాట్లాడుతూ.. ఆంధ్రాలో తెలంగాణ వారిని ఎలా వెనక్కు పంపారో ఇక్కడి నుంచీ అలాగే పంపించాల్సిందేనన్నారు. నేతలు థామస్‌రెడ్డి, జానయ్య తదితరులు మాట్లాడారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్ ఉత్తర్వులు జారీచేశారు. స్టడీ సర్కిల్‌లో తరచూ గొడవల నేపథ్యంలో సంస్థ పరిపాలన బాధ్యతలను ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు.

ఐటీ కాంగ్రెస్ ఏర్పాట్లపై కేటీఆర్ సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ ఐటీ కాంగ్రెస్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 19 నుంచి హైదరాబాద్‌లో సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ విభాగాలు ఇప్పటికే కార్యాచరణను అమలు చేస్తున్నాయని తెలిపారు. ఐటీ కాంగ్రెస్ ఏర్పాట్ల గురించి బుధవారమిక్కడ నాస్కామ్ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్, సయ్యెంట్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నానీ, ఐటీ శాఖ కార్యదర్శులతో కేటీఆర్ చర్చించారు. ఈ సదస్సు రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి గర్వకారణమని మంత్రి చెప్పారు. సదస్సుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆహ్వానిస్తున్నామని... శ్రీలంక ప్రధాని విక్రమసింఘే, కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, సీఎం కేసీఆర్‌లతోపాటు కెనడా, చైనా, నైజీరియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గానిస్తాన్‌లకు చెందిన మంత్రులు పాల్గొంటారని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఐటీ కంపెనీలకు చెందిన ఉన్నత స్థాయి అధికారులు హాజరవుతారని వెల్లడించారు.

26, 27 తేదీల్లో జాతీయ ఈ-పరిపాలన సదస్సు

జాతీయ ఈ-పరిపాలన సదస్సును ఈ నెల 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించాలని కేంద్ర ఐటీ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు హైటెక్స్‌లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

అధునాతన హంగులతో యూపీలో 'మేఘా' విద్యుత్తు ప్రాజెక్టు

హైదరాబాద్: దేశంలోనే ప్రైవేటు రంగంలో అతిపెద్ద విద్యుత్తు సరఫరా (పవర్ ట్రాన్స్‌మిషన్) ప్రాజెక్టును మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సంస్థ ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రారంభించింది. 13,220 ఎంవీఏ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు పనులు 2011 మే 31న ప్రారంభం కాగా ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తయ్యాయి. హైదరాబాద్ కేంద్రంగా దేశ విదేశాల్లో పనులు చేపడుతున్న మేఘా సంస్థ ఈ రూ. 4,150 కోట్ల 'వెస్టర్న్ యూపీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ (డబ్ల్యూయూపీపీటీసీఎల్)'ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తిచేసింది. మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల తర్వాత.. తెలుగు రాష్ట్రాల విద్యుదుత్పాదక సామర్థ్యంతో సమానంగా దీని సామర్థ్యం ఉన్నట్లు ఎంఈఐఎల్ బుధవారం వెల్లడించింది. 765 కిలోవాట్ల ఈ ప్రాజెక్టులో తొలిసారిగా కాలుష్య రహిత గ్యాస్ ఇన్సులేటెడ్ (జీఐఎస్) ఉప కేంద్రాల (సబ్‌స్టేషన్లు)ను నిర్మించింది. వీటితో నిర్వహణ సమస్యలు, ప్రమాదాలు తగ్గడంతో పాటు.. విద్యుత్తు సరఫరా, పంపిణీ వ్యవస్థ మెరుగ్గా ఉంటుంది. 7 ఉపకేంద్రాలు, 2 సరఫరా లైన్లతో బూట్ (బిల్ట్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 35 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలను కూడా మేఘా చేపడుతుంది. దీని పరిధిలో పశ్చిమ యూపీలోని 10 జిల్లాలకు విద్యుత్తు సరఫరా అవుతుంది. మొత్తం 18 రైల్వే క్రాసింగులు, 17 జాతీయ రహదారులు, 4 నదులు, 88 పవర్‌లైన్ల క్రాసింగుల మీదుగా ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. అవాంతరాలేవైనా ఎదురై సరఫరా నిలిచిపోయినా గంటల వ్యవధిలోనే పునరుద్ధరించే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. తెలుగు రాష్ట్రాల్లో మిషన్ భగీరథ, పట్టిసీమ, హంద్రీనీవా, పురుషోత్తపట్నం, భక్తరామదాసు లాంటి ప్రాజెక్టులతో పాటు, ప్రతిష్ఠాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టులోని కొన్ని ప్యాకేజీల నిర్మాణ పనులను కూడా మేఘా చేపట్టింది.

నేరగాళ్లను జల్లెడపట్టే కళ్లద్దాలు

కృత్రిమ మేధస్సు, బిగ్‌డేటాల సాయంతో చైనా అభివృద్ధి

బీజింగ్: జన సమూహంలో నక్కిన నేరగాళ్లను పట్టేసేందుకు హైటెక్ కళ్లద్దాలను చైనా అభివృద్ధి చేసింది. కృత్రిమ మేధస్సు మొదలుకొని బిగ్‌డేటా వరకూ అధునాతన సాంకేతికతలను దీనిలో ఉపయోగించింది. ఈ పరిజ్ఞానాన్ని సీసీటీవీ కెమెరాలతో అనుసంధానించి నిఘా వ్యవస్థనూ సిద్ధంచేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ కళ్లద్దాలను ఇటీవల చైనా కొత్త సంవత్సర వేడుకల సమయంలో పరీక్షించారు. తూర్పు షెంఝౌ నగర రైల్వే స్టేషన్‌లో వీటిని ధరించి పోలీసులు. . నేరగాళ్లను జల్లెడపట్టారు. ముఖాలను గుర్తుపట్టే సాంకేతికతను ఈ అద్దాల్లో నిక్షిప్తంచేశారు. వీటికి ప్రత్యేక కెమెరాలు ఏర్పాటుచేశారు. పోలీసుల సమాచార నిధిలో నమోదైన నేరగాళ్లు తమ ఎదురుగా వచ్చినప్పుడు అప్రమత్తం చేయడం వీటి ప్రత్యేకత. 'అచ్చంగా గూగుల్ గ్లాస్‌లను తలపించేలా ఉన్న ఈ కళ్లద్దాలు పోలీసుల సమాచార నిధితో అనుసంధానమై ఉన్నాయి. వీటిని పెట్టుకొని రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికుల్లో నేరగాళ్లను పోలీసులు గాలించారు. దీంతో ఏడుగురు నిందితులు చిక్కారు. మానవుల అక్రమ రవాణా మొదలుకొని రోడ్డు ప్రమాదాలు చేసి తప్పించుకొని తిరుగుతున్నవారు వీరిలో ఉన్నారు'అని మీడియాలో వార్తలు వచ్చాయి. 'కళ్లద్దాలు సేకరించే ముఖచిత్రాలు ఎప్పటికప్పుడు సమాచార నిధిలోకి చేరుతుంటాయి. అక్కడ నిందితుల చిత్రాలతో వీటిని సరిపోలుస్తుంటారు. దీంతో నేరగాళ్లను ఇట్టే పట్టుకోవచ్చు'అని హెనాన్ ప్రావిన్స్ అధికారి జాంగ్ షియావో లెయి తెలిపారు. ఇదివరకు సమాచార నిధిలోని ముఖచిత్రాలతో సరిపోల్చాలంటే ఓ వ్యక్తికి సంబంధించి భిన్న కోణాల్లో తీసిన చిత్రాలు అవసరమయ్యేవి. అయితే తాజా కళ్లద్దాలతో తీసిన ఒక చిత్రంతో చక్కగా సమాచార నిధిని జల్లెడ పట్టేయొచ్చుట. భారీ స్థాయిలో ప్రజల సమాచారం సేకరిస్తున్నారంటూ ఆందోళనలు వెల్లువెత్తుతున్నప్పటికీ.. కృత్రిమ మేధస్సు, బిగ్‌డేటాల సాయంతో స్మార్ట్ నిఘా వ్యవస్థను ఏర్పాటుచేయాలని చైనా ప్రణాళిక సాగిస్తోంది.

10న ధ్రువపత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఆర్ఐఈఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలల్లోకి టీఎస్‌పీఎస్సీ ద్వారా ఎంపికైన పీజీటీ తెలుగు, హిందీ, ఆంగ్లం, భౌతిక, జీవ శాస్త్ర అభ్యర్థులకు ఈ నెల 10న నిజ ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని సంస్థ కార్యదర్శి ఎ.సత్యనారాయణరెడ్డి బుధవారం తెలిపారు. అభ్యర్థులు నాంపల్లిలోని గగన్ విహార్ 4వ అంతస్తులోని సంస్థ కార్యాలయానికి ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని కోరారు.



సమ్మక్కదేవత పూజామందిరంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఘనంగా తిరుగువారం పండుగ

ముగిసిన మేడారం మహాజాతర

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: జనవరి 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు నిర్వహించిన మేడారం మహా జాతర తంతు తిరుగువారం పండుగతో ముగిసింది. బుధవారం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు ఆలయాల్లో ఘనంగా తిరుగువారం పండుగను జరిపారు. ఉదయాన్నే ఆదివాసీల ఆడపడుచులు వనదేవతల ఆలయాలను అలికి ముగ్గులు వేసి దేవతల పూజాసామగ్రి(అడేరాలను) శుభ్రం చేశారు. పూజారులు, వారి బంధువులు, గ్రామస్థులు కుటుంబసమేతంగా ఆలయానికి వెళ్లి.. చీర, సారె, బెల్లం, పూలు, కొబ్బరికాయలతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. మాఘశుద్ధ పౌర్ణమికి రెండువారాల ముందు శుద్ధి పండుగతో జాతర పూజలు మొదలయ్యాయి. తర్వాత మండమెలిగే పండుగ, ప్రధాన ఉత్సవం జరిగింది. చివరకు తిరుగువారం పండుగతో జాతర తంతు పూర్తయింది. ఈసారి జాతరకు సుమారు కోటి 25 లక్షల మందికిపైగా భక్తులు వనదేవతలను దర్శించకున్నారు. ఇంకా మేడారానికి భక్తులు తరలివస్తున్నారు. గురు, శుక్రవారాల్లో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని పగిడిద్దెరాజు ఆలయం వద్ద తిరుగువారం జాతర జరుగుతుంది.

16న విద్యార్థులతో ప్రధాని ముఖాముఖీ

పరీక్షల ఒత్తిడి తగ్గించుకోవడంపై సూచనలు

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని ఎలా అధిగమించాలి? అన్న అంశంపై ఈ నెల 16న పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులతో ప్రధాని మోదీ ముఖాముఖీ మాట్లాడనున్నారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి పైబడిన విద్యార్థులతో ప్రధాని ముఖాముఖీ కార్యక్రమం దూరదర్శన్ ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. దాన్ని విద్యార్థులు వీక్షించేందుకు వీలుగా పాఠశాలల్లో ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ కమిషనర్ కిషన్ డీఈఓలను ఆదేశించారు. ప్రశ్నలు అడగదలచుకుంటే innovate.mygov.in అనే వెబ్‌సైట్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈనాడు

బెయిలే న్యాయబద్ధం

'బొందితో నరకానికి' నకళ్లుగా ప్రస్ఫుటమవుతున్నాయి భారతావనిలో జైళ్లు. పరివర్తనాలయాలన్న ఆదర్శం పుస్తకానికే పరిమితమై నిండుతల ఆక్రందనలతో ప్రతిధ్వనిస్తున్నాయి దేశవ్యాప్తంగా కారాగారాలు! 'అసలేం జరుగుతోంది... ఖైదీలు జైళ్లలోనే మగ్గిపోతున్నారు... జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ సిఫార్సు చేసినప్పటికీ వారిని విడుదల చెయ్యకపోవడం ఏమిటి?'- నిరుడు అక్టోబరు రెండోవారంలో సుప్రీంకోర్టు వ్యక్తీకరించిన ఆగ్రహం అది. పెద్ద సంఖ్యలో ఖైదీలు జైళ్లలోనే కునారిల్లడం వారి హక్కుల్ని తొక్కిపట్టడమే అవుతుందని నాడు ఆవేదన చెందిన జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనమే, తాజాగా విస్పష్ట ఆదేశాలతో న్యాయమూర్తులకు విధివిహిత బాధ్యతల్ని గుర్తుచేసింది. 'దోషిగా రుజువయ్యేదాకా ప్రతి వ్యక్తీ నిర్దోషి; బెయిలు ఇవ్వాలన్నది సాధారణ నిబంధన, జైలుకు పంపడమన్నది ప్రత్యేక సందర్భాల్లోనే చెయ్యాల్సింది'- ఈ రెండూ న్యాయ వ్యవస్థ అనుసరణీయ సూత్రాలు. దురదృష్టవశాత్తు వాటిని విస్మరించబట్టే ఏటికేడు ఎంతో మంది దీర్ఘకాలం జైళ్లలో మగ్గిపోవాల్సిన దుస్థితి దాపురిస్తోందన్న 'సుప్రీం' న్యాయపాలిక సూత్రీకరణలో వీసమెత్తు దోషం లేదు. దేశీయంగా 1,382 కారాగారాల్లో ఖైదీలు అమానుష పరిస్థితుల్లో బతుకీడుస్తున్న వైనాన్ని తప్పుపడుతూ ఎప్పటికప్పుడు జైళ్ల నిర్వహణలో మేలిమి సంస్కరణలను సూచిస్తున్న ధర్మాసనం ఈసారి కొన్ని విస్పష్ట ఆదేశాలు జారీ చేసింది. నిందితులకు బెయిలు అనుగ్రహించడం న్యాయమూర్తి విచక్షణాధికార పరిధిలోని అంశమైనా- 'బెయిలు నిరాకరణ సరైనదేనా, బెయిలు షరతుల్ని పాటించే స్తోమత నిందితులకు ఉందా' అన్న అంశాలపై ఆత్మావలోకనం జరగాలన్న ధర్మాసనం సూచన ఎంతో మన్నికైనది; మరెంతో మానవీయమైనది. ఆ తరహా సద్వివేచన దేశవ్యాప్తంగా న్యాయాలయాల్లో ఏ మేరకు నేడు ప్రస్ఫుటమవుతోందో- చీకటి కొట్లల్లో పొగచూరిపోతున్న బడుగుల బతుకులే చెబుతున్నాయి!

'నిందితుల్ని శిక్షించేలా బెయిలును బిగపట్టకూడదు'- ఈ సమున్నత ఆదర్శానికి కోల్‌కతా ఉన్నత న్యాయస్థానం దాదాపు తొమ్మిది దశాబ్దాల క్రితమే గొడుగు పట్టింది. దర్యాప్తునకు నిందితులు సహకరిస్తున్నా, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం లేకున్నా, మొట్టమొదటిసారి నేరారోపణలు ఎదుర్కొంటున్నా, బెయిలు మంజూరును పరిశీలించవచ్చునని తాజాగా 'సుప్రీం' ధర్మాసనం ఉద్బోధిస్తోంది. ఇండియాలోని సుమారు నాలుగు లక్షల పాతిక వేల మంది ఖైదీల్లో మూడింట రెండొంతులకుపైగా విచారణను ఎదుర్కొంటున్నవారే. ప్రపంచవ్యాప్తంగా విచారణ ఖైదీల సగటు 32 శాతం; అంతకు రెట్టింపునకు పైగా భారతీయ జైళ్లలో మగ్గిపోవడం దేశీయంగా నేరన్యాయ అవస్థకు దర్పణం పట్టేదే! విచారణ ఖైదీలుగా ఏళ్లతరబడి కారాగార క్లేశాలు అనుభవిస్తున్నవారిలో 70 శాతం నిరక్షరాస్యులని, 53 శాతం ముస్లిములు, దళితులు, గిరిజనులని అధ్యయనాలు చాటుతున్నాయి. బెయిలు లభించినా పేదరికం కారణంగా పూచీకత్తులు సమర్పించలేక వందల సంఖ్యలో ఖైదీలు కటకటాల్లోనే కునారిల్లుతుండటం పట్ల దిల్లీ హైకోర్టు ఏడు వారాల క్రితం ఆవేదన వ్యక్తీకరించింది. తీవ్ర నేరాభియోగాలు ఎదుర్కొంటున్నవారికీ ప్రాథమిక హక్కులు ఉంటాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని విస్మరించజాలమని ఉద్ఘాటించింది. బెయిలు వచ్చినా తిహార్ జైలు దాటిరాని 253 మంది కేసులు విచారిస్తూ అలాంటివారికి ఉపశమనం కల్పించేలా విచారణ కోర్టులకు పలు ఆదేశాలు జారీ చేసింది. ఉన్నత న్యాయపాలికలో కారాగారాల సంస్కరణాభిలాష, ఖైదీలపట్ల మానవీయ స్పందన పదేపదే వ్యక్తమవుతున్నా ఆ న్యాయస్ఫూర్తి దిగువ స్థాయి కోర్టుల దాకా ఇంకక పోవడమే- జైళ్ల కిక్కిరిసిపోవడానికి కారణభూతమవుతోంది. డబ్బు దాబు గల పురాణ నేరగాళ్లు బోరవిరుచుకొని తిరుగుతుంటే, నోరువాయి లేని అభాగ్య నిందితులు కొడిగట్టిన దీపాల్లా దుస్థితి రాజ్యమేలుతోంది!

కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఇటీవల పార్లమెంటులో వెల్లడించిన వివరాల మేరకు- 2015లో 2.82 లక్షలుగా ఉన్న విచారణలోని ఖైదీల సంఖ్య 2016లో మరో నాలుగు శాతం పెరిగి 2.93 లక్షలకు చేరింది. విచారణలోని ఖైదీలంతా నేరం చేసినవారు అయి ఉండక పోవచ్చు. బెయిలు లభించక, ఒకవేళ వచ్చినా పూచీకత్తులు సమర్పించలేక బందిఖానాల్లో మగ్గిపోతున్నారు. ఒకవేళ వాళ్ల దోషిత్వం రుజువైతే పడే శిక్షాకాలాన్ని మించి జైళ్లలోనే మగ్గిపోతున్న లక్షలాది అభాగ్యుల కష్టాలా కడగండ్లను గమనిస్తే మనసున్న ప్రతి గుండె చెమర్చక మానదు! హైకోర్టుల్లో దోషిత్వ నిర్ధారణ తీర్పులపై అప్పీలు చేసుకొన్న ఖైదీలకు వారి వ్యాజ్యాల పరిస్థితి, పురోగతి ఎప్పటికప్పుడు తెలియజేయాలని సుప్రీంకోర్టు మున్నుపే ఆదేశించింది. ఆయా కేసుల పురోగతి సమాచారాన్ని, ఇతర న్యాయసహాయం లభించే అవకాశాల్ని ఖైదీలకు పారాలీగల్ స్వచ్ఛంద కార్యకర్తలు తెలియజెప్పాలని నిర్దేశించింది. 'సుప్రీం' గడప తొక్కినవారి సంగతి సరే; మొదటి అంచె సైతం దాటలేక మౌనంగా రోదిస్తున్న అభాగ్యుల మాటేమిటి? విచారణకు నోచుకోకుండా వివిధ ఆరోపణల కింద గరిష్ఠ శిక్షాకాలంలో సగం దాకా కారాగారవాసం పూర్తి చేసినవారందరికీ విముక్తి ప్రసాదించాలని 2014 సెప్టెంబరులో సుప్రీంకోర్టు ఆదేశించింది. తదనుగుణమైన శాసన సంస్కరణల కోసం న్యాయసంఘమూ నిర్దుష్ట సిఫార్సులు చేసింది. అవన్నీ ఏ గంగలో కొట్టుకుపోయినట్లు? వృద్ధాప్యంలో పడి, నయంకాని వ్యాధుల విష పరిష్వంగంలో చిక్కి, కాటికి కాళ్లు చాపుకొన్న ఖైదీలపట్ల మానవతాదృక్పథంతో వ్యవహరించాలన్న 2006 సెప్టెంబరునాటి ఉమ్మడి హైకోర్టు ఆదేశాల అమలుకూ దిక్కులేదు. మన నేరన్యాయ వ్యవస్థనే బోనెక్కించే స్థాయిలో ఈ మానవ హక్కుల ఉల్లంఘనలు ఇంకెన్నేళ్లు?

భూ వివాదాలకిక సులభ పరిష్కారం

భూములకు సంబంధించి అనేక సమస్యలు వస్తుంటాయి. ఏ భూసమస్యకు ఏ చట్టంలో పరిష్కారం ఉందో, ఏ అధికారిని లేదా ఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించాలో చాలామందికి తెలియని పరిస్థితి దేశవ్యాప్తంగా నెలకొని ఉంది. ప్రతి రాష్ట్రంలో వందల సంఖ్యలో భూచట్టాలు ఉన్నాయి. న్యాయస్థానాల్లో లక్షల సంఖ్యలో భూ వివాదాలు పేరుకుపోతున్నాయి. నిరుడు నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం సివిల్ కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్న వ్యాజ్యాల్లో మూడింట రెండొంతులు భూ తగాదాలే. దేశవ్యాప్తంగా దాదాపు అర కోటి వరకు భూ వివాదాలు సివిల్ కోర్టుల్లో ఉన్నాయి. వీటికి రెవిన్యూ కోర్టుల్లో ఉన్న భూమి తగాదాలు అదనం. భూవివాదాల్లో ఉన్న వ్యక్తులు కోర్టుకు హాజరుకావడానికయ్యే ప్రయాణ, భోజన ఖర్చులు, కోల్పోయే వేతనాల విలువ దాదాపు రూ.15 వేలకోట్లని అంచనా. కోర్టుల్లో ఉన్న భూవివాదాల్లో తొంభై శాతానికి పైగా కేసులు వార్షికాదాయం లక్ష రూపాయలకన్నా తక్కువ ఉన్న పేదవారివే. ఈ కోర్టుఖర్చులు వారిని మరింత పేదవారిగా మారుస్తున్నాయి.

సంక్లిష్ట ప్రక్రియ

చట్టాల్లోని సంక్లిష్టత, వాస్తవాన్ని ప్రతిబింబించని రికార్డులు భూవివాదాలకు ప్రధాన కారణాలు. ప్రతి రాష్ట్రంలో పరిపాలన, హక్కులు ఇతర భూసంబంధ అంశాలపై వందల్లో ఉన్న చట్టాలు, వాటిలోని సంక్లిష్టత, వైరుధ్యాలు వివాదాలు పెచ్చరిల్లడానికి కారణమవుతున్నాయి. వివాదాల పరిష్కారానికీ అవే అడ్డంకిగా మారుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే 220కి పైగా భూచట్టాలు అమలులో ఉన్నాయి. నియమాలు, ప్రభుత్వ ఉత్తర్వులనూ కలుపుకొంటే ఈ సంఖ్య మరెన్నో రెట్లు ఉంటుందన్నది చేదు వాస్తవం. రెండు రాష్ట్రాల్లో భూచట్టాలు ఎన్ని ఉన్నాయని ప్రశ్నించుకుంటే, సరైన సమాధానం చెప్పలేని దుస్థితి నెలకొని ఉంది. ఆయా చట్టాల పేర్లు ఏమిటో వాటిని అమలు చేయాల్సిన అధికారులకే తెలియడం లేదు. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటో సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఏ చట్టంలో ఏం ఉంది, ఆ చట్టం అమలు చేసే అధికారులు ఎవరు, వారి అధికారాలు ఏమిటి, భూయజమానులూ ప్రజల హక్కులేమిటి... వంటివి చాలా కొద్దిమంది మాత్రమే సమాధానం చెప్పగల ప్రశ్నలు. ఉభయ రాష్ట్రాల్లో రెండు శతాబ్దాల క్రితం చేసిన భూచట్టాలు సైతం నేటికీ అమలులో ఉన్నాయి. ఇప్పుడు అమలులో ఉన్న రెండు వందల పైచిలుకు చట్టాల్లో చాలావరకు కాలం చెల్లినవే. లక్ష్యాలు నెరవేరాక అనవసరంగా మిగిలిన చట్టాలూ అనేకం ఉన్నాయి. కొన్ని చట్టాలే ప్రస్తుత అవసరాలకు ఉపయుక్తమైనవి. చట్టాల్లోని వైరుధ్యాలు, ఒకే అంశంపై పలు చట్టాలు ఉండటం, కాలం చెల్లినవీ అమలులో ఉండటం వల్ల అనవసర గందరగోళం ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో చట్టాలు దురుపయోగమవుతుండటానికి అదో కారణంగా మారుతోంది.

ఏ భూసమస్యకు ఏ చట్టం వర్తిస్తుందో ప్రజలకు తెలిసి ఉండాలి. నిబంధనలు వారికి అర్థమయ్యేలా ఉండాలి. చట్టాలను అమలు చేసి తీర్పులిచ్చే వారికి అవగాహన ఉండాలి. చట్టబద్ధ పాలనకు ఇవన్నీ కనీస అవసరాలు. ఒక అంశంపై ఒకే చట్టం ఉండి, అది సులభమైన భాషలో ఉంటే ప్రజలకు అర్థం అవుతుంది. అమలు చేసేవారికి అవగాహన ఉంటుంది. కానీ, భూమికి సంబంధించి ఈ పరిస్థితి లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత రాష్ట్ర ప్రభుత్వం భూచట్టాలను సమీక్షించే కార్యక్రమం మొదలుపెట్టింది. రాష్ట్రంలో అమలులో ఉన్న భూచట్టాలన్నింటిని అధ్యయనంచేసి నేటి పరిస్థితులకు అనుగుణంగా తగు మార్పుచేర్పులు సూచించే బాధ్యతను నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయానికి అప్పగించింది. నల్సార్ ఒక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఇప్పుడున్న చట్టాల్లో కొన్ని మార్పులు సూచిస్తూ వాటన్నింటినీ కలిపి ఒక రెవిన్యూ స్మృతి(కోడ్)గా రూపొందిస్తే చాలా ఉపయుక్తంగా ఉంటుందని ఆ నివేదికలో పేర్కొంది. ఇటీవలి కాలంలో ముఖ్యమంత్రి చొరవతో భూచట్టాల్లో తగిన మార్పులకు కృషి జరుగుతోంది. కొన్నింటిలో ఇప్పటికే మార్పులు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాలంచెల్లిన భూచట్టాలను తొలగించడానికి విస్తృత కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. చట్టాలను సరళీకరించడానికి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడానికి భూచట్టాల్లో మార్పులు చేశారు.

గడచిన రెండు శతాబ్దాల్లో భూమి, భూ పరిపాలనకు సంబంధించి చేసిన చట్టాలను సరళీకరించి ఒకే రెవిన్యూ స్మృతి రూపంలో తెచ్చే ప్రయత్నం ఉమ్మడి రాష్ట్రంలో 1999వ సంవత్సరంలో మొదలైంది. కాలంచెల్లిన చట్టాలను తొలగిస్తూ అమలులో ఉన్న చట్టాలను కాలానుగుణంగా మార్చే ఒక మంచి ప్రయత్నానికి నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్న 191 భూచట్టాలను క్రోడీకరించి ఆంధ్రప్రదేశ్ భూమి రెవిన్యూ కోడ్ (1999)ని రూపొందించారు. ఈ రెవిన్యూ కోడ్‌లో 17 భాగాలు, 47 అధ్యాయాలు, 260 సెక్షన్లు ఉన్నాయి. దీన్ని అప్పటి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపినా ముందడుగు పడలేదు. రాష్ట్రపతి ఆమోదం రాలేదు. ఆపై ఎన్నికలు రావడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది.

లెక్కకు మిక్కిలిగా ఉన్న భూచట్టాలు, వాటి అమలులో ఇబ్బందులు, ప్రజల్లో ఉన్న గందరగోళాలకు పరిష్కారంగా ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర లా కమిషన్ సిఫార్సు మేరకు 2006లో ఉత్తర్ ప్రదేశ్ రెవిన్యూ స్మృతికి ఆ రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. దానికి 2012లో యూపీ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. 2016లో స్మృతికి సంబంధించిన నిబంధనలను రూపొందించి, అమలులోకి తీసుకువచ్చారు. ఇందులో మొత్తం 16 అధ్యాయాలు, 234 సెక్షన్లు ఉన్నాయి. ఉత్తర్ ప్రదేశ్ భూ పరిపాలన, భూమి హక్కులకు సంబంధించి అన్ని చట్టపరమైన అంశాలు ఈ స్మృతిలోనే ఉన్నాయి. ఇది అమలులోకి రాకముందు చేసిన 32 భూచట్టాలను రద్దు చేశారు. రద్దయిన చట్టాల్లో ఉన్న అంశాలన్నింటినీ తగు మార్పుచేర్పులతో ఈ స్మృతిలో పొందుపరచారు. ఈ స్మృతి వల్ల రెండేళ్లుగా భూపరిపాలన సులభతరమైందని, భూహక్కుల నిర్ధారణ, వివాదాల పరిష్కారం సత్వరం చేయగలుగుతున్నామని ఆ రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రజలు సైతం కొత్తగా వచ్చిన మార్పులను సహర్షంగా స్వాగతిస్తున్నారు.



బహుళ చట్టాల స్థానంలో రెవిన్యూస్మృతి

బిహార్ ఆదర్శం

బిహార్‌లోనూ వివిధ చట్టాల్లో గల అంశాలను క్రోడీకరించి 2009లో ఒక కొత్తచట్టం రూపొందించారు. తద్వారా అన్ని రకాల భూవివాదాలకు ఒకే వ్యవస్థ, ఒకే రకమైన పరిష్కార విధానాలను అమలులోకి తెచ్చారు. తక్కువ ఖర్చుతో తక్కువ వ్యవధిలో సులభమైన పద్ధతులద్వారా సమర్థంగా భూవివాదాలను పరిష్కరించాలనేదే ఈ చట్టం లక్ష్యం. ఏ వివాదానికి ఏ కోర్టుకు వెళ్ళాలి, ఏ పద్ధతిలో వెళ్ళాలి, ఎంతకాలంలో పరిష్కరిస్తారనే ప్రశ్నలకు ఈ చట్టంలోనే సమాధానాలున్నాయి. ఈ చట్టానికి భారత అత్యున్నత న్యాయస్థానం సైతం ఆమోదముద్ర వేసింది. గత ఎనిమిదేళ్ళలో కొన్ని వేల భూవివాదాలు పరిష్కారం అయ్యాయి. బిహార్‌లో భూసమస్యల పరిష్కారం సులభమైనట్లు, తక్కువ వ్యవధిలో సమస్యల్ని పరిష్కరించగలుగుతున్నట్లు అక్కడి అనుభవాలు చాటుతున్నాయి.

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇలాంటి భూవివాదాలే ముసురుకుని ఉన్నాయి. రెండు రాష్ట్రాల్లోని ప్రతి భూచట్టంలో వివాద పరిష్కార మార్గాలు, బాధ్యులైన అధికారులు, అనుసరించాల్సిన పద్ధతులు, విధివిధానాలపై వివరణ ఉంది. ఒక్కో రకమైన భూవివాదానికి వివిధ చట్టాల కింద వేర్వేరు చోట్లకు వెళ్లాల్సి ఉంటుంది. కోర్టులు, అధికారుల దృష్టికి భూమి వివాదాలను తీసుకెళ్లడానికి విభిన్నమైన పద్ధతులు, గడువులు ఉన్నాయి. ఈ క్లిష్టతల వల్లే బిహార్ చేసిన చట్టం, అమలులో ఎదురవుతున్న అనుభవాల ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లోనూ అదే తరహా చట్టాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఈ మేరకు సూచన చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భూరికార్డుల ఆధునికీకరణ, భూచట్టాల్లో మార్పుల ద్వారా భూపరిపాలనను మెరుగుపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్న దృష్ట్యా- భూముల అంశంపై ఉన్న చట్టాలు, ఉత్తర్వులు, నియమాలను ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం చేయాలి. రెండు రాష్ట్రాలూ భూ రెవిన్యూ స్మృతిని రూపొందించుకుంటే ప్రజలకు మేలు జరుగుతుంది. అభివృద్ధి కార్యక్రమాలూ వేగం పుంజుకొంటాయి. చట్టం అందరి చుట్టం కావాలంటే అది సరళంగా ఉండి, అందరికీ సులభంగా బోధపడేలా ఉండాలి. రెవిన్యూ స్మృతి రూపకల్పన ఆవైపు ఓ ముందడుగు అవుతుంది!


- ఎం.సునీల్ కుమార్

(రచయిత- అనుబంధ ఆచార్యులు, భూమి హక్కుల కేంద్రం, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం)

భూ సమస్యలు- కొన్ని గణాంకాలు

భూ హక్కుకు భద్రత ఉండాలంటే భూమి స్వాధీనంలో/అనుభవంలో ఉంటే సరిపోదు. ఆ భూమికి హక్కుదారు అని చెప్పే తగిన పత్రాలు ఉండాలి. వివిధ శాఖలు నిర్వహిస్తున్న భూమి రికార్డులలో పేరు నమోదు అయి ఉండాలి. ఇందులో ఏ ఒక్కటీ లేకపోయినా సమస్యే. భూమి ఉండి, తగిన పత్రాలు లేక, లేదా రికార్డుల్లో వివరాలు సరిగ్గా నమోదు కాక సమస్యల్లో చిక్కుకున్న భూముల అధికంగా ఉన్నాయన్నది అధ్యయనాల సారాంశం.

- గ్రామీణ ప్రాంతాల్లో వివాదంలో ఉన్న భూమి: 2.0 శాతం (ప్రణాళిక సంఘం అంచనాల ప్రకారం)
- పట్టణ పరిసర ప్రాంతాల్లో వివాదాల్లో ఉన్న భూమి: 28 శాతం
- సివిల్ కోర్టుల్లో ఉన్న భూ వివాదాలు: 66 శాతం
- హత్యలకు కారణమైన భూతగాదాలు: 12 శాతం (జాతీయ నేరనమోదు సంస్థ గణాంకాలు)
- భూ తగాదాల వల్ల ఏటా కోల్పోతున్న జాతీయ ఆదాయం: రూ.3,000 కోట్లకు పైగా... జీడీపీలో అది 1.3 శాతం
- భూవివాదాల్లో ఉన్న వ్యక్తులు కోర్టు వాయిదాలకు హాజరుకావడానికి చేస్తున్న వ్యయం: రూ.15 వేలకోట్లు
- ప్రతి గ్రామంలో భూ సమస్యలు: 100 నుంచి 200 వరకు
- జిల్లా కలెక్టర్లకు వస్తున్న అర్జీల్లో భూములకు సంబంధించినవి: 60 నుంచి 70 శాతం
- భూమిపై సరైన హక్కు పత్రాలు లేకపోవడంవల్ల ఎకరానికి రైతు కోల్పోతున్న లబ్ధి: రూ. 60 వేల నుంచి లక్ష వరకు (పంట రుణాలు, బీమా, పెట్టుబడి రాయితీ తదితరాల రూపంలో)



కులదీప్ నయ్యర్

ఉపాధి బాటలో పరిష్కారాలు

శ్రీనగర్‌లోని ప్రభుత్వాసుపత్రిపై లష్కరే తొయిబా మిలిటెంట్లు రెండు రోజుల క్రితం దాడికి తెగబడిన ఘటన సంచలనం సృష్టించింది. వ్యూహం ప్రకారం మాటువేసిన లష్కరే మూకలు ఇద్దరు పోలీసులను పాశవికంగా కాల్చి చంపి, హత్యకేసులో అరెస్టయి మూడేళ్లుగా శిక్ష అనుభవిస్తూ చికిత్స నిమిత్తం శ్రీనగర్ ఆసుపత్రికి వెళ్ళిన మహమ్మద్ నవీద్‌ను విడిపించుకు వెళ్ళడం ద్వారా ప్రభుత్వానికి ఒక రకంగా హెచ్చరిక సంకేతాలనే పంపాయి. కశ్మీర్‌పై ఉగ్రమూకలు అడపాదడపా విరుచుకుపడుతూ, చాటు దెబ్బతీసి మరీ భద్రతాదళాలను పొట్టనపెట్టుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా కశ్మీర్‌లో హింసను మాత్రం అడ్డుకోలేకపోతోంది. పాకిస్థానీ ఉగ్రమూకలు దాడిచేసి పట్టపగలు తమ సహచరుడిని విడిపించుకు వెళ్ళిన ఘటన భారతీయ భద్రతావ్యవస్థలోని లోపాలనూ బయటపెట్టింది. కశ్మీర్ లోయ అడుగడుగునా ఉగ్రమూకల అనుచర వర్గాలు విస్తరించి ఉన్నాయి. రాష్ట్రంలో ఎప్పుడు ఎక్కడ ఏం జరగబోతోందన్న విషయం వారికి ముందే తెలిసిపోతోంది. భారతీయ నిఘా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నా ఉగ్రమూకల ఆనుపానులు పసికట్టడంలో పూర్తిగా సఫలం కాలేకపోతోంది. మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం తమ వైఫల్యాన్ని బహిరంగంగానే అంగీకరిస్తోంది! ప్రతి చిన్న విషయానికీ రాళ్లు తీసుకొని వీధుల్లోకి వచ్చి, అల్లర్లకు పాల్పడుతున్న యువకులను ముఫ్తీ ప్రభుత్వం కొంతకాలం క్రితం అరెస్టు చేసింది. ఇటీవల ఏ కారణమూ లేకుండానే ఆ యువకులందరినీ ప్రభుత్వం విడిచిపెట్టింది. ఆ యువకులకు ప్రజల్లో కాస్తో కూస్తో సానుభూతి ఉండటమే అందుకు కారణమని విశ్లేషకుల అంచనా!

దశాబ్దాలుగా కశ్మీర్ లోయలో సంక్షోభం రాజేసిన యాసిన్ మాలిక్, షబ్బీర్ షా వంటి ఒకనాటి మిలిటెంట్లు ఇప్పుడు అక్కడ పూర్తిగా సమకాలీనతను కోల్పోయారు. ఆ రాష్ట్రంలో యువత ఎక్కడికక్కడ క్రియాశీలంగా మారి ఉద్యమిస్తోంది. ప్రత్యేక ఇస్లామిక్ దేశం వారి డిమాండుగా ఉంది. ఇండియా, పాకిస్థాన్లతో సంబంధం లేకుండా కశ్మీర్‌ను స్వతంత్ర ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే లక్ష్యంగా అక్కడి కొంతమంది యువత ఉద్యమిస్తున్నారు. కశ్మీర్ విషయంలో లష్కరే తొయిబా వంటి ఉగ్రవాద సంస్థలు ఒకవైపు, ఎక్కడికక్కడ ప్రేరేపితులైన యువతరం మరోవైపు- కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నారు. ఈ సమస్యలకు భారత్, పాకిస్థాన్‌ల మధ్య ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందన్న మాట వినిపిస్తోంది. అయితే ఉగ్రవాద మూకలను పాకిస్థాన్ ఎగదోయడం ఆగనంతవరకూ ఆ దేశంతో చర్చలకు కూర్చుని ప్రయోజనం లేదన్నది భారత్ వాదన. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదానికి కేంద్ర స్థానంగా ఉన్న



'కశ్మీర్'పై హేతుబద్ధ విధానం

పాకిస్థాన్ ఇకపై మారుతుందనుకోవడం అత్యాశే. సరిహద్దులు దాటుకొని అక్రమంగా పాకిస్థాన్‌నుంచి భారత్‌లోకి చొరబడుతున్న మిలిటెంట్లు కశ్మీర్‌లో అగ్గి రాజేస్తున్నారు.

కశ్మీర్ అంతటా పత్తేదార్లను ఏర్పాటు చేసుకొంటున్న ఉగ్రవాదులు స్థానిక ప్రజల సాయంతోనే ఆ రాష్ట్రంలో సంక్షోభం రాజేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా అదను కోసం పాకిస్థాన్ కాచుకొని కూర్చుంది. కొందరు కశ్మీరీ యువకులను రహస్యంగా తమ దేశానికి పిలిపించుకొని వారికి ఉగ్రవాద శిక్షణ ఇప్పించడంతోపాటు, ఆయుధాలనూ సరఫరా చేయడం ఇస్లామాబాద్ నాయకత్వానికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో ఉగ్రవాదులు, వారి సానుభూతిపరులతోపాటు పెద్దయెత్తున అమాయక ప్రజలూ అసువులు బాస్తున్నారు. ఏదో ఒక రోజున కశ్మీర్‌లో అంతర్యుద్ధం తరహా పరిస్థితులను సృష్టించాలన్నది పాకిస్థాన్ ప్రగాఢ ఆకాంక్ష. అనేక సంవత్సరాలుగా కశ్మీర్ రావణకాష్ఠంలా రగలడానికి కారణమిదే. కశ్మీర్ రాజకీయాల్లో యువ నాయకత్వం క్షేత్రస్థాయి వాస్తవాలను అర్థం చేసుకొని రాజకీయ వ్యూహాలను పరిణతంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న తరుణమిది. కాబట్టి, హింసాత్మక పంథాకు స్వస్తి చెప్పి పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానం ద్వారా ప్రజల మద్దతు కూడగట్టుకొనేందుకు వారు గట్టి ప్రయత్నం చేయాలి. చట్టసభల ద్వారా కశ్మీర్ సమస్యలను వినిపించి, వాటికి పరిష్కారాలు రాబట్టేందుకు కృషి చేయాలి. కేంద్రం నుంచి ఏ దశలోనూ కశ్మీర్‌కు ఉదార ఆర్థిక సాయం అందకపోవడం ఆ రాష్ట్రంలో సమస్యలకు అంటుకడుతోంది. గతంలో వివిధ ప్రభుత్వాలు కశ్మీర్‌కు అనేక ఆర్థిక ప్యాకేజీలను ప్రకటించాయి. వాటిలో ఏ ఒక్కటీ వాస్తవ రూపం దాల్చలేదు. రాజీవ్ గాంధీ హయాములో రూ. 2,000 కోట్ల ప్యాకేజీ ప్రకటించారు. ఆ తరవాత వరస వెంబడి వివిధ ప్రభుత్వాలు ఆర్థిక సాయం మాటలు వినిపిస్తూనే వచ్చాయి. కేంద్ర ప్రభుత్వాల స్థాయిలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నిజాయతీగా అమలు కాకపోవడం కశ్మీరీల అసహనానికి ఆజ్యం పోస్తోంది. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే ఏ ప్రాంతంలోనైనా యువత చాలావరకు శాంతిస్తుంది. కశ్మీర్‌లో లోపించింది అదే. అక్కడి ప్రజల అసంతృప్తిని అర్థం చేసుకోవడంలో దాదాపుగా ప్రభుత్వాలన్నీ విఫలమయ్యాయి.

పర్యాటకుల స్వర్గధామంగా కశ్మీర్ భాసించిన రోజుల్లో ఆ రాష్ట్రానికి ఇబ్బడిముబ్బడిగా ఆదాయం సమకూరింది. అక్కడి ప్రజల చేతుల్లో పుష్కలంగా డబ్బు ఉండేది. ఎప్పుడైతే హింస పెట్రేగిందో ఆ రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పింది. మునుపటిలా తమ రాష్ట్రానికి పర్యాటకులు రావడం కష్టమే అన్న విషయం అక్కడి ప్రజలకు అర్థమైంది. వ్యాపారాలు నడవక, ఉపాధి లేక, ఇళ్లు గడవక ఇబ్బందులు పడుతున్న కశ్మీరీ కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. హింసావిధ్వంసాలతో వారు పూర్తిగా విసిగిపోయి ఉన్నారు. ఒకవైపు భద్రతాదళాలు, మరోవైపు మిలిటెంట్లు కశ్మీరీలకు నిద్రలేని రాత్రులు మిగిల్చారు. కశ్మీరీల జీవన స్థితిగతులు అంతకంతకూ గతి తప్పుతున్నాయి. అభివృద్ధికోసం అక్కడి ప్రజలు మోహం వాచి ఉన్నారు. వట్టి మాటలు, అనవసర వాగ్దానాలతో వారిని మభ్యపుచ్చడం ఇక సాధ్యమయ్యే పనికాదు. మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా ఆలస్యంగా తెలుసుకొంది. ఆ రాష్ట్రంలో జవాబుదారీ పాలన ఎంత త్వరగా పాదుకొంటే అంత త్వరగా కశ్మీర్ ఒక కొలిక్కి వస్తుంది!

(రచయిత- ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్)

ఈనాడు లేఖలు

ఆన్‌లైన్ సేవలతో లబ్ధి

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వివిధ రంగాలకు విస్తరింపజేస్తున్నామని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చెబుతోంది. కార్యాచరణలో భాగంగా అన్ని విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థి సేవల్నీ ఆన్‌లైన్ చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటికే డాక్టర్ అంబేడ్కర్, ఇందిరాగాంధీ సార్వత్రిక వర్సిటీల వంటివి విభిన్న సేవల్ని వినూత్న పద్ధతుల్లో అందజేస్తున్నాయి. వీటితో పాటు ఇతరచోట్లా డిజిటలీకరణ ప్రక్రియ చేపట్టి వేగవంతం చేయడం వల్ల, లక్షలాది విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. పరీక్షల రుసుములతో పాటు వివిధ రకాల చెల్లింపుల్ని ఆన్‌లైన్‌లోనే కొనసాగిస్తే, ఆయా పనులన్నీ సులభతరమవుతాయి. అభ్యర్థులు సంబంధిత కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన అవసరం ఏర్పడదు. ధ్రువపత్రాలు తీసుకోవడంలో కూడా ఎవరికీ ఎటువంటి ఇబ్బందులూ ఎదురు కావు. విశ్వవిద్యాలయాల్లో పారదర్శకతకు పెద్దపీట వేసినట్లవుతుంది.

- కె.శ్రవణ్ కుమార్, వరంగల్

వన్యప్రాణుల్ని వేటాడుతున్నారు

అడవుల్లో స్వేచ్ఛగా సంచరించాల్సిన ప్రాణులు వేటగాళ్ల బారిన పడుతున్నాయి. ప్రధానంగా జయశంకర్ భూపాలపల్లితో పాటు మహబూబాబాద్, వరంగల్ గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు ఘోరంగా తయారయ్యాయి. సరిహద్దు గ్రామాలకు చెందిన కొందరు ముఠాలుగా ఏర్పడి, మూగ ప్రాణుల ఉసురు తీసి, వాటి మాంసాన్ని ఆటోలు, తదితర వాహనాల ద్వారా పట్టణాలకు తరలించి అందినకాడికి దండుకుంటున్నారు. దీన్ని అరికట్టడానికి అనువుగా వన్యప్రాణి సంరక్షణ చట్టం నిబంధనల్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు కఠినంగా అమలుచేయాలి. నేరాలకు పాల్పడే ముఠాలపై ఉక్కుపాదం మోపాలి. విచ్చలవిడిగా సాగుతున్న వేటను అరికట్టాలి.

- కె.సతీష్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి

శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలు

తెనాలి రామకృష్ణ కవి వేదాల్ని 'తొలి చదువులు'గా వర్ణించాడు. అవి జ్ఞానానికి సోపానాలు. జ్ఞానం మోక్షప్రాప్తికి ముఖ్య సాధనం. అందువల్ల మోక్షం సాధించేందుకు, చదువులకు గట్టి బంధం ఉందని అనేకులు నమ్ముతారు.

'గోవిందుణ్ని ఆశ్రయిస్తే ఆవలి గట్టుకు చేరుస్తాడు. కేవలం వ్యాకరణ పాండిత్యాన్నే నమ్ముకుంటే, నీకు ఒరిగేదేమీ ఉండదు' అన్నారు శంకర భగవత్పాదులు. 'సాలెపురుగు ఏ వేదాలు చదివిందని సాయుజ్యం పొందింది' అని ప్రశ్నించాడు ధూర్జటి మహాకవి. అంతేకాక 'సర్పానికి ఏ శాస్త్రాలు అలవడ్డాయి, ఏనుగు ఏ విద్యలో ప్రవీణురాలు' అంటూ లోకాన్ని నిలదీశాడు. వాటికి మోక్షం లభించడానికి కారణాలు తెలుసుకోవాలన్నాడు. 'చదువుల వల్ల పాండిత్యం లభిస్తుందేమో గాని, కైవల్యం మాత్రం కేవలం చదువులతోనే రాదు' అన్నదే ఆయన తీర్పు. పరమేశ్వరుడి పాదాల్ని ఆశ్రయించడమే జీవులకు పరమార్థమని ఆ వాదనల సారాంశం.

శ్రీ అంటే సాలెపురుగు. కాళం అంటే పాము. హస్తి అంటే ఏనుగు. ఆ మూడింటికీ ముక్తిని అనుగ్రహించిన దేవుడు శ్రీకాళహస్తీశ్వరుడు. ఆ గుడిగోపురాల నిర్మాణానికి, అది క్షేత్రంగా రూపొందడానికి పూర్వ సంఘటన ఇది. ఓ సాలీడుకు పుణ్యఫలంగా శివభక్తి అబ్బింది. అది కష్టపడి గూడు అల్లేది. ఆ విద్యలో అది- జాషువా చెప్పినట్లు 'ఏకిమీడు'. అంటే, చక్రవర్తి. దాని భక్తిని పరీక్షించాలని శివుడికి అనిపించింది. దీపాన్ని పెంచి, దారాల్ని దగ్ధం చేశాడు. సాలీడు జీవితకాలంపాటు నిర్మించిన గూడు క్షణంలో బూడిదగా మారింది. అది ఆవేశంతో ఆ దీపాన్నే మింగేయాలని పైకి దూకబోయింది. స్వామికి జాలి కలిగింది. దాన్ని రక్షించి, 'ఏం కావాలి' అని అడిగాడు. 'నీలో ఐక్యం అవుతాను' అంది. 'సరే' అన్నాడాయన. అందుకే, ఇప్పటికీ సాలీడు చిహ్నం శ్రీకాళహస్తి లింగరూపంలో స్పష్టంగా కనిపిస్తుంది.

మహా సర్పం ఒకటి పాతాళం నుంచి విలువైన మణిమాణిక్యాల్ని తెచ్చి శివలింగానికి అలంకారం చేసేది. ఒక ఏనుగు ఆ రత్నాల్ని చూసి 'రాళ్లూ రప్పలతో శివుడికి పూజలేమిటి' అని ఆగ్రహించింది. అక్కడి స్వర్ణముఖి నదిలో జలకాలాడి, తొండంతో ఆ నీళ్ళు తెచ్చి, శివలింగాకారాన్ని శుభ్రం చేసింది. బిల్వ పత్రాల్ని, పువ్వుల్ని అమర్చింది. కాసేపటికి పాము వచ్చి, 'శివుడి నెత్తిన ముళ్లకంపలు ఏమిటి' అని తొలగించింది. ఏనుగు రావడం, రత్నాల్ని తీసేయడం; పాము రావడం, పత్రిని ఊదేయడం- రోజూ ఇదే తంతు అయింది. చివరికి ఓరోజు పాము పగబట్టి, ఏనుగు తొండంలోకి దూరింది. కుంభస్థలాన్ని చేరి, నానారకాలుగా హింసపెట్టింది. ఏనుగుకు తిక్క రేగి, వేగంగా వెళ్లి కొండను ఢీకొట్టింది. కుంభం పగిలింది. పాము చితికింది. వాటి రక్తంతో రుద్రాభిషేకం జరిగిపోయింది. శివుడు ప్రసన్నుడయ్యాడు. వాటికి కైవల్యం అనుగ్రహించాడు.



అంతర్యామి

మనిషిలోని రోషావేశాలే ఈ కథలోని సాలెగూళ్లు! మనసులో ఎంతో కాలం నుంచి అల్లుకుపోయిన అవన్నీ- శివుడి పాదాల్ని ఆశ్రయించడంతో కాలి బూడిద అవుతాయి. రజో, తమో గుణాలకు పాము, ఏనుగు ప్రతీకలు. శివానుగ్రహంతో అవి సత్యంలో లీనమవుతాయి. లింగం అనే మాటకు 'సర్వస్వాన్నీ తనలో లీనం చేసుకొనేది' అని అర్థం. చరాచర సర్వ జగత్తు ఎందులో జనిస్తుందో, పెరిగి పెద్దదవుతుందో, తిరిగి లీనం అవుతుందో దాన్ని లింగం అంటారు. ఈశ్వరుడు లింగాకారుడు కావడంలోని రహస్యం అదే!

సాలె పురుగు, పాము, ఏనుగుల్ని తనలో లీనం చేసుకున్నదే కాళహస్తి శివలింగం. అందులో వాటి చిహ్నాల్ని భక్తులు గమనించి స్మరిస్తారు. శివుడికి ప్రీతిపాత్రులవుతారు.

మోక్షసాధనకు పాండిత్యంతో పని లేదంటూ- పామరులకు ధైర్యం చెప్పిన ప్రాణులవి. భక్తితో సాయుజ్యం సాధించి, మనిషికి ఆదర్శప్రాయంగా నిలిచిన జీవులవి. వాటి పేర్ల కలయిక ద్వారా, శివుడు- శ్రీకాళహస్తీశ్వరుడయ్యాడు. ఆ ఊరు- శ్రీకాళహస్తి అయింది.

- ఎర్రాప్రగడ రామకృష్ణ

మే 23, 24 తేదీల్లో టీఎస్ ఐసెట్- 2018

కేయూ క్యాంపస్(వరంగల్), న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏలలో ప్రవేశాల కోసం ఈ ఏడాది మే 23, 24 తేదీల్లో టీఎస్ఐసెట్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఐసెట్- 2018 షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈసారి నుంచి ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నట్లు, తెలంగాణతో పాటుగా ఆంధ్రప్రదేశ్‌లోనూ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. మే 23న రెండు సెషన్లలో, 24న ఒక సెషన్‌లో పరీక్షలుంటాయని చెప్పారు. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణపై అభ్యర్థుల్లో అవగాహన కల్పించడం కోసం మాదిరి పరీక్ష(మాక్ టెస్ట్)లను నిర్వహిస్తామన్నారు.

టీఎస్ఐసెట్ షెడ్యూల్..

- ★ ఈ నెల 22న ప్రవేశ ప్రకటన విడుదల
- ★ మార్చి 6 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- ★ ఏప్రిల్ 30 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తుల స్వీకరణ
- ★ రూ.500 అపరాధ రుసుంతో మే 5 వరకు, రూ.2000తో మే 10 వరకు, రూ.5000తో మే 14 వరకు, రూ.10వేల అపరాధ రుసుంతో మే 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ★ మే 7 నుంచి ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- ★ మే 23, 24 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్ష
- ★ మే 27న ప్రాథమిక కీ విడుదల. దీనిపై జూన్ 4 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ★ జూన్ 6న ఆఖరు కీ విడుదల.
- ★ దరఖాస్తు ఫారం ధర రూ.650, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.450

భారంగా 'ప్రవేశం'

- ప్రవేశ పరీక్షల దరఖాస్తు రుసుము 40-80 శాతం పెంపు
- కనీస రుసుం రూ.400గా నిర్ణయం
- మరికొద్ది రోజుల్లో కన్వీనర్ల తుది నిర్ణయం
- విద్యార్థులపై భారం రూ.9 కోట్లు

ఈనాడు - హైదరాబాద్

ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షల దరఖాస్తుల రుసుములు గత ఏడాదితో పోల్చుకుంటే కనీసం 30 నుంచి 80 శాతం వరకు పెరగనున్నాయి. ఈసారి అన్ని పరీక్షలూ ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తుండటం, ఆ బాధ్యత ప్రైవేటు సంస్థలకు అప్పగించడం...దానికితోడు వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) చెల్లించాల్సి ఉండటమే పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు. తక్కువ మంది రాసే వాటికి పెంపు మరింత ఎక్కువ ఉండే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ బాధ్యతను ఉన్నత విద్యామండలి టీసీఎస్ కంపెనీకి అప్పగించింది. ఇందుకుగాను ఒక్కో విద్యార్థికి రూ.420 చొప్పున ఆ సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. దానికి జీఎస్‌టీ 18 శాతం(దాదాపు రూ.63) అదనం. ఈ ప్రకారం పరీక్ష ఏదయినా కనీస రుసుం(ఎస్సీ, ఎస్టీలకు) రూ.400గా ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఇతరులకు దాని కంటే కనీసం రూ.200 అధికంగా ఉంటుంది. ప్రస్తుతం కనీస రుసుము రూ.200గా ఉంది.

కమిటీలదే తుది నిర్ణయం

రుసుములపై తుది నిర్ణయం ఆయా ప్రవేశ పరీక్షల కమిటీలు(కన్వీనర్లు) తీసుకుంటాయి. మరో రెండు రోజుల్లో జరగనున్న ఎంసెట్ కమిటీ సమావేశంలో ఆ పరీక్ష తాలూకూ దరఖాస్తు రుసుమును కమిటీ నిర్ణయించనుంది. ఎంబీఏ, ఎంసీఏలలో ప్రవేశానికి నిర్వహించనున్న ఐసెట్‌కు గత ఏడాది ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులకు రూ.350 ఉండగా.. ఈ దఫా వాటిని వరుసగా రూ.450, రూ.650గా నిర్ణయిస్తూ బుధవారం ప్రవేశ పరీక్షల కమిటీ(కాకతీయ విశ్వవిద్యాలయం) నిర్ణయించింది. దీన్నిబట్టి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులపై 80 శాతం, ఇతరులపై 85 శాతం పెంపుభారం పడినట్లయింది. ఎడ్‌సెట్, లాసెట్ పరీక్షలకు కూడా దరఖాస్తు రుసుములు భారీగా పెంచే అవకాశాలు లేకపోలేదని సమాచారం. ఎంసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, పీజీసెట్, లాసెట్, ఈసెట్ తదితర పరీక్షలకు ఏటా సుమారు 4.50 లక్షల మంది దరఖాస్తు చేస్తారు. ఒక్కో విద్యార్థిపై సగటు భారం రూ.200 అనుకున్నా విద్యార్థులపై మొత్తంగా రూ.9 కోట్ల భారం పడనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

డిండి ఉపరితల రిజర్వాయర్‌తో ముంపు ఉండదు

మంత్రి హరీశ్‌రావు స్పష్టం

హైదరాబాద్, న్యూస్‌టుడే: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించతలపెట్టిన ఉపరితల రిజర్వాయర్‌తో ఎలాంటి ముంపు ముప్పు ఉండదని నీటిపారుదల శాఖామంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ రిజర్వాయర్ పరిధిలోని దాసరాజుపల్లి గ్రామం ముంపునకు గురవుతుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. బుధవారం జలసౌధలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రిజర్వాయర్ నిర్మాణంతో దాసరాజుపల్లి గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపునకు గురికాదన్నారు. కేవలం 25 టీఎంసీల సామర్థ్యంతో దాన్ని నిర్మిస్తున్నామని, దాని కింద రెండు పంటలకు నీళ్లందుతాయని, మత్స్యకారులకు శాశ్వత ఉపాధి లభిస్తుందని వివరించారు. కాలువల వెడల్పు తగ్గించి, భూసేకరణ తగ్గించాలన్న రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామని, ప్రత్యామ్నాయాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

తొలగింపు అన్యాయం.. స్పందించని కార్మిక శాఖ

హైకోర్టును ఆశ్రయించిన బహుళ జాతి కంపెనీ ఉద్యోగులు

ఈనాడు, హైదరాబాద్: అమెరికాకు చెందిన వెరిజోన్ డేటా సర్వీసెస్ ఏకపక్షంగా తొలగించడాన్ని సవాలు చేస్తూ ఆ కంపెనీ ఉద్యోగులు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. కంపెనీతోపాటు కార్మికశాఖకు నోటీసులు జారీ చేస్తూ దీనిపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చట్టవిరుద్ధంగా తమను తొలగించారని కార్మికశాఖకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, వెంటనే ఉద్యోగాలు కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఎన్.బాలశ్రీధర్ మరో 51 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ గత డిసెంబరు 12, 13 తేదీల్లో మూకుమ్మడిగా 200 మందిని తొలగించారన్నారు. బార్లు, పబ్‌ల్లో పనిచేసే బౌన్సర్లను రంగంలోకి దింపి బలవంతంగా రాజీనామాలు తీసుకున్నారని తెలిపారు. దీనిపై కార్మికశాఖ జాయింట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, అయితే చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి కంపెనీతోపాటు కార్మికశాఖకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేశారు.

దివాళా తీసిన గుత్తేదారుల వివరాలివ్వండి

- నీటిపారుదలశాఖను కోరిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో సాగునీటి ప్రాజెక్టుల పనులు చేపట్టిన గుత్తేదారు కంపెనీలపై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో దివాళా పిటిషన్లు దాఖలయ్యాయి. ఇలాంటి కంపెనీల వివరాలన్నీ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖను కోరింది. ఐవీఆర్‌సీఎల్, ట్రాన్స్‌ట్రాయ్, కోస్టల్ ప్రాజెక్ట్స్ సహా పలు కంపెనీలకు సంబంధించి బ్యాంకులు దివాళా పిటిషన్లు దాఖలు చేశాయి. జలయజ్ఞంలో పనులు దక్కించుకొని ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో పనులు చేస్తున్న మరికొన్ని కంపెనీలకు సంబంధించి కూడా దివాళా పిటిషన్లు దాఖలైనట్లు తెలిసింది. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో దివాళా పిటిషన్లు దాఖలైన కంపెనీలు చేస్తున్న పనులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కొందరు ప్రభుత్వాన్ని కోరారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఓ వినతిపత్రం సమర్పించింది. ఈ నేపథ్యంలో బ్యాంకులు ఏయే కంపెనీలపై దివాళా పిటిషన్లు దాఖలు చేశాయి? ఈ కంపెనీలు సాగునీటి ప్రాజెక్టుల్లో ఏయే పనులు చేస్తున్నాయి? సంయుక్తంగా చేస్తున్నాయా? ఉప గుత్తేదారుగా పని చేస్తున్నాయా? ఆ పనులు పూర్తయ్యాయా? లేదంటే ఏ దశలో ఉన్నాయి తదితర వివరాలన్నీ ఇవ్వాలని నీటిపారుదల శాఖను ప్రభుత్వం కోరింది. దివాళా పిటిషన్లు దాఖలైన కంపెనీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జలయజ్ఞంలో ఎక్కువ పనులు దక్కాయి. తెలంగాణలో కొత్తగా చేపట్టిన పనుల్లో ఈ కంపెనీలు చేపట్టినవి తక్కువే.

దీర్ఘకాలిక రుణాలెందుకు ఇవ్వరు?

బ్యాంకర్లను ప్రశ్నించిన పార్థసారథి

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయంలో ఆస్తుల కల్పనకు ఉద్దేశించిన దీర్ఘకాలిక రుణాలను లక్ష్యానికన్నా చాలా తక్కువగా ఎందుకు ఇస్తున్నారని రాష్ట్రస్థాయి బ్యాంకర్లను వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి ప్రశ్నించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి(ఎస్‌ఎల్‌బీసీ) సమావేశం బుధవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ ఏడాది దీర్ఘకాలిక రుణాల పంపిణీ చాలా తక్కువగా ఉందని పార్థసారథి తెలిపారు. పెద్ద కమతాలున్న రైతులకు సైతం వీటిని ఇవ్వకపోవడంతో వారూ స్వల్పకాలిక రుణాలపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో బ్యాంకు స్థాయిలో రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి ఈ రుణాలు ఎలా పొందాలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

మాట నిలబెట్టుకోండి.. ఎయిమ్స్‌కు నిధులివ్వండి: జితేందర్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: తెలంగాణకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తెరాస లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి డిమాండు చేశారు. బుధవారం లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడారు. గతేడాది ఫిబ్రవరిలో రాష్ట్రానికి ఎయిమ్స్ ప్రకటన చేశారని, కానీ ఒక్క పైసా కేటాయించలేదని తెలిపారు. నిధులపై మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి హామీ లేదన్నారు. ఆర్థికమంత్రి సభలో ఇచ్చిన హామీనే అమలు కాకపోతే ఇంకేం విలువ ఉంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే ఎయిమ్స్‌కు నిధులు కేటాయించాలన్నారు. బడ్జెట్‌లో ఎవరికి ఏం ఇచ్చారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో అనేక పథకాలు అందిస్తున్నామని వాటికి నిధులు కేటాయించాలన్నారు. సీఎం కేసీఆర్ స్పష్టమైన విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. విభజన హామీలు రెండు రాష్ట్రాలకు అమలు చేయాలని జితేందర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు.

ప్రజాప్రతినిధుల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు: కేంద్రం

ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఉన్న క్రిమినల్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు మార్చి1, 2018 నుంచి ప్రారంభమవుతాయని కేంద్రం తెలిపింది. తెరాస సభ్యుడు వినోద్‌కుమార్ బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి పీపీ చౌదరి సమాధానమిచ్చారు. "సుప్రీం కోర్టులో విచారణలోఉన్న రిట్ పిటిషన్‌లో పేర్కొన్న విధంగా 2014 ఎన్నికల నామినేషన్ల ప్రకారం దేశవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలపై 1581 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇలాంటి కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసే ప్రక్రియ తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలకు, హైకోర్టులకు అన్ని కేసుల వివరాలు తెలపాలని కేంద్రం కోరింది. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. ఈ కేసులు కాలపరిమితితో విచారణ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు' అని పీపీ చౌదరి తెలిపారు.

గ్రామసభ లేకుండా తుది ముసాయిదా సరికాదు: హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామంలో గ్రామసభ నిర్వహించకుండా భూసేకరణ ప్రక్రియలో తుది ముసాయిదాను ప్రకటించడం సరికాదని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. గతేడాది ఆగస్టు 21న జారీ చేసిన తుది ముసాయిదాను రద్దు చేసింది. భూసేకరణ ప్రక్రియలో గ్రామసభ నిర్వహించాకే అవార్డుతో సహా తదుపరి ప్రక్రియ చేపట్టాలని ఆదేశించింది. కొండపోచమ్మ సాగర్ జలాశయం నిమిత్తం మామిడ్యాలలో భూసేకరణకు ఇచ్చిన ప్రాథమిక ప్రకటనను, గ్రామసభ నిర్వహించకుండా జారీ చేసిన తుది ముసాయిదాను సవాలు చేస్తూ అదే గ్రామానికి చెందిన కె.ప్రవీణ్‌కుమార్‌తోపాటు మరో 30 మంది రైతులు వేర్వేరుగా రెండు వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పరిపాలనాపరమైన అనుమతులు రాకుండానే రెవెన్యూ అధికారులు భూసేకరణకు ప్రాథమిక ప్రకటన(నోటిఫికేషన్) జారీ చేయడం చెల్లదన్నారు. కొత్త భూసేకరణ చట్ట ప్రకారం గ్రామసభ నిర్వహించలేదని తెలిపారు. రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా ఏకంగా తుది ముసాయిదాను జారీ చేశారన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ప్రాథమిక ప్రకటనను రద్దు చేయడానికి నిరాకరించారు. కానీ తుది ముసాయిదాను రద్దు చేస్తూ గ్రామసభ నిర్వహించాకే భూసేకరణలో తదుపరి ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నేతన్నల పనితనం అద్భుతం: గవర్నర్

ఈనాడు, నల్గొండ: చేనేత కార్మికుల పనితనం అద్భుతంగా ఉండటంతో పాటు క్లిష్టతరమైందని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన ఆకృతులను సృష్టించి పోచంపల్లి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నేతన్నల ఆదాయం రెట్టింపయ్యేలా సహకార సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు ప్రభుత్వ పరంగా చేయాల్సిన సాయం గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి, చౌటుప్పల్ మండలాల్లో గవర్నర్.. కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పర్యటించారు. తొలుత పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామంలోని మెగా చేనేతపార్కును సందర్శించి కార్మికులతో మాట్లాడారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. అనంతరం పోచంపల్లిలోని గ్రామీణ పర్యటక కేంద్రంలో స్వయం సహాయక మహిళా సంఘాలు, బ్యాంకర్లు, మాస్టర్ వీవర్స్, సహకార సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. మానవతా దృక్పథంతో బ్యాంకులు నేత కార్మికులకు 'ముద్ర' కింద రుణాలను మంజూరు చేయాలని నరసింహన్ సూచించారు. కార్మికులకు అన్యాయం జరగకుండా అన్ని మగ్గాలకు జియోట్యాగింగ్ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో చదివే తమ పిల్లలకు ఉచితంగా విద్యనందించాలని కార్మికులు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం రామనందతీర్థ గ్రామీణ శిక్షణా సంస్థను సందర్శించి విద్యార్థులతో గవర్నర్ మాట్లాడారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి నుంచి చౌటుప్పల్‌లోని సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అంతకుముందు కనుముక్కల చేనేత పార్కు వద్ద గవర్నర్‌కు మంత్రి జగదీశ్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, చేనేత శాఖ కమిషనర్ శైలజా రామయ్యార్ తదితరులు స్వాగతం పలికారు.



భూదాన్ పోచంపల్లిలో చేనేత కార్మికుడు గొట్టిముక్కల ఇస్త్రారీ ఇంటికెళ్లి మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్ తదితరులు

నందిమేడారం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

ధర్మారం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుతమని, ఇంత పెద్దఎత్తున పనులు జరగడం ఎక్కడా, ఎప్పుడూ చూడలేదని జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ పేర్కొన్నారు. ఆమెతో పాటు ఉమ్మడి జిల్లా జడ్పీటీసీ సభ్యుల బృందం బుధవారం నందిమేడారంలోని ఆరో దశ పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జూన్ వరకు పూర్తి చేయాలన్న సంకల్పంతో పనులు చేస్తున్నారని వివరించారు. నందిమేడారంలో పంపుల బిగింపు, సర్జ్‌పూల్, నియంత్రికలు బిగించే ప్రదేశం, సొరంగాల లైనింగ్ పనులను నీటిపారుదల శాఖ డీఈఈ జి.నర్సింగరావు, ఏఈలు రాకేష్, ఉపేందర్ వారికి వివరించారు. జడ్పీ వైస్ ఛైర్మన్ రాజిరెడ్డి, శరత్‌రావు, వసంత, అధికారులు, వివిధ మండలాల జడ్పీటీసీ సభ్యులున్నారు.

అనవసర విషయాలు మీకెందుకు?

- న్యాయవాది, పాన్‌బ్రోకర్ ఎవరనే ప్రశ్నలేంటి?
- సకల నేరస్థుల సమగ్ర సర్వేపై పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: సకల నేరస్థుల సమగ్ర సర్వే పేరుతో పోలీసులు వేధిస్తున్నారంటూ హైకోర్టులో మరో వ్యాజ్యం దాఖలైంది. దీనిపై బుధవారం విచారణ జరిపిన ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి.. అనవసర విషయాలు అడిగి తెలుసుకొని ఏం సాధిద్దామనుకుంటున్నారని పోలీసులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నేరస్థులపై పోలీసుల నిఘా ఉంచడం మంచిదే అయినా సర్వే పేరుతో అనవసర విషయాల్ని అడగడం వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడమేనన్నారు. న్యాయవాది, పాన్‌బ్రోకర్, ఉంపుడుగత్తె (కాంక్యుబైన్) వివరాలు ఎందుకు అడుగుతున్నారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. న్యాయవాది వివరాలు చెప్పాలనడం.. న్యాయవాదుల చట్ట నిబంధనలను ఉల్లంఘించడం కాదా అని నిలదీశారు. నమూనా పత్రాల్ని సిద్ధం చేసే ముందు పోలీసు అధికారులు ప్రభుత్వ న్యాయవాదుల్ని, న్యాయాధికారుల్ని కానీ సంప్రదిస్తే ఇలాంటి వివరాలు అడిగేవారు కాదన్నారు. పిటిషనర్‌ను సమగ్ర వివరాలివ్వాలంటూ ఒత్తిడి చేయడంపై పూర్తి వివరాలు సమర్పించాలని తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ఉత్తర జోన్ డీసీపీ, మారేడ్‌పల్లి ఠాణా ఎస్‌హెచ్‌వోకు మౌఖికంగా స్పష్టం చేస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేశారు. సకల నేరస్థుల సమగ్ర సర్వే పేరుతో మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌వో, హైదరాబాద్ ఉత్తర జోన్ డీసీపీ తనను వివరాలివ్వాలని వేధిస్తున్నారంటూ మాజీ కార్పొరేటర్, గ్రేటర్ హైదరాబాద్ తెదేపా బీసీ సెల్ అధ్యక్షుడు చిర్రబోన బద్రీనాథ్ యాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. గత నెల 19న మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌వో బలవంతంగా ఠాణాకు తీసుకెళ్లి వేలిముద్రలు, ఫొటోలు తీసుకున్నారని పేర్కొన్నారు. బుధవారం విచారణలో పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై ప్రస్తుతం రౌడీషీట్ లేదన్నారు. నేరస్థుల సర్వే పేరుతో గోప్యత హక్కుకు భంగం కలిగించేలా పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా న్యాయవాది, పాన్‌బ్రోకర్, ఉంపుడుగత్తె తదితర వివరాలు అడుగుతున్నారని చెప్పారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఈ వ్యవహారంపై పోలీసుల నుంచి వివరాలు సేకరించి చెప్పాలని సహాయ ప్రభుత్వ న్యాయవాదికి స్పష్టం చేశారు.

నిరుద్యోగుల్లో ధైర్యం నింపేందుకే యాత్ర: పొన్నం ప్రభాకర్



బైక్‌ర్యాలీలో పాల్గొన్న పొన్నం ప్రభాకర్, అంజన్ కుమార్ యాదవ్, సంపత్‌కుమార్ తదితరులు

ఈనాడు డిజిటల్, గద్వాల: రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. వారిలో ధైర్యం నింపేందుకే యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చైతన్య యాత్రను ప్రారంభించినట్లు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ నుంచి యాత్ర ప్రారంభమైంది. ముందు జోగులాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. యాత్ర ద్వారా కేసీఆర్ సర్కారును పాతాళానికి పాతిపెడతామన్నారు. సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ. తెరాస హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. లక్షా ఆరు వేల ఉద్యోగాలను ఒకే ఏడాదిలో ఇస్తానని కేసీఆర్ చెప్పారని, తీరా చూస్తే ఆరు వేలే ఇచ్చారన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇంఛార్జి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోరుకొండ సైనిక్ స్కూల్ ఫలితాలు విడుదల

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయనగరం కోరుకొండ సైనిక్ స్కూల్ 2018-19 ప్రవేశ పరీక్షా ఫలితాలను బుధవారం సాయంత్రం ప్రిన్సిపల్ కల్నల్ రుద్రాక్షఅత్రి విడుదల చేశారు. ఆరో తరగతిలో 70 సీట్లకు 210 మంది, తొమ్మిదో తరగతిలో 20 సీట్లకు 60మంది విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరికి మౌఖిక, ఆరోగ్య పరీక్షలు ఈ నెల 20 నుంచి 28 వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలు www.sainikschoolkorukonda.org వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. వివరాలకు 08922-246119, 246168 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

పార్లమెంటు సాక్షిగా ప్రధాని అబద్ధాలు చెప్పారు

రేవంత్‌రెడ్డి విమర్శ

హైదరాబాద్, న్యూస్‌టుడే: బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే సందర్భంగా ప్రధాని మోదీ పార్లమెంటు సాక్షిగా పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా...కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియాహాలులో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. నీలం సంజీవరెడ్డిని రాష్ట్రపతిని, టి.అంజయ్యను ముఖ్యమంత్రిని, పీవీ నరసింహారావును ప్రధానమంత్రిని చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. టి.అంజయ్య దళితుడని మోదీ తప్పుడు సమాచారం ఇచ్చారని, ఆయన వాస్తవానికి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని గుర్తుచేశారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్లనే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యలు జటిలం అవుతున్నాయన్నారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన ప్రధానమంత్రి తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అవకాశవాదాన్ని తలపిస్తోంది: పొంగులేటి

పార్లమెంటులో ప్రధాని ప్రసంగం అవకాశావాదాన్ని తలపిస్తోందని మండలిలో విపక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు.

బాకీ కట్టండి.. పదవి పొందండి!

- అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన ప్యాక్స్ పాలకవర్గాలు
- పదవీకాలం పొడిగింపునకు సహకార శాఖ తిరస్కరణ

ఈనాడు, హైదరాబాద్ : తీసుకున్న అప్పు కట్టకుండా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) పాలకవర్గాల పదవీకాలం పొడిగింపునకు సహకార శాఖ కొత్త అవకాశం ఇచ్చింది. ఇప్పటికైనా వడ్డీతో సహా పాత బాకీని చెల్లిస్తే మరో ఆరునెలల పాటు పదవీకాలం పొడిగిస్తామని పాలకవర్గాలకు తెలిపింది. ప్యాక్స్ పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 3తో ముగియడంతో మరో 6 నెలల పాటు పొడిగించమని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఈ పొడిగింపు పొందాలంటే పాలకవర్గ ఛైర్మన్, డైరెక్టర్లు సంఘానికి ఎలాంటి బాకీ ఉండకూడదని సహకార శాఖ షరతు పెట్టింది. దీనివల్ల రాష్ట్రంలో 72 ప్యాక్స్ పాలకవర్గాలకు పొడిగింపు రాలేదు. ఛైర్మన్ బకాయి ఉంటే మొత్తం పాలకవర్గానికి పొడిగింపు నిరాకరించారు. పాలకవర్గంలోని డైరెక్టర్ ఎవరైనా బాకీ పడితే అతని వరకు నిరాకరించి మిగతా పాలకవర్గానికిచ్చారు. ఛైర్మన్ మాదిరిగానే ఒక డైరెక్టర్ బాకీ చెల్లించకున్నా మొత్తం పాలకవర్గానికి తిరస్కరించేలా నిబంధన పెడితే వందల సంఘాలకు పొడిగింపు వచ్చేది కాదు. ఇది రానివారు ఎమ్మెల్యేలు, మంత్రుల ద్వారా పొడిగింపు ఉత్తర్వులు తెచ్చుకునేందుకు పైరవీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత బాకీ కట్టిన వారికి పొడిగింపు ఇవ్వాలని నిర్ణయించారు. పాలకవర్గాల్లోని ఛైర్మన్లు, డైరెక్టర్లు రాజకీయాల్లో చురుగ్గా ఉన్నందున ఇంతకాలం బాకీ కట్టమని అడగలేక సిబ్బంది సతమతమయ్యారు. ఇప్పుడు పదవీకాలం పొడిగింపునకు బాకీ పూర్తిగా చెల్లించాలనే షరతు పెట్టడం వల్ల కొందరు వెంటనే చెల్లించేందుకు ముందుకొస్తున్నారని సహకార శాఖ అధికార వర్గాలు చెప్పాయి. సహకార సంఘాల పాలకవర్గాల పేరుతో పాలన సాగించేవారిలో ఎక్కువ మంది అప్పులను తిరిగి కట్టకుండా చెల్లించినట్లుగా పుస్తకాల్లో రాయించి మళ్లీ కొత్త అప్పు తీసుకుంటున్నారని వారు వివరించారు. సంఘాలన్నీ ఆన్‌లైన్ చేస్తే రుణాల పంపిణీలో సాగుతున్న ఈ లొసుగులన్నీ బయటికొస్తాయని ఆశిస్తున్నారు. అప్పు ఎవరు తీసుకున్నా తిరిగి వసూలు చేసే బాధ్యత ప్యాక్స్ ఉద్యోగులపైనే ఆధారపడి ఉంటుందని 'తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు'(టీఎస్‌క్యాబ్) ఛైర్మన్ కొండ్రు రవీందర్‌రావు 'ఈనాడు'కు చెప్పారు.

ఫారం-సి

(చట్టం-30/2013 యొక్క సెక్షన్ 11(1) మరియు రూల్-19 యొక్క ఉప రూల్ (1) చూడుడు)
తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూ.సే) శాఖ
కలెక్టరేట్ నాగర్‌కర్నూల్
ప్రాథమిక ప్రకటన

నెం.జి/36/2018 తేది : 11-01-2018
గెజిట్ నెం. 64/2018 తేది : 25-01-2018

తెలంగాణ ప్రభుత్వము / కలెక్టరు వారు నాగర్‌కర్నూల్ జిల్లా, నాగర్‌కర్నూల్ డివిజన్, కోడేరు మండలం యొక్క తీగలపల్లి గ్రామంలో మొత్తం ఎ 58-08 గుం.లు భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా తీగలపల్లి గ్రామం వద్ద "పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద బండ్ ఏరియా కొరకు ఏదుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్" కొరకు అవసరమైఉందని భావించుచున్నారు.

అందువలన ప్రామాణిక కొలతల యొక్క ఎ 58-08 గుం.లు కొద్దిగా ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణం గల భూమి యొక్క భాగం నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలం యొక్క తీగలపల్లి గ్రామం వద్ద పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద బండ్ ఏరియా కొరకు ఏదుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ యొక్క నిర్మాణం కొరకు అవసరమైన పైన తెల్పిన భూముల కొరకు ప్రకటించబడినది. వాటి యొక్క వివరణాత్మక వివరము సేకరణ కొరకు దిగువ వివరించబడినది.

క్ర సం.	సర్వే నెం.	[illegible]	[illegible]	సేకరణ క్రింది విస్తీర్ణం (ఎ.గుం.)	ఆసక్తిగల వ్యక్తి యొక్క పేరు & చిరునామా	సరిహద్దులు N	S	E	W	[illegible]	నిర్మాణాలు
1	2	3	4	5	6	7	8	9	10	11	12
1	26/1	ఐడి	పట్టా	0.14	ఎం.డి.పాషా	25	44	26	131	లేవు	లేవు
2	26/2	ఐడి	పట్టా	2.18	తండ్రి నన్నె సాహెబ్	25	44	26	131	లేవు	లేవు
3	26/1	ఐడి	పట్టా	0.14	ఎండి అల్లాజ	25	44	26	131	లేవు	లేవు
4	26/2	ఐడి	పట్టా	2.18	తండ్రి నన్నే సాహెబ్	25	44	26	131	లేవు	లేవు
5	156	ఐడి	పట్టా	0.32 1/2	వెంకటమ్మ భర్త నారాయణ	157	150	132	133	లేవు	లేవు
6	60/ఇ	ఐడి	పట్టా	1.37	ఉప్పరి	59	64	61	62	లేవు	లేవు
7	61/ఇ ఇ	ఐడి	పట్టా	0.10	సవరమ్మ భర్త నడిపయ్య	59	64	60	62	లేవు	లేవు
8	50/ఎ 3	ఐడి	పట్టా	1.00	పబ్బతి శంకరయ్య	48	47	50	51	లేవు	లేవు
9	55/ఇ	ఐడి	పట్టా	0.04	తండ్రి పెద్ద బాలయ్య	54	56	57	69	లేవు	లేవు
10	79/2 /ఇ	ఐడి	పట్టా	1.20	పెబ్బతి శేషయ్య తండ్రి దానయ్య	75	74	80	83	లేవు	లేవు
11	54/ఎ ఎ	ఐడి	పట్టా	0.03	పెబ్బతి తిరుపతయ్య తండ్రి నరసయ్య	50	51	57	53	లేవు	లేవు
12	78/ఎ	ఐడి	పట్టా	1.30	పెబ్బతి ఎల్లమ్మ భర్త వెంకటయ్య	79	76	77	83	లేవు	లేవు
13	82/ఇ	ఐడి	పట్టా	3.20	కన్నా రెడ్డి శంకర్ రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి	80	81	102	84	లేవు	లేవు
14	82/ఎ ఎ	ఐడి	పట్టా	3.00	కన్న రెడ్డి సంతోష్ కుమార్ రెడ్డి తండ్రి కిష్టారెడ్డి	80	81	102	84	లేవు	లేవు
15	106/ ఎ	ఐడి	పట్టా	1.00	వీరపాగ లచ్చమ్మ భర్త పెద్ద నర్సింహ	105	88	107	97	లేవు	లేవు
16	104/ ఎ	ఐడి	పట్టా	1.00	పబ్బతి తిరుపతయ్య తండ్రి బొడయ్య	103	102	128	105	లేవు	లేవు
17	158	ఐడి	పట్టా	0.07	కుమ్మరివెంకట స్వామి తండ్రి నడిపి కిష్టయ్య	159	132	149	157	లేవు	లేవు
18	67/ ఎ3	ఐడి	పట్టా	0.17	క్యాతనమోని భొక్కలయ్య తండ్రి బాలయ్య	65	68	71	64	లేవు	లేవు
19	128/ ఇ	ఐడి	పట్టా	1.23	కన్నా రెడ్డి రాంరెడ్డి తండ్రి కిష్ట రెడ్డి	127	132	125	122	లేవు	లేవు
20	164/ 6	ఐడి	పట్టా	0.08	కల్ల అగ్గరయ్య తండ్రి కిష్టయ్య	197	166	165	160	లేవు	లేవు
21	164/ 6	ఐడి	పట్టా	0.08	కల్ల వెంకటయ్య తండ్రి కిష్టయ్య	197	166	165	160	లేవు	లేవు
22	164/ 6	ఐడి	పట్టా	0.08	కల్ల బొందయ్య తండ్రి కిష్టయ్య	197	166	165	160	లేవు	లేవు
23	160	ఐడి	పట్టా	0.31	కల్ల బాలకిష్టమ్మ భర్త బాలయ్య	164	163	161	159	లేవు	లేవు
24	123	ఐడి	పట్టా	0.08 1/2	కల్ల చంద్రకళ భర్త శంకరయ్య	125	121	122	132	లేవు	లేవు
25	123	ఐడి	పట్టా	0.08 1/2	కల్ల మల్లయ్య తండ్రి కన్నయ్య	125	121	122	132	లేవు	లేవు
26	118	ఐడి	పట్టా	0.39 1/2	గోపాల బాలమ్మ భర్త	116	110	117	109	లేవు	లేవు
27	169	ఐడి	పట్టా	0.05	ఎల్లయ్య	171	170	173	168	లేవు	లేవు
28	118	ఐడి	పట్టా	0.19 1/2	గోపాల మల్లేష్ తండ్రి రాం చంద్రయ్య	116	110	117	109	లేవు	లేవు
29	118	ఐడి	పట్టా	0.20	గోపాల శివ శంకర్ తండ్రి రాంచంద్రయ్య	116	110	117	109	లేవు	లేవు
30	106/ 1	ఐడి	పట్టా	1.03	కుర్వ బైని నాగమ్మ భర్త బిచ్చయ్య	105	88	107	97	లేవు	లేవు
31	133/ ఎ	ఐడి	పట్టా	0.03	నీరడి తిరుపతయ్య తండ్రి కిష్టయ్య	123	132	116	118	లేవు	లేవు
32	156/ ఎ	ఐడి	పట్టా	0.10 1/2		157	150	132	133	లేవు	లేవు
33	133/ ఎ	ఐడి	పట్టా	0.23	నీరడి బాల కిష్టయ్య తండ్రి కిష్టయ్య	123	132	116	118	లేవు	లేవు
34	133/ ఎ	ఐడి	పట్టా	0.23	నీరడి కృష్ణయ్య తండ్రి కిష్టయ్య	123	132	116	118	లేవు	లేవు
35	110/2	ఐడి	పట్టా	3.16	దాకలి చంద్రమ్మ భర్త బొండయ్య	109	97	113	111	లేవు	లేవు
36	110/ ఎ	ఐడి	పట్టా	1.20	దాకలి రాములు తండ్రి గాలయ్య	109	97	113	111	లేవు	లేవు
37	98	ఐడి	పట్టా	0.35	బేగిని కృష్ణయ్య తండ్రి కిష్టయ్య	97	95	96	94	లేవు	లేవు
38	169/ ఎ	ఐడి	పట్టా	0.12	కుర్వ బయ్యన్న తండ్రి మల్లయ్య	171	173	170	168	లేవు	లేవు
39	169	ఐడి	పట్టా	0.12 1/2	భేగిని పర్వతాలు తండ్రి కిష్టయ్య	171	170	173	168	లేవు	లేవు
40	163	ఐడి	పట్టా	0.25	కల్లా వల్లమ్మ భర్తవెంకటయ్య	166	197	165	160	లేవు	లేవు
41	176/ ఎ	ఐడి	పట్టా	0.12	నిరాడి తిరుపతయ్య	23	177	179	175	లేవు	లేవు
42	167/ ఎఎ3	ఐడి	పట్టా	0.09	తండ్రి కిష్టయ్య గోపాల నిరంజన్	196	168	132	165	లేవు	లేవు
43	47/ఇ	ఐడి	పట్టా	1.04	తండ్రి భీరయ్య జనమోని శంకర్ తండ్రి చిన్న మంతయ్య	48	46	50	51	లేవు	లేవు
44	159	ఐడి	పట్టా	0.20	గోపాల నిరంజన్ తండ్రి భీరయ్య	161	160	132	158	లేవు	లేవు
45	164	ఐడి	పట్టా	0.24	కల్లా బాలకిష్టమ్మ భర్త బాలయ్య	197	166	165	160	లేవు	లేవు
46	59	ఐడి	పట్టా	0.00 1/2	ఉప్పరి మురళి తండ్రి	58	64	60	68	లేవు	లేవు
47	172/ ఇ	ఐడి	పట్టా	0.07 1/2	శంకరయ్య	131	171	25	170	లేవు	లేవు
48	176/ ఇ	ఐడి	పట్టా	0.02		23	177	179	175	లేవు	లేవు
49	52	ఐడి	పట్టా	0.02	ఉప్పరి రవి	51	44	53	46	లేవు	లేవు
50	172/ ఇ	ఐడి	పట్టా	0.07 1/2	తండ్రి శంకరయ్య	131	171	25	170	లేవు	లేవు
51	176/ ఇ	ఐడి	పట్టా	0.02		23	177	179	175	లేవు	లేవు
52	176	ఐడి	పట్టా	0.01	నీరడి బాలకిష్టయ్య తండ్రి కిష్టయ్య	23	177	179	175	లేవు	లేవు
53	156	ఐడి	పట్టా	0.05 1/2	నీరడి క్రిష్ణయ్య తండ్రి కిష్టయ్య	157	150	132	133	లేవు	లేవు
54	166	ఐడి	పట్టా	0.02	కల్లా వీరయ్య తండ్రి బిచ్చన్న	196	168	167	165	లేవు	లేవు
55	58	ఐడి	పట్టా	0.05	పబ్బతి కురుమయ్య తండ్రి పెద్ద బాలయ్య	56	59	57	68	లేవు	లేవు
56	53	ఐడి	పట్టా	0.14	పబ్బతి చిన్న మంతయ్య తండ్రి చిన్నయ్య	54	44	51	57	లేవు	లేవు
57	53	ఐడి	పట్టా	0.14	జనమోని మంతయ్య తండ్రి తిక్కయ్య	54	44	51	57	లేవు	లేవు
58	58	ఐడి	పట్టా	0.16	పబ్బతి శేషయ్య తండ్రి చిన్నయ్య	56	59	57	69	లేవు	లేవు
59	50	ఐడి	పట్టా	0.20	సిలివేరి	48	47	50	51	లేవు	లేవు
60	67	ఐడి	పట్టా	0.20	పీరాస్వామి తండ్రి పుల్లయ్య	65	68	71	64	లేవు	లేవు
61	68/ ఎఎ	ఐడి	పట్టా	0.06	దేవరపాగ శివకుమార్ తండ్రి రాములు	69	67	58	70	లేవు	లేవు
62	68/ ఎ	ఐడి	పట్టా	0.06	దేవరపాగ రాములు తండ్రి బాలస్వామి	69	67	58	70	లేవు	లేవు
63	69	ఐడి	పట్టా	1.37	ఇండ్ల శంకర్ తండ్రి బాలస్వామి	68	68	56	70	లేవు	లేవు
64	117/ 2	ఐడి	పట్టా	0.17 1/2	క్యాతనమోని హనుమంతు తండ్రి కోటయ్య	109	114	118	120	లేవు	లేవు
65	117/ 2	ఐడి	పట్టా	0.16 1/2	క్యాతనమోని వెంకటయ్య తండ్రి కోటయ్య	109	114	118	120	లేవు	లేవు
66	117/ 2	ఐడి	పట్టా	2.01	కోరమోని వీరయ్య తండ్రిఅయ్యలు	109	114	118	120	లేవు	లేవు
67	117/ 3	ఐడి	పట్టా	1.00	క్యాతనమోని శివయ్య తండ్రి వెంకటయ్య	109	114	118	120	లేవు	లేవు
68	67/ ఎ/1	ఐడి	పట్టా	0.20	ఎస్.అంజనేయులు తండ్రి శేషయ్య	65	68	71	64	లేవు	లేవు
69	109/ ఎ	ఐడి	పట్టా	0.20	జవిఆర్ ఇన్‌ఫ్రా	120	108	118	110	లేవు	లేవు
70	123/ ఎఎ2	ఐడి	పట్టా	1.08		125	121	122	132	లేవు	లేవు
71	123/ ఎ1	ఐడి	పట్టా	0.22		125	121	122	132	లేవు	లేవు
72	123/ ఎ	ఐడి	పట్టా	0.09		125	121	122	132	లేవు	లేవు
73	133/ ఎ	ఐడి	పట్టా	0.04		123	132	116	118	లేవు	లేవు
74	133/ ఎఎ	ఐడి	పట్టా	0.04		123	132	116	118	లేవు	లేవు
75	159	ఐడి	పట్టా	0.22	కెవిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్	161	160	132	158	లేవు	లేవు
76	159	ఐడి	పట్టా	0.22		161	160	132	158	లేవు	లేవు
77	166	ఐడి	పట్టా	0.04		196	168	167	165	లేవు	లేవు
78	166	ఐడి	పట్టా	0.10		196	168	167	165	లేవు	లేవు
79	166	ఐడి	పట్టా	0.02		196	168	167	165	లేవు	లేవు
80	166	ఐడి	పట్టా	0.02		196	168	167	165	లేవు	లేవు
81	167/ ఎ	ఐడి	పట్టా	0.04		196	168	132	165	లేవు	లేవు
82	167/ ఎఎ2	ఐడి	పట్టా	0.10		196	168	132	165	లేవు	లేవు
83	169	ఐడి	పట్టా	0.12		171	170	173	168	లేవు	లేవు
84	173/ ఎ/1	ఐడి	పట్టా	1.00		172	170	173	168	లేవు	లేవు
85	194/ ఇ1	ఐడి	పట్టా	0.24 1/2		178	191	184	190	లేవు	లేవు
86	200/ ఇ2	ఐడి	పట్టా	0.35		193	190	201	198	లేవు	లేవు
87	26/ ఎ1	ఐడి	పట్టా	0.25		25	44	26	131	లేవు	లేవు
88	26/ ఎఎ1	ఐడి	పట్టా	0.25		25	44	26	131	లేవు	లేవు
89	25	ఐడి	పట్టా	0.01		26	44	26	131	లేవు	లేవు
90	25	ఐడి	పట్టా	0.01		26	44	26	131	లేవు	లేవు
91	25	ఐడి	పట్టా	0.03		26	44	26	131	లేవు	లేవు
మొత్తం విస్తీర్ణం				58-08							

భూమి యొక్క ప్లాన్‌ను జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ & రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, నాగర్‌కర్నూల్ వారి కార్యాలయంలో ఏదేని పని దినమున కార్యాలయ వేళలలో పరిశీలించుకొనవచ్చును. సదరు చట్టం యొక్క సెక్షన్ (12)లో ఇవ్వబడిన మరియు నిర్దేశించిన విధంగా వారి పని కొరకు కోడేరు మండలం యొక్క తీగలపల్లి గ్రామం వద్ద పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద బండ్ ఏరియా కొరకు ఏదుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టములు చేయుటకు & భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సర్వే చేయుటకు, ఏదేని భూమి యొక్క లెవెల్స్ తీసుకొనుటకు, సబ్ సాయిల్‌లోనికి త్రవ్వుటకు లేదా బోరు వేయుటకు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్, నాగర్‌కర్నూల్ మరియు అతని సిబ్బందికి అధికారము ఇచ్చుటకు జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ వారు ఆదేశించియున్నారు.


చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుండి అటువంటి భూములపై ఏదేని లావాదేవీలను జరుపుట లేదా భూమిపై ఏదేని లావాదేవీలకు కారణమగుట అనగా అమ్మకం / కొనుగోలు మొదలగునవి లేదా ఏవేని రుణభారములు సృష్టించుట ఏ వ్యక్తి కూడా చేయరాదు.

సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేయబడిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై రోజులు) లోపల ఆసక్తి గల వ్యక్తులు వాటిని సమర్పించవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవిన్యూ డివిజనల్ అధికారి నాగర్‌కర్నూల్
సం/- జిల్లా రెవిన్యూ అధికారి నాగర్‌కర్నూల్
సం/- జాయింట్ కలెక్టర్, నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ జిల్లా
Dipr RO No.1567/LA/PP/2017-18

పోరాటం ఆపొద్దు

- పార్లమెంట్‌లో నిరసనపై ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- రాష్ట్ర విభజనకు లేని ఫార్ములా ఆర్థిక లోటు భర్తీకి కావాలా?
- అరుణ్‌జైట్లీ ప్రకటనపై అసంతృప్తి



ఈనాడు – అమరావతి: రాష్ట్రానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆపవద్దని తెదేపా ఎంపీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. "ఈ రెండు రోజులే సభ జరుగుతుంది. శుక్రవారం సభ వాయిదా పడుతుంది. కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. ప్రజా ప్రయోజనాలు కాపాడాలి. సభ నుంచి సస్పెండ్ చేసినా వెనుకంజ వేయవద్దు" అన్నారు. ఆర్థిక లోటు భర్తీకి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. "ఇప్పుడు కొత్తగా ఫార్ములా ప్రస్తావనేంటి? రాష్ట్ర విభజనకు లేని ఫార్ములా రాష్ట్రాన్ని ఆదుకోడానికి కావాలా? ఒక ఫార్ములా లేకుండానే రకరకాల ప్రాతిపదికలతో రాష్ట్రాన్ని విభజించారు. భౌగోళిక ప్రాతిపదికన ఆస్తులు, జనాభా ప్రాతిపదికన అప్పులు, వినియోగం ప్రాతిపదికన విద్యుత్, జనాభా ప్రాతిపదికన ఉద్యోగుల పంపకాలు... విభజించిన కేంద్ర ప్రభుత్వం... ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు తొలి ఏడాది ఆర్థిక లోటు భర్తీకి కొత్త సూత్రం (ఫార్ములా) కోసం చూస్తున్నామనడం ఏంటి" అన్నారు. బుధవారం ఉదయం ఆయన ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఇది రెండు ప్రభుత్వాల సమస్య

"పార్లమెంటు సాక్షిగా మాకు జరిగిన అన్యాయాన్ని అందరూ వినాలి. అందరూ కలసి మాకు న్యాయం చేయాలి. ఇది రెండు పార్టీలు, రెండు ప్రాంతాల మధ్య సమస్య కాదు. రెండు ప్రభుత్వాల మధ్య సమస్య" అని చంద్రబాబు అన్నారు. కొన్ని విపక్ష పార్టీలు గురువారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌పైనా ఆయన స్పందించారు. "బంద్‌ల ద్వారా జనజీవనానికి ఇబ్బందులు కలిగించడం మంచిదికాదు. ఇది వీధి పోరాటాల సమస్య కాదు. పార్లమెంటులోను, దిల్లీలోను పోరాడాల్సిన సమస్య. ఇక్కడ బంద్ చేయడం వల్ల ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుంది? ప్రజలు, ప్రతిపక్షాలు ఈ విషయం ఆలోచించాలి' అని ఆయన పేర్కొన్నారు.

ఏం చేస్తారో స్పష్టంగా చెప్పాలి

ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేస్తారో కేంద్ర ప్రభుత్వం ఒక స్పష్టత ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. "పార్లమెంటు సాక్షిగా దేశానికి, రాష్ట్రానికి ఒక సందేశం ఇవ్వాలి. నిర్దిష్ట కాలావధితో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి, అమలు చేయాలి" అన్నారు. "రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుని వెంటనే సమీక్షించాలి. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ప్రత్యేక ప్యాకేజీలో పేర్కొన్న అంశాలన్నీ అమలు చేయాలి. ఈ బడ్జెట్‌లో చేసిన కేటాయింపుల పైనా పునఃసమీక్ష జరగాలి" అన్నారు.

రెండు గంటలపాటు చర్చించాలి

రాష్ట్ర విభజన వల్ల ఉత్పన్నమైన సమస్యలు, ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పార్లమెంటు ఉభయసభల్లోను సుదీర్ఘంగా, సమగ్రంగా చర్చ జరగాలని, కనీసం రెండు గంటల చొప్పున కేటాయించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

చేసిందంతా చేసి మాపై ఆగ్రహమా?

తెదేపా ఎంపీలపై కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని చంద్రబాబు ఖండించారు. "ఆంధ్రప్రదేశ్‌కి జరిగిన అన్యాయాన్ని ఖర్గే ఎందుకు ప్రశ్నించలేదు? చేయాల్సిన నష్టమంతా చేసి, ఇప్పుడు తెదేపాపై ఆగ్రహం వ్యక్తంచేయడం కాంగ్రెస్ స్వార్థ రాజకీయాలకు నిదర్శనం" అని దుయ్యబట్టారు.

లాలూచీ రాజకీయాల్లో వైకాపా నెం.1

వైకాపా లాలూచీ రాజకీయాల్లో నెం.1 అని చంద్రబాబు ధ్వజమెత్తారు. "ఆ పార్టీ పెట్టడంలోనే లాలూచీ ఉంది. రాష్ట్ర విభజనలోనూ అలాగే చేశారు. నాడు లాలూచీ పడే జగన్ బెయిల్ తెచ్చుకున్నారు. ఇప్పుడు కేసుల మాఫీకి అదే తంత్రం నడపాలని చూస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు జరపకపోవడాన్ని మిత్రపక్షంగా ఉండీ మేం విమర్శించాం. ప్రతిపక్షంగా ఉన్న వైకాపా మాత్రం కేంద్ర బడ్జెట్‌ని ప్రశంసించింది. రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించకముందే ఎవరు వెళ్లి ఫొటోలు దిగారో అందరికీ తెలుసు.' అన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఆందోళన

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ పరంగా చేసిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరుతూ తెలుగుదేశం ఎంపీలు రెండోరోజూ లోక్‌సభలో నిరసన కొనసాగించారు. ప్రత్యేక హోదా డిమాండ్‌తో వైకాపా ఎంపీలూ ఆందోళన చేపట్టారు. బుధవారం ఉదయం పార్లమెంటు వెలుపల గాంధీ విగ్రహం వద్ద ధర్నాలు నిర్వహించిన ఇరుపార్టీల ఎంపీలు సరిగ్గా 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమయ్యే సమయానికి వెల్‌లోకి వచ్చి ఆందోళనలు కొనసాగించారు.

ప్రజల మనిషిగా బతికారు

- ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, తిరుపతి: "ముద్దుకృష్ణమనాయుడు నిత్యం ప్రజల మనిషిగా బతికారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్ను మూయడంతో.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ముద్దుకృష్ణమ స్వగ్రామమైన చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలోని వెంకట్రామాపురానికి వెళ్లారు. 'ముద్దుకృష్ణమ చనిపోయారంటే జీర్ణించుకోలేకపోతున్నాం. సంక్రాంతి పండుగ కంటే ముందు నన్ను కలిశారు. ఇటీవల మళ్లీ కలవాలనుకున్నాం. కలవలేకపోయాం' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ముద్దుకృష్ణమ పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ గుత్తాసుఖేందర్ రెడ్డి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ శాసనభ ప్రతిపక్ష నేత జానారెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరోసభ్యుడు హరికృష్ణ, తెతెదేపా అధ్యక్షుడు రమణ,నేతలు మోత్కుపల్లి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, నామా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

డెంగీ, మల్టి ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే.

ముద్దుకృష్ణమనాయుడు మూడురోజుల కిందట తీవ్రమైన డెంగీ జ్వరంతో ఆసుపత్రిలో చేరారని, ఆయనను రక్షించేందుకు కృషి చేసినా ఫలితం లేకపోయిందని గచ్చిబౌలి కేర్ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. జ్వరంతో పాటు పలు అవయవాలు పనిచేయకపోవడం(మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్)తో ఆయన తుదిశ్వాస విడిచారని ప్రకటించారు.



ముద్దుకృష్ణమనాయుడు భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న చంద్రబాబు

సాగు లెక్కలా? కాకి లెక్కలా?!

- పంటల సాగుపై జిల్లా వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం
- వారం రోజుల్లో భారీగా పెరిగిన పంటల విస్తీర్ణం

ఈనాడు, హైదరాబాద్: పంటల సాగు లెక్కలను పక్కాగా ఇవ్వడంలో జిల్లా వ్యవసాయాధికారులు (డీఏఓ) నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీ బుధవారం వ్యవసాయశాఖ విడుదల చేస్తున్న నివేదికలో లెక్కలు నమ్మశక్యంగా ఉండడంలేదు. తాజా నివేదికతో ఇది మరింతగా స్పష్టమవుతోంది. తెలంగాణలో 8 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నట్లు వాతావరణ శాఖ నివేదించింది. అవి నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కుమరం భీం, మెదక్ జిల్లాలు. అయితే వీటిలో రాజన్న-సిరిసిల్ల, కుమరం భీం తప్ప మిగతా ఆరు జిల్లాల్లో సాధారణంకన్నా ఎక్కువగా వరి నాట్లు పడినట్లు డీఏఓలు నివేదించారు. ఉదాహరణకు మంచిర్యాల జిల్లాలో 32 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, గత వానాకాలం నుంచి సరిగా వర్షాలు పడలేదని వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఈ యాసంగిలో ఈ జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 9,280 హెక్టార్లతే 11,122 హెక్టార్లలో నాట్లు వేశారని జిల్లా డీఏఓ నివేదించారు. వర్షాలు పడని జిల్లాల్లో భూగర్భజల మట్టాలు సైతం గణనీయంగా తగ్గుతున్నట్లు భూగర్భ జలశాఖ అంచనా వేయగా బోర్ల కిందనే అధికంగా వరి నాట్లు వేస్తున్నట్లుగా జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రం మొత్తం వరి సాధారణ సాగు విస్తీర్ణం 6.15 లక్షల హెక్టార్లకు గాను ఇప్పటివరకూ 6 లక్షల హెక్టార్లలో నాట్లు పడ్డాయి. అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం 12.77 లక్షల హెక్టార్లకు గాను 10.83 లక్షల హెక్టార్లు సాగైనట్లు వ్యవసాయశాఖ చెబుతోంది.

ఇలా.. సాగు పెరుగుతుందా?: కామారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్ మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 71,786 హెక్టార్లు. గత నెల 31న ఈ జిల్లా వ్యవసాయాధికారి ప్రభుత్వానికి ఇచ్చిన సమాచారం ప్రకారం అన్ని రకాల పంటలను 68,463 హెక్టార్లలో సాగుచేశారు. ఇందులో వరి సాగు 24,604 హెక్టార్లుంది. సాధారణంకన్నా 4,634 హెక్టార్లు తగ్గింది. ఇటీవల డీఏఓలతో మంత్రి సమీక్షించినప్పుడు లెక్కలు సరిగా పంపడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన సొంత జిల్లా కామారెడ్డి లెక్కలను పెద్దగా చదివి 4,634 హెక్టార్లు తగ్గినట్లు ఎలా నివేదించారని ప్రశ్నించారు. సరిచేస్తామని డీఏఓ సమాధానమిచ్చారు. బుధవారం విడుదల చేసిన తాజా నివేదికలో కామారెడ్డిలో లెక్కలు చూస్తే వరి సాగు గత వారంరోజుల్లో 24,604 నుంచి 29,798 హెక్టార్లకు పెరిగిందని చెప్పారు. అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం 73,097 హెక్టార్లకు చేరిందని తెలిపారు. అంటే గత వారం తెలిపిన సాగు విస్తీర్ణం 68,463 హెక్టార్లకన్నా 4,634 హెక్టార్లు పెరిగినట్లు తేలింది. మరి వరి సాగు ఒక్కటే ఏకంగా 5,194 హెక్టార్లు పెరిగితే అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం సైతం అంతే మొత్తం పెరగకుండా 4,634 హెక్టార్లే ఎలా పెరుగుతుందన్నది ప్రశ్న. మంత్రి అడిగిన తరవాత వరి సాగు పెరిగినట్లు చూపి ఇతర పంటలను తగ్గించారని దీన్ని బట్టి అర్థమవుతోంది.

నేడు, రేపు కేటీఆర్ దిల్లీ పర్యటన

ఈనాడు, హైదరాబాద్ : మంత్రి కేటీఆర్ గురు, శుక్రవారాల్లో దిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అవుతారు. ప్రపంచ ఐటీ కాంగ్రెస్ ముగింపు సమావేశానికి రావాలని రాష్ట్రపతిని ఆహ్వానిస్తారు. ఐటీ కాంగ్రెస్‌ను వీడియో లింకేజీ ద్వారా ప్రధాని మోదీ ప్రారంభిచనున్న నేపథ్యంలో దీనికి అవసరమైన సమాచారాన్ని ప్రధాని కార్యాలయానికి కేటీఆర్ అందజేస్తారు. ఈ నెల 14 నుచి 16 వరకు జరిగే మైనింగ్ టుడే సదస్సుకు కేంద్ర గనుల శాఖ మంత్రి చౌదరి బీరేందర్‌సింగ్‌ను కేటీఆర్ ఆహ్వానిస్తారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభును కూడా ఆయన కలుస్తారు. ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే బయో ఆసియా సదస్సు ప్రారంభానికి రావాలని కోరతారు.

నేడు ఏపీలో తెదేపా ప్రదర్శనలు

అమరావతి: తెదేపాఎంపీలు పార్లమెంటులో చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా... సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తెదేపా శ్రేణులన్నీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనప్రదర్శనలు నిర్వహించనున్నాయి. విద్యాసంస్థలన్నిటికీ గురువారం సెలవు ప్రకటించారు. గురువారం బస్సులు నడపవద్దని ఆర్టీసీకి ఆదేశాలు జారీ అయ్యాయి

నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలి: కర్నె ప్రభాకర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని నిరుద్యోగుల విషయంలో కాంగ్రెస్ పార్టీ మొసలి కన్నీరు కారుస్తూ, వారిని తప్పుదోవ పట్టిస్తోందని తెరాస ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్.. ఇప్పటికైనా నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం తెరాస ఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెరాస అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టిందని తెలిపారు. నిరుద్యోగులు కాంగ్రెస్ నిజస్వరూపాన్ని గుర్తించారని.. తగిన శాస్తి చేస్తారని అన్నారు

బీడీ కార్మికులకు ప్రత్యేక దవాఖానా

ఈనాడు, హైదరాబాద్: బీడీ కార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ ఆసుపత్రిని నెలకొల్పాలని నిర్ణయించింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో 50 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి పట్టణంలోని పాత ప్రాంతీయ ఆసుపత్రిని కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఈ భవనంలో నిర్మల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. తక్షణమే ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు ఈ స్థలాన్ని అందజేయాలని, వైద్యాధికారి కార్యాలయానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

మాజీ పీసీసీ అధ్యక్షుడు అనంత రాములు వర్ధంతి

హైదరాబాద్, న్యూస్‌టుడే: పీసీసీ మాజీ అధ్యక్షుడు అనంత రాములు వర్ధంతిని బుధవారంగాంధీభవన్‌లో నిర్వహించారు. రామచంద్ర కుంతియా, టీపీసీసీ ఉపాధ్యక్షులు కుమార్‌రావు పాల్గొన్నారు.

రేణుకను నవ్వనివ్వండి.. చర్యలు తీసుకోవద్దు: ప్రధాని

ఈనాడు–దిల్లీ: హోంమంత్రిగా అద్వానీ ఉన్నప్పుడే ఆధార్‌కు బీజం పడిందని బుధవారం రాజ్యసభలో ప్రధాని మోదీ వ్యాఖ్యానించినప్పుడు.. ఎద్దేవా చేస్తున్నట్లుగా కాంగ్రెస్ సభ్యురాలు రేణుకాచౌదరి బిగ్గరగా నవ్వడం కలకలం రేపింది. ఆమె బిగ్గరగా నవ్వడాన్ని సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు తప్పుబట్టారు. ఆరోగ్యసమస్యలేమైనా ఉంటే వైద్యుల దగ్గరకు వెళ్లండంటూ సూచించారు. ఇంతలో రేణుకాచౌదరి లేచి ఏదో చెప్పబోగా కూర్చోవాలంటూ వెంకయ్య గట్టిగా ఆదేశించారు. ఇది మంచిపద్ధతి కాదని, లేదంటే మీపై చర్య తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ సమయంలో ప్రధాని జోక్యం చేసుకుంటూ.. 'అధ్యక్షా మీరు రేణుకపై చర్య తీసుకోవద్దని ప్రార్థిస్తున్నా.. రామాయణం సీరియల్ తర్వాత అలాంటి నవ్వు వినే భాగ్యం ఈ రోజే లభించింది' అన్నారు. దాంతో సభలో గొల్లుమని నవ్వులు వినిపించాయి.

ప్రత్యేక హోదా కోసం ఐక్య పోరాటం

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు ఐక్య కార్యాచరణ సమితి(ఐకాస)ని ఏర్పాటు చేయనున్నట్లు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. కలిసొచ్చే రాజకీయ పార్టీలు, వ్యక్తులు, మేధావులు, సంఘాలతో కలిసి వేదికను ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని ప్రకటించారు. ఉండవల్లి అరుణ్‌కుమార్, జయప్రకాశ్ నారాయణ వంటి నేతల సహకారం తీసుకుంటామన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని జనసేన పరిపాలన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గురువారం నుంచి పలువురిని కలిసి దీనిపై ఒక సమగ్ర చర్చ జరిపి వారి ఆలోచనల ద్వారా వేదికను ముందుకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటం స్ఫూర్తితో ఈ కీలకమైన నిర్ణయం తీసుకొన్నట్లు వివరించారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలోని తెదేపాలపై తనకు నమ్మకం పోయిందన్నారు. విభజన సమయంలో ఉన్న అశాస్త్రీయతతోపాటు రెండు రాష్ట్రాల సమస్యలను పరిష్కరిస్తారనే ఆలోచనతో ఎన్నికల సమయంలో నరేంద్రమోదీకి మద్దతు ఇచ్చానన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అనుభవజ్ఞుడైన చంద్రబాబు ఉంటే మంచిదని భావించి తెదేపాకు పూర్తి మద్దతునిచ్చానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి ఎన్ని నిధులు ఇచ్చిందో, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఖర్చు చేసిందో ఎవరూ స్పష్టతనివ్వకపోవడం వల్ల అనుమానాలకు దారి తీస్తోందన్నారు. బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు చేయకపోవడంపై వామపక్షాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు జనసేన పూర్తి మద్దతిస్తుందని చెప్పారు.

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

makarandam@eenadu.in

‘ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్’ అని ఈశావాస్యోపనిషత్తు చెబుతుంది.

అంటే సమస్తంలోనూ కొలువై ఉన్న పరబ్రహ్మ స్వరూపమే ఆ పరమేశ్వరుడు.

శివుడంటే ఎక్కడో కైలాసంలో కూర్చుని ఉండేవాడు మాత్రమే కాదు...

మనిషి నిద్ర లేచింది మొదలు...

నిద్ర పోయే దాకా ప్రతిదీ ఈశ్వర సంబంధమే...

శివం అంటే శుభం, చైతన్యం అని కూడా అర్థాలున్నాయి.

సాధకుడికి నిత్య సుఖాన్ని, ఆనందాన్ని, అద్భుతమైన శక్తినిచ్చేవాడు శివుడని పురాణాలు చెబుతున్నాయి.

పరమేశ్వరుడు శుభకరుడు...

సుందరుడు... సత్య స్వరూపుడు...

ఆయన కథలు, లీలలు అమృత గుళికలే.

మచ్చుకు కొన్ని...

ఈనెల 13 శివరాత్రి

సత్యం శివం సుందరం



పరమేశ్వరుడు... విశ్వరూపం

శ్రీకృష్ణుడు విశ్వరూపం ధరించి కర్తవ్య బోధ చేసిన వైనం మనకు మహాభారతంలో ఉంది. శివుడు కూడా విశ్వరూపాన్ని ప్రదర్శించాడా?... అవునని చెబుతోంది శివ పురాణం. ఉమా సంహిత మొదటి అధ్యాయం. శ్రీ కృష్ణుడు సంతానం కోసం ఈశ్వరుడిని ప్రార్థించేందుకు కైలాసానికి బయలుదేరాడు. అక్కడ కృష్ణుడికి పరమ శివ భక్తుడైన ఉపమన్యు మహర్షి కనిపించాడు. మాటల మధ్యలో ఆ మహర్షి తాను దర్శించిన శివుడి దివ్య రూపాన్ని గురించి ఇలా వివరించాడు... ఆ స్వామి నిత్యానంద స్వరూపుడు. ఎప్పటికీ నాశనం లేనివాడు. ఆయన ఒక అంశలో జగద్రూపంతో ఉంటాడు. అంటే జగత్తంతా ఆయన స్వరూపమే. ఆయనకు మరో రూపం కూడా ఉంది. పెద్ద కోరలు, మంటలను మింగే నోళ్లతో ఉంటాడు. రెండు వేల సూర్యుల కిరణాల కాంతితో ప్రకాశిస్తుంటాడు. ఆయన చేతుల్లో శ్రేష్ఠమైన అస్త్రాలన్నీ ఉంటాయి. అనేక నేత్రాలు, అసంఖ్యాక పాదాలు ఆయనకుంటాయి. అలా ఉండే ఆయన ఎడమ పక్కన హంసలను పూన్చిన దివ్యవిమానాన్ని ఎక్కి బ్రహ్మ, ఆ పక్కనే గరుడ వాహనాన్ని ఎక్కి నారాయణుడు ఉంటారు. ఇంకా పార్వతి, ప్రమథగణాలు ఆయనతో పాటే ఉంటాయి. కల్పాంతంలో జగత్తునంతటినీ ఉపసంహరించేది శివుడికి సంబంధించిన ఈ విరాడ్రూపమేనని ఉపమన్యు కృష్ణుడికి తెలిపాడు.

కృష్ణయ్య కోసం గోపికగా...

విష్ణువు మోహినీ అవతారం ధరించి దేవతలకు అమృతాన్ని పంచిన కథ మనకందరికీ తెలుసు. శివుడు స్త్రీ వేషం ధరించి కృష్ణుడి కోసం తపించిన వైనాన్ని బృందావనంలో మనం చూడొచ్చు. పూతన తదితర రాక్షసులు రకరకాల వేషాలతో కృష్ణుడిని చంపడానికి ప్రయత్నాలు చేస్తున్న సమయంలో శివుడు బృందావనానికి వెళ్లారు. ఆయనను గోపాలకులు హెచ్చరించి వెనక్కి పంపారు. తాను సాక్షాత్తు పరమేశ్వరుణ్ణి అని చెప్పినా



వారు పట్టించుకోలేదు. అప్పుడు శివుడు గోపికగా మారి బృందావనంలోకి ప్రవేశించాడు. శ్రీకృష్ణుడు అది చూసి ‘స్వామీ! ఏమిటీ వేషం’ అని అడిగాడు. అప్పుడు ‘కృష్ణా! నీ లీలలు చూడడానికి ఈ వేషం తప్పలేదు’ అని శివుడు అన్నాడట. శ్రీకృష్ణుడు స్వయంగా బృందావనంలో ఓ శివాలయం కట్టించాడట. సాయంత్రమైతే గోపికగా మారతాననీ, అందుకు అనుమతిస్తేనే తాను ఇక్కడ ఉంటానని షరతు పెట్టి ఆలయంలో కొలువుదీరాడని చెబుతారు. నేటికీ బృందావనంలోని గోపీశ్వరాలయంలో సాయంత్రం ఆరు గంటల తర్వాత భక్తులకు ప్రవేశం నిషిద్ధం. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పరిమళ ద్రవ్యాలు పూసుకుని స్వామి దర్శనం చేసుకోవచ్చు.

అంబరంలో సాంబయ్య జాడ!

ఉత్తరాయణంలో తొలిగా వచ్చే గొప్ప పర్వదినం మహాశివరాత్రి. ఉత్తరాయణంతో దేవతలకు పగలు మొదలవుతుంది. రోజులో దేవతలు పాల్గొనే తొలి అర్చన శివరాత్రి. మొదటగా ఆరాధించేది పరమేశ్వరుడినే అన్నమాట. శివరాత్రి ఆధ్యాత్మిక పరిమళాల్నే కాదు.. వైజ్ఞానిక సుగంధాలనూ వెదజల్లుతుంది. ఈ పర్వదినాన ఉత్తర ధ్రువం నుంచి ఖగోళ అద్భుతాలను స్పష్టంగా చూడవచ్చు. సహజంగా ప్రతి నెలలో కృష్ణ చతుర్దశిని మాస శివరాత్రిగా చేసుకుంటాం. ఖగోళ దర్శనానికి ఇంతకు మించిన మంచి రోజు లేదంటారు. చంద్రుని వెలుగులో కనిపించని నక్షత్రాలు.. అమావాస్య ముందురోజైన చతుర్దశి నాడు స్పష్టంగా గోచరిస్తాయి. పైగా.. మహాశివరాత్రి రోజు ఆకాశాన్ని పరీక్షగా చూస్తే.. నక్షత్రాలన్నీ జ్యోతిర్లింగాకృతిలో దర్శనమిస్తాయి. ఉత్తర ధ్రువం నుంచి ఇది మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సృష్టంతా అండాకృతిలో ఉందని పెద్దల మాట. లింగ స్వరూపం కూడా అదే ఆకృతి. శివుడికి స్థాణువు అన్న పేరు కూడా ఉంది. స్థాణువు అంటే కదల్లేనిది అని అర్థం. కదలడానికి వీలులేనంతగా అంతటా నిండి ఉన్న శివత్వమే స్థాణువు. అది సృష్టంతా నిండి ఉంది. ఖగోళమంతా పరివ్యాప్తమై ఉంది.

అఘోర ఎవరు?

సాధారణంగా అఘోర రూపం భయానకమైందని భావిస్తారు. కానీ, వాస్తవం దీనికి పూర్తిగా భిన్నం. శివుడు నిశ్చల శాంతి రూపుడని చెప్పడానికి ఆయన అఘోర రూపం ఓ ఉదాహరణ. అఘోరుడిగా శివుడు శివం అనే కల్పంలో అవతరించాడు. కల్పం ఆరంభంలో బ్రహ్మదేవుడికి సృష్టి ఎలా చేయాలో గుర్తు రాలేదు. అప్పుడు తనకు జ్ఞానం కావాలని తపస్సు చేసినప్పుడు శివుడు ఈ అవతారాన్ని ధరించి జ్ఞానబోధ చేశాడని చెబుతారు. అప్పుడాయన నల్లటి ఛాయలో ఉన్నాడు. ధరించిన వస్త్రాలు, యజ్ఞోపవీతం, కిరీటం కూడా నల్లటివే. శరీరానికి దివ్యసుగంధాది ద్రవ్యాలను అద్దుకుని ప్రశాంతవదనంతో ఆయన అవతరించాడు.

అభిషేక ఫలితం

పంచామృతాలు – ఆరోగ్యం	పద్మాలు, మారేడు దళాలు – సంపద
నెయ్యి – మోక్ష సిద్ధి	గంధం – లక్ష్మీప్రదం
పాలు – దీర్ఘాయుష్షు	భస్మం – అపమృత్యు దోషం నుంచి విముక్తి
పెరుగు – ఆరోగ్యం, సంతానవృద్ధి	



ఏది సత్యమో... ఏది నిత్యమో... అదే నిజమైన ఆనందం. నిజమైన సుఖం. ఈ స్థితినే గీతలో శ్రీకృష్ణుడు దుఃఖసుఖాత్యయం అని నిర్వచిస్తాడు. అంటే దుఃఖానికి, సుఖానికి అతీతమైన స్థితి అని అర్థం. ఇంద్రియాల వల్ల వచ్చే హాయి కలిగినట్టే కలిగి అలాగే పోతుంది. అది ఎంత కలిగిందో అంతా ఉండదు. సున్నా అవుతుంది. చివరకు దుఃఖంగా మారిపోవచ్చు కూడా.. ఒక రేఖకు ఒక చివర సుఖమైతే మరో చివర దుఃఖం ఉంటుంది. రెండింటి మధ్య బిందువు దగ్గర అది సుఖ, దుఃఖాలను దాటిన స్థితి అవుతుంది. ఇక్కడ ఏ అలజడీ ఉండదు. ఇదే నిజమైన ఆనందం... దీన్నే శివం అని పిలుస్తారు.

ఆనందానికి అసలు రూపం

అందుకే స్వచ్ఛమైన ఆనందానికి ఒక రూపం ఊహిస్తే అదే శివ స్వరూపం. సుఖదుఃఖాల మధ్య బిందువుకు ఎలా చేరుకోవాలి? అనే ప్రశ్నకూ శివ స్వరూపమే సమాధానం చెబుతుంది. శివుడు యోగ ముద్రలో కూర్చోవడమే కాదు. ఆయన మెడ చుట్టూ పాము కూడా చుట్టుకుని ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ అదరకుండా, బెదరకుండా, కదలకుండా యోగ ముద్రలో కూర్చోవడమే ఆనందానికి మార్గమని శివుడు తన రూపంతో మనకు ఉపదేశిస్తున్నాడు. చుట్టూ ఎన్ని కష్టాల పాములు చుట్టుకున్నా క్షోభ పడకుండా, భయపడకుండా ఉండడమే ఆనందమంటే..

సుదర్శన చక్రం శివుడి చేతిలోనూ...

విష్ణువు ఆయుధం సుదర్శన చక్రం. మరి శివుడు కూడా సుదర్శన చక్రాన్ని ధరించాడా? అవునంటుంది శివ పురాణం. పరమేశ్వరుడి అవతారాల్లో ఒకటైన వామదేవ మూర్తిది విష్ణు స్వరూపం. ఆయన చేతిలో శంకు, చక్రాలు కూడా



ఉంటాయి. శివకేశవ ఏకత్వాన్ని రూఢి చేస్తూ ‘శివాయ విష్ణు రూపాయ... శివ రూపాయ విష్ణవే’ అనే మంత్రభాగం ఉండనే ఉంది. ఇది కాకుండా ఉపమన్యు మహర్షి శివుడు తనకు దర్శనమిచ్చిన అవతారంలో చేతిలో సుదర్శన చక్రం ఉందని చెబుతారు. ఇంకా రుద్రుడి చేతిలో ఓ మహత్తరమైన ఆయుధం ఉంటుంది. అదే త్రిశూలం. దానిని విజయం అని పిలుస్తారు. త్రిశూలాన్ని ధరించినందునే శివుడిని శూలి అని అంటారు. భూమిని బద్దలుకొట్టి, సముద్రాలను ఎండగట్టి, నక్షత్ర సమూహాలను కూల్చేసే శక్తి ఈ ఆయుధానికి ఉంటుందని చెబుతారు. ఈ శూలం మూడు కొనలు కనుబొమల్లా, నిలువెత్తున ఉండి భయంకరంగా కనిపిస్తుంది. అలాగే శివుడి చేతిలో గండ్రగొడ్డలి ఒకటి ఉంటుంది. వీటితో పాటు సుదర్శన చక్రం, వజ్రాయుధం, అమ్ములపొదిలో పినాకం అనే ధనుస్సు, కత్తి, పాశం, అంకుశం కూడా ఉంటాయి.

- యల్లాప్రగడ మల్లికార్జునరావు



తిరుమల క్షేత్రపాలకుడు శివయ్యే!

భూలోక వైకుంఠమైన తిరుమల.. శ్రీవైష్ణవ క్షేత్రమని, శ్రీనివాసుడి సన్నిధి అని మనకు తెలిసిందే. ఇక ఆ ఆలయ పాలనా వ్యవహారాలు చూసే సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే). ఈ సంస్థ తిరుమలతోపాటు అనేక చోట్ల వైష్ణవాలయాల పాలనా బాధ్యతలను స్వయంగా చూస్తుంది. అలాంటి తితిదే ఆధ్వర్యంలో ఉన్న ఏకైక శైవ క్షేత్రం కపిలతీర్థం. పరమేశ్వరుడు తిరుమల క్షేత్రపాలకుడు కావడమే ఇందుకు కారణం. వేంకటాచల పాద సమీపంలో (తిరుపతిలో) ఉన్న కపిలతీర్థాన్ని సుదర్శన చక్రత్తాళ్వార్ తీర్థం, చక్రత్తాళ్వారు తీర్థం, ఆళ్వారు తీర్థం అని కూడా పిలుస్తారు. ఏడు కొండల నుంచి అనేక ఔషధ మూలికలను తాకుతూ జాలువారే పుణ్యధారలతో ఏర్పడిన కపిలతీర్థం సరోవరం పక్కనే.. స్వయంభువుగా ఆవిర్భవించిన శ్రీ కపిలేశ్వర మహాశివలింగం గల గుహాలయం ఉంది. కపిలేశ్వరుడితోపాటు కామాక్షి అమ్మవారు, నరసింహస్వామి తదితర ఆలయాలనూ దర్శించుకోవచ్చు. తిరుమల ఎంతటి ప్రాచీనమైనదో అంతకంటే ప్రాచీనమైనది కపిలేశ్వరస్వామి ఆలయం అని చెబుతారు. పద్మావతికి, శ్రీనివాసుడికి కల్యాణం జరగాలని అనుగ్రహించిన వరప్రదాత కపిలేశ్వరుడు.

తిరుమల యాత్రకు వచ్చిన భక్తులు శ్రీవారి దర్శనానికి ముందు.. కపిలతీర్థాన్ని దర్శించి తీర్థవిధులు నిర్వహించాలి. ఆ తర్వాతే ఆపదమొక్కుల వాడిని దర్శించుకోవాలని స్థలపురాణం చెబుతోంది. తన దర్శనానికి వచ్చిన యాత్రికుల పాపాలను కపిలేశ్వరుడు దూరం చేస్తాడట. కపిలేశ్వరుని వల్ల పాపవిముక్తులైన వారికి అమృతత్వాన్ని (వేం), ఐశ్వర్యాన్ని (కట) ప్రసాదిస్తాడట వేంకటరమణుడు. ఏడు కొండల్లో నెలకొన్న అనేక పుణ్యతీర్థాలను దాటుకుని కపిలతీర్థం సరోవరంలో పడేందుకు వస్తున్న ధారల కింద నిలబడి స్నానమాచరించడం యాత్రికులకు మరపురాని అనుభూతనే చెప్పాలి. తిరుపతిలోని అలిపిరికి సమీపంలోనే ఉన్న ఈ క్షేత్రం ముందునుంచే తిరుమలకు వెళ్లే వాహనాలన్నీ రాకపోకలు సాగిస్తాయి. కాబట్టి యాత్రికులు సులువుగానే కపిలతీర్థం చేరుకోవచ్చు.

– వద్దిరాజు శేష సత్య శివ ప్రసాద్



కరుణించు మేరిమాతా!

దేవుడు అన్ని చోట్లా ఉండలేక తల్లిని సృష్టించాడని అంటారు. అలా అమ్మ దేవుడికి ప్రత్యామ్నాయంగా నిలిస్తే... అలాంటి దేవుడికే జన్మనిచ్చిన తల్లి ఎంత గొప్పది! ఆయమ్మే యేసుక్రీస్తుకు జన్మనిచ్చిన మేరీమాత. క్రీస్తు ప్రబోధాలు, ప్రవచనాలు విస్తరించిన అన్నిచోట్లా ఆయన తల్లి అయిన మేరీమాతపై భక్తులలో ఎంతో ఆదరణ, నమ్మకం, భక్తి కనిపిస్తాయి.

మెడలో ఉత్తరీయం ధరించి పాదయాత్రలు చేస్తూ తొమ్మిది రోజులూ.. జపాలతో మేరీమాతను పూజించడం ఎప్పట్నుంచో ఉన్నదే. ఫ్రాన్స్‌లోని లూర్థు నగరంలో 1858 ఫిబ్రవరి 11న మేరీమాత బెర్నెదెత్ అనే బాలికకు దర్శనమిచ్చిందని చెబుతారు. ఆ దర్శనం స్ఫూర్తిగా 1925లో విజయవాడలోని గుణదలలో ఫాదర్ ఆర్లతి అనే మత బోధకుడు మేరీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కొండల నడుమ పచ్చని ప్రకృతికి ఆలవాలంగా ఉన్న ఆ ప్రాంతం 1971 నాటికి మేరీమాత ఆలయంగా రూపొందింది. ప్రతి సంవత్సరం ఆ ప్రాంతంలో జనవరి 31 నుంచి తొమ్మిది రోజులు నవదిన ప్రార్థనలు జరుగుతాయి. ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు మూడు రోజులు జరిగే ఉత్సవాలకు



ఈనెల 9 నుంచి మేరీమాత ఉత్సవాలు

ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది భక్తులు వస్తుంటారు.

ఒక తల్లి గర్భం నుంచే జన్మపాపం లేకుండా జన్మించిన మేరీమాతను ‘అమలోద్భవి’ అని ప్రస్తుతించారు 13వ శతాబ్దానికి చెందిన మతబోధకుడు స్కోతుస్. యేసు పునరుత్థానం వరకూ ఆయనతో ఉండి, తిరిగి మోక్షారోహణంతో తన జీవితాన్ని సంపూర్ణం చేసుకుందని.. ఆమెను “ఉత్థాపిత మాత’గా పేర్కొంటారు విశ్వాసులు. సిలువపై మరణయాతన అనుభవిస్తున్న యేసుక్రీస్తు గుండెల్లో ఓ సైనికుడు ఈటెతో పొడిచాడు. ఆ దృశ్యాన్ని చూసిన మాతృహృదయం, తన గుండెల్లోనే ఖడ్గం దిగినంత బాధపడిందని ఆమెను ‘వ్యాకులమాత’గా ఆరాధిస్తుంటారు. ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని ధైర్యంగా స్వీకరించి అంతులేని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిందాతల్లి. అందుకే పూజనీయురాలైంది.

–ఎం.సుగుణరావు

ధర్మసందేహం

హృదయంలో మేల్కొనడం



అనారోగ్యంతో ఉన్నవాళ్లు శివరాత్రి ఉపవాసం, జాగరణ ఎలా చేయాలి?

– శ్రీనివాస్, హైదరాబాద్

ఉపవాసం అంటే దేవుడికి దగ్గరగా ఉండటం. కేవలం భోజనం మానడం కాదని గ్రహించాలి. అలాగే జాగరణ అంటే రాత్రంతా నిద్రించకుండా మేల్కొని ఉండటం కాదు.. దైవ భావన మన హృదయంలో మేల్కొనడం. నిరంతరం దైవ చింతన వల్ల మనస్సు భగవంతునికి చేరువయ్యే అవకాశం ఉంటుంది. శివరాత్రి రోజు పండ్లు, పాలు మాత్రమే ఆహారంగా తీసుకొని ఎక్కువ సమయం పరమేశ్వరుడి చింతనలో గడుపుతారు. పచ్చిగంగైనా ముట్టకుండా సాయం సంధ్య వరకూ కఠినంగా ఉపవాసం చేసేవాళ్లూ ఉంటారు. శరీర ధర్మానికి హాని కలుగని రీతిలో ఇవి పాటించాలనీ, అవసరమైనప్పుడు సడలింపులు చేసుకోవచ్చని పెద్దలు స్పష్టం చేశారు. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు వైద్యుని సలహాతో తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో దోషం లేదు. నేనంటే శరీరం కాదని, ఈ శరీరం దేవుడి ఆలయమనీ ఒక దివ్యభావన హృదయంలో మేల్కొనాలి. ఉపవాస, జాగరణల పరమార్థం ఇదే!

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి



మాస్ ప్రేక్షకుడి నాడి తెలిసిన దర్శకుడు వి.వి.వినాయక్. వాణిజ్య ప్రధానమైన సినిమాలకి పెట్టింది పేరు. ఆరంభంలో యాక్షన్, ఫ్యాక్షన్ అంశాలకే పెద్దపీట వేస్తూ సినిమాల్ని తెరకెక్కించిన ఆయన తర్వాత హాస్యంపై కూడా పట్టు పెంచుకొన్నారు. దాంతో వినాయక్ సినిమా అనగానే ఇంటిల్లిపాదినీ అలరించే వినోదం ఉంటుందనే ఓ భరోసా ప్రేక్షకుల నుంచి వ్యక్తమవుతోంది. చిరంజీవి 150వ చిత్రం 'ఖైదీ నంబర్ 150' తెరకెక్కించి విజయాన్ని సొంతం చేసుకొన్న ఆయన తాజాగా సాయిధరమ్ తేజ్‌తో 'ఇంటిలిజెంట్' తెరకెక్కించారు. ఆ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు వినాయక్.

నాకు ఆ ఆలోచన లేదు... విధి ఏం చేస్తుందో చూడాలి!

✦ "నేను దర్శకత్వం వహిస్తున్న 17వ చిత్రం 'ఇంటిలిజెంట్'. రచయిత ఆకుల శివ రాసిన కథలతో ఇదివరకే మూడు సినిమాలు చేశా. అవన్నీ కూడా విజయవంతమయ్యాయి. ఈ చిత్రం కూడా వాటి జాబితాలో చేరుతుంది. ఒక మైండ్ గేమ్‌తో కూడిన కథ ఇది. అందుకే ఆ పేరు పెట్టాం. ఆమధ్య వార్తల్లో వినిపించిన స్నేక్‌గ్యాంగ్ నేపథ్యం కూడా ఉంటుంది. తనకి సాయం చేసిన వ్యక్తికి సమస్య వచ్చినప్పుడు ఒక యువకుడు ఎంత వరకు పోరాటం చేశాడనే అంశానికి వినోదాన్ని జోడించి చిత్రాన్ని తెరకెక్కించాం. మంచి హాస్యంతో పాటు, యాక్షన్, వినసొంపైన పాటలున్న వాణిజ్య ప్రధానమైన చిత్రం. మా సాంకేతిక బృందమంతా చక్కటి తోడ్పాటునందించింది".

✦ "చిరంజీవి అన్నయ్యతో సినిమా అంటే మా అందరికీ ఒత్తిడి కొంచెం ఎక్కువగా ఉంటుంది. యువ కథానాయకులతో సినిమా అంటే చాలా సరదాగా ఉంటుంది. 'ఠాగూర్' చేస్తున్నప్పట్నుంచి రామ్‌చరణ్, అల్లు అర్జున్‌లతో అనుబంధం ఉంది. సరదాగా సెట్‌కి వచ్చినప్పుడు అన్నయ్య అన్నయ్య... అంటూ నా దగ్గరికొచ్చేవాళ్లు. విలువలతో కూడిన వ్యక్తిత్వం వాళ్లది. తేజు కూడా అంతే. తన స్టైల్‌లో ఈ సినిమాని చేశాడు. కామెడీ, యాక్షన్, పాటలు... ఇలా అన్ని విషయాల పరంగా తనకి మరింత పేరు తీసుకొస్తుందీ చిత్రం. ఒక పాటలో అయితే చిరంజీవిలా కనిపిస్తాడు. ఎంత పెద్ద కథనైనా ఈ హీరో మోయగలడనే అభిప్రాయం సినిమాలో తేజుని చూశాక ప్రతి ఒక్కరికీ కలుగుతుంది".

✦ "కొత్తదనంతో చేద్దామనే ఆలోచన వచ్చిన ప్రతిసారీ పరాజయాన్ని చవిచూశా. నా సినిమాలు ఒక ఫార్మాట్ ప్రకారమే ఉంటాయి. కథ విన్నప్పుడు 'ఇది బాగుంది, ఆడుతుంది' అనిపించినప్పుడు వాటితో ప్రయాణం చేస్తుంటా. సినిమా అయిపోగానే 'తర్వాత ఏంటండీ?' అని అడుగుతుంటారు (నవ్వుతూ). దాంతో ఆలోచించి కథ రాసుకొనే సమయం దొరకడం లేదు. అప్పటికే కొన్ని కథలు వినుంటాను కాబట్టి, వాటిలో బాగున్న కథని ఎంచుకొని సినిమా చేస్తుంటా. దర్శకుడు కె.రాఘవేంద్రరావు కలిసినప్పుడు ఒక మాట చెబుతుంటారు. 'బయట కథలు కూడా తీస్తూ ఉండాలి, అప్పుడే ఇంకో కొత్త కోణం కనిపిస్తుంటుంది' అంటారు. నిజంగానే బయటి కథలతో నేను సినిమాలు చేయకపోతే ఇప్పటికీ ఫ్యాక్షన్ కథల దర్శకుడిగానే చూసేవాళ్లు. ఎప్పుడైతే వినోద ప్రధానమైన 'కృష్ణ', 'అదుర్స్' తదితర సినిమాలు చేశానో నాలో మరో కోణం బయటికొచ్చింది. అది నా రచయితల వల్లే సాధ్యమైంది. వినాయక్ సినిమా అంటే సుమోలు గాల్లో లేయడం, ఛేజింగ్‌లే కాదు. ఆమధ్య ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లినప్పుడు ఒకాయన 'సార్ ఈ సినిమాలో సుమోలు గాల్లో లేస్తాయా?' అని అడిగారు (నవ్వుతూ). ప్రతి సినిమాలోనూ సుమోల్ని ఎలా లేపుతాం. కథనిబట్టే ఉంటుంది ఏదైనా. ఈమధ్య తెలుగులో మంచి కథలొస్తున్నాయి. స్ఫూర్తి పొంది కథలు రాసుకోవడమనేది ఎప్పట్నుంచో ఉన్నదే. అప్పట్లో సోషల్ మీడియా లేదు కాబట్టి ఆ విషయం తెలిసేది కాదు".

✦ "తెలుగు చిత్రసీమలో రచయితల కొరత లేదు కానీ... మంచి ప్రతిభ ఉన్నవాళ్లకి అవకాశాలు రావడం లేదు. అవకాశాలు వచ్చినవాళ్లకేమో మంచి కథలు దొరకడం లేదు. రచయితలుగానే పరిశ్రమలోకి ప్రవేశించినా అందరికీ దర్శకుడవ్వాలనే కోరిక ఉంటుంది. కచ్చితంగా కావాలి కూడా. పరిశ్రమకు కొత్తవాళ్లు కూడా అవసరం కదా! కాంబినేషన్ల ప్రకారం సినిమాలు తీయడం తప్పేమీ కాదు. సినిమా వ్యాపారరంగం. డబ్బులు పెడుతున్నప్పుడు తిరిగి రాబట్టుకొనేందుకు ప్రతి ఒక్కరూ వ్యాపారకోణంలో ఆలోచించాల్సిందే".

✦ "కొత్త నటులతో ఓ కొత్త రకమైన సినిమా చేయాలనే ఆలోచన ఉంది. అయితే అది కార్యరూపం దాల్చడానికి ఇంకో రెండేళ్లు పడుతుంది. తదుపరి సినిమా ఏంటన్నది ఇంకా ఏమీ ఆలోచించలేదు. కథనిబట్టే ఏ నిర్ణయమైనా. 'అదుర్స్ 2' కోసమని కొన్నాళ్లు పనిచేశాం కానీ... కథ సంతృప్తికరంగా రాలేదు. ఆ సినిమా చేయాలనే ఆలోచన మాత్రం ఉంది. కానీ అది ఎప్పుడు జరుగుతుందో తెలియదు. మహేష్ బాబుతో సినిమా చేయాలని కూడా అనుకొన్నాం కానీ కథ కుదరలేదు. నేనే మహేష్‌కి తగ్గ కథ చెప్పలేకపోయా. నచ్చే కథ కోసమే ప్రయత్నిస్తున్నా. రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. మా కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండటంతో నేను వస్తున్నాననే ప్రచారం జరుగుతోంది. అయితే నన్ను ఎవ్వరూ సంప్రదించింది లేదు, నాకు ఆ ఆలోచన లేదు. అయితే నేను దర్శకుడిని అవుతానని అనుకోలేదు, కానీ అయ్యాను. మరి విధి ఏం చేస్తుందో నేను చెప్పలేను".

శ్రీనివాసుడితో కళ్యాణం

నితిన్ కథానాయకుడిగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'శ్రీనివాస కళ్యాణం'. దిల్‌రాజు నిర్మిస్తున్నారు. వచ్చే నెలలోనే సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రంలో కథానాయికగా నందిత శ్వేత నటించబోతోంది. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా'లో నటించి ఆకట్టుకొన్న కథానాయిక నందిత. ఆ చిత్రంలో ఆమె అందం, అభినయం ప్రేక్షకులకు బాగా నచ్చింది. తమిళంలో వరుసగా అవకాశాలు అందుకొంటూ బిజీగా గడుపుతున్న ఆమె, తెలుగులో ఆలస్యంగా మరో అవకాశాన్ని సొంతం చేసుకొంది. 'శతమానం భవతి'తో విజయాన్ని అందుకొన్న సతీష్ వేగేశ్న, మరోసారి కుటుంబ కథని సిద్ధం చేసి 'శ్రీనివాస కళ్యాణం' తెరకెక్కిస్తున్నారు.



నితిన్



నందిత శ్వేత

వచ్చే నెల్లో మొదలు

ఎన్టీఆర్ కొత్త సినిమా చిత్రీకరణకి రంగం సిద్ధమైంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఆ చిత్రం వచ్చే నెలలోనే సెట్స్‌పైకి వెళ్లబోతోంది. కథానాయికతో పాటు ఇతర తారాగణం, సాంకేతిక బృందం వివరాల్ని మరో పది రోజుల్లోనే ఖరారు చేసి ప్రకటించబోతున్నారు. 'జై లవకుశ' తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న చిత్రమిదే. ఇందులో ఆయన ఒక కొత్త లుక్‌లో కనిపించడంతో పాటు, కొత్త రకమైన పాత్రతో సందడి చేయబోతున్నట్టు సమాచారం. ఆ పాత్రకి తగ్గట్టుగా తనని తాను తీర్చిదిద్దుకొనే పనిలోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటిస్తున్న 28వ చిత్రమిది. త్రివిక్రమ్‌తో కలిసి ఆయన చేస్తున్న మొట్టమొదటి చిత్రం కావడంతో భారీ అంచనాలున్నాయి. అనిరుధ్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు.



ఎన్టీఆర్



"చాలామందికి తొలిప్రేమ అనుభూతులు ఉంటాయి. కానీ కొందరికే ప్రేమ ఫలిస్తుంది. కానీ తొలి ప్రేమ ఓ మధుర జ్ఞాపకం. మా 'తొలి ప్రేమ' చూశాకా అవన్నీ గుర్తుకొస్తాయి" అంటోంది రాశీఖన్నా. ఆమె వరుణ్‌తేజ్ సరసన నటించిన చిత్రం 'తొలి ప్రేమ'. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో రాశీఖన్నా విలేకర్లతో ముచ్చటించింది. ఆ విశేషాలివీ...

ప్రేమిస్తున్నా అన్నాడు.. ఏం చెప్పాలో అర్థం కాలేదు!

"నా పదిహేడవ ఏట ఓ అబ్బాయి 'ప్రేమిస్తున్నాను' అని చెప్పాడు. నాకు అంతవరకూ ప్రేమంటే ఏంటో తెలియదు. ఏం చెప్పాలో పాలుపోలేదు. తనతో ఏం చెప్పకుండానే మౌనంగా వెళ్లిపోయా. ఆ అబ్బాయి మాత్రం నన్ను కొన్నాళ్లు అనుసరించాడు. నేనేం మాట్లాడేదాన్ని కాదు. అలాగని ప్రోత్సహించేదాన్నీ కాదు. దాంతో ఆ అబ్బాయికి విసుగొచ్చేసింది. నాతో ప్రేమకు గుడ్‌బై చెప్పేశాడు. నా జీవితంలో చోటుచేసుకున్న అప్పటి తొలిప్రేమ సంఘటన ఈ 'తొలిప్రేమ'లో నేను పోషిస్తున్న పాత్రకు బాగా ఉపయోగపడింది."

ఆ ప్రశ్నకు సమాధానమిది

'తొలిప్రేమ'లో నా పాత్ర పేరు వర్ష. నా పాత్రలో మూడు విభిన్న పార్శ్వాలుంటాయి. అందుకోసం పాత్ర పోషణలో పలు జాగ్రత్తలు తీసుకున్నాను. ఆహారనియమాలు పాటించా. మామూలుగా నేను జిమ్‌కి వెళ్లి గంటన్నర వ్యాయామం చేస్తాను. కానీ ఈ చిత్రం షూటింగ్ సమయంలో అదనంగా రెండు గంటలపాటు రెండు నెలలు వ్యాయామం చేశా. బరువు ఐదు కిలోలు తగ్గా. నాజూగ్గా తయారయ్యాను. ఈ చిత్రంలో మేకప్ అంతగా వేసుకోలేదు. అయినా ఛాయాగ్రాహకుడు జార్జి చాలా అందంగా చూపారు. పాటల్లో అయితే అదరగొట్టేశారు. 'ఊహలు గుసగుసలాడే' తర్వాత అలాంటి ప్రేమకథ మళ్లీ ఎప్పుడు చేస్తారు? అని చాలామంది అడిగారు. అభిమానులైతే ఇప్పటికీ ప్రశ్నలు సంధిస్తున్నారు. వారికి ఈ 'తొలిప్రేమ' సమాధానం అవుతుంది. నటనకి ఎక్కువ ఆస్కారం ఉన్న పాత్ర ఇది. కాస్త ఛాలెంజింగ్ అయినా నిరూపించుకొనే ప్రయత్నం చేశాను. చూద్దాం ..విడుదలయ్యాక ఎలాంటి స్పందన వస్తుందో..? కథ, సన్నివేశాలను దర్శకుడు వెంకీ అట్లూరి చక్కగా వివరించారు. పక్కా ప్రణాళికతో 'తొలిప్రేమ'ని అనుభవం ఉన్న దర్శకుడిలా తీర్చిదిద్దారు. పవన్‌కల్యాణ్ తొలిప్రేమ.. ఈ చిత్రానికీ చాలా తేడా ఉంది. ఈతరం ఆస్వాదించే ప్రేమకథాచిత్రంగా ఆకట్టుకుంటుంది. అన్ని పాటలూ హాయిగా ఉన్నాయి. 'విన్నానే విన్నానే' పాట బాగా నచ్చేసింది. పాటలు పాడటమంటే ఇష్టం ఉండటంతో వీలుకుదిరితే నా సినిమాల్లోనూ పాటలు పాడేస్తున్నాను. ఇందులో 'అల్లసాని వారి..' పాట శ్రేయ ఘోషల్ గొంతులో శ్రావ్యంగా వినిపిస్తోంది. ఇంత శ్రావ్యత నా గొంతులో ఉండదు గనుక నేను పాడే సాహసం చేయలేదు"

తీరిక లేక చెప్పలేదు

"నా గొంతు విన్నవారు బాగుందంటూ ప్రశంసిస్తున్నారు. నా సినిమాలకు నేనే డబ్బింగ్ చెప్పుకోవాలి అనిపిస్తుంది. ఆ ప్రయత్నాలూ చేస్తున్నాను. షూటింగ్‌లతో తీరికలేక కుదరడం లేదు. ఆ కారణంతోనే ఈ సినిమాకీ డబ్బింగ్ చెప్పలేకపోయాను. తదుపరి చిత్రాలకు ఏదోలా వీలు చేసుకుని డబ్బింగ్ చెప్పాలనుంది"

అప్పుడు ఆలోచిస్తా

"ఈ రెండేళ్లలో అరడజనుకి పైగానే సినిమాలు చేశా. కొత్తగా రెండు తెలుగు సినిమాలకి సంతకం చేశా. రాబోయే రెండు నెలల్లో అవి మొదలవుతాయి. తమిళంలో మూడు సినిమాలు చేస్తున్నాను. వాటిలో రెండు విడుదలకు సిద్ధమయ్యాయి. జయం రవితో చేస్తున్న చిత్రం ఒక షెడ్యూల్‌ని పూర్తిచేసుకుంది. మలయాళంలోనూ ఓ చిత్రంలో నటించాను. దక్షిణాదిలో చక్కటి ఆదరణ లభిస్తోంది. ఈ దశలో బాలీవుడ్ చిత్రాలు చేయాలనే ఆలోచన లేదు. ఏదైనా మంచి కథొస్తే..అప్పుడు ఆలోచిస్తా"

అప్పుడు బంధంలో... ఇప్పుడు ఒంటరిగా..



ప్రియాంక

"నా చేతికి నిశ్చితార్థపు ఉంగరం పెట్టుకున్న రోజు నా పెళ్లి గురించి చెబుతాను. అప్పటి వరకు అడగొద్దు" - మీరు ఎవరితోనైనా ప్రేమలో ఉన్నారా? అని 2016లో అడిగితే ప్రియాంక చెప్పిన సమాధానం ఇది. "ప్రస్తుతానికి పెళ్లి ఆలోచనలేవీ లేవు. నాకు సరైన జోడీ దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. కానీ ఇంకా దొరకలేదు" 2017లోనూ పెళ్లి గురించి ప్రియాంక మాట ఇది. కానీ ఇప్పుడు ప్రియాంక చెబుతున్న మాట కాస్త ఆశ్చర్యం కలిగించేలా ఉంది. "నేను నిబద్ధతతో కూడిన బంధంలో ఉన్నాను. కానీ ఒక సంవత్సరం నుంచి ఒంటరిగానే ఉంటున్నాను. ఈ మధ్యలో చాలామందిని కలిశాను. చాలామందితో స్నేహం చేశాను. ఎవరూ నచ్చలేదు" అని చెప్పింది. మరోసారి ప్రేమలో పడే అవకాశం ఉందా? అంటే "చాలా రోజులు ఒంటరిగా ఉన్నాను. ఇప్పుడు ప్రేమించాలంటే ఎంతో దృష్టిపెట్టాలి (నవ్వుతూ)"అంది ప్రియాంక. బాలీవుడ్‌లో సందడి చేసిన ప్రియాంక ఇప్పుడు హాలీవుడ్ సినిమాలు, సీరియళ్లతోనే బిజీగా గడిపేస్తుంది. ప్రస్తుతానికి బాలీవుడ్ వెండితెరపై కనిపించకపోయినా నిర్మాతగా పలు భాషల్లో వైవిధ్యమైన చిత్రాలు నిర్మిస్తోంది.

పంచ్ డైలాగ్

లైఫ్ ఏదీ మనకు ఎదురొచ్చి ఇవ్వదు. మనమే ఎదురెళ్లి తీసుకోవాలి. అది బాధ నుంచి సంతోషమైనా. ఓటమి నుంచి గెలుపైనా.

చిత్రం: రాజా ది గ్రేట్
- పంపినవారు:
మహ్మద్ నయీముద్దీన్, కల్వకుర్తి

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
మెయిల్ ఐడీ: cinema@eenadu.net

గీతోపదేశం

అల్లుకున్న ఈ బంధమంతా
వెల్లువైనదీ లోగిలంతా
పట్టెడన్నమిచ్చి పులకించే
నేలతల్లి వంటి మనసల్లే
కొందరికే హృదయముందీ
నీ కొరకే లోకముందీ

గీతం: చిరుగాలి వీచెనే...
చిత్రం: శివపుత్రుడు
రచన: వనమాలి
- పంపినవారు:
ఎస్.భానుచంద్ర, నల్గొండ



'ప్యాడ్‌మ్యాన్'

ఇటీవలి కాలంలో నిజజీవిత కథలు, యథార్థ సంఘటనలతో తెరకెక్కే చిత్రాలను ఎక్కువగా ఎంచుకుంటూ ప్రత్యేకత చాటుకుంటున్నాడు అక్షయ్ కుమార్. ఆ కోవలోనే ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'ప్యాడ్‌మ్యాన్'. పద్మశ్రీ పురస్కార గ్రహీత, తమిళనాడుకు చెందిన అరుణాచలం మురుగనందమ్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. సోనమ్ కపూర్, రాధికా ఆప్టే కథానాయికలుగా నటించారు. 'పా', 'ఇంగ్లిష్ వింగ్లిష్' లాంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆర్.బాల్కి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అమితాబ్ బచ్చన్ అతిథి పాత్రలో కనిపిస్తారు. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతున్న నేపథ్యంలో ఆ విశేషాలివీ.

విడుదలకు సిద్ధం

'ప్యాడ్‌మ్యాన్'... ఇండియా సూపర్‌మ్యాన్

బాలీవుడ్‌లో జీవితకథా చిత్రాలు ఇప్పుడు విరివిగా వస్తున్నాయి. జీవితమనే క్రీడలో అజేయులుగా నిలిచినవారు.. క్రీడలే జీవితంగా గడిపినవారిలో విజేతలు.. ఇలా ఎంతోమంది కథలు వెండితెరపై ఆవిష్కృతమవుతున్నాయి. అయితే వాటన్నింటి కన్నా భిన్నమైనదిగా విడుదలకు ముందే గుర్తింపు తెచ్చుకుంది 'ప్యాడ్‌మ్యాన్'. ఎందుకంటే ఇది విజేత కథ కాదు. ఓ సామాన్యుడి కథ. పేద మహిళల వెతలకు చలించిపోయిన ఓ మనసున్న మనిషి కథ. వాటి పరిష్కారం కోసం అహోరాత్రులు పరితపించి పరిశ్రమించిన మహర్షి కథ. అతడే 'ప్యాడ్‌మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న అరుణాచలం మురుగనందమ్.

'ప్యాడ్‌మ్యాన్' కథేంటి

రుతుక్రమం రోజుల్లో శానిటరీ ప్యాడ్‌లను కొనడానికి ఆర్థిక స్తోమత లేని పేద మహిళలు అనారోగ్యకరమైన ప్రత్యామ్నాయ విధానాలను పాటిస్తూ రోగాల బారిన పడటం అరుణాచలంను ఆలోచింపచేసింది. అందుకు పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు సంకల్పించింది. నలుగురిలో మాట్లాడటానికే మొహమాటపడే ఆ విషయంపై ఎన్నో ప్రయోగాలు చేశాడు. మరెన్నో వైఫల్యాలు చవిచూశాడు. అంతకు మించిన అవమానాలు, హేళనలు రుచిచూశాడు. అయినా పట్టువదలక ప్రయత్నించాడు. చివరకు అతి తక్కువ ఖర్చుతో శానిటరీ ప్యాడ్‌లను తయారు చేసే యంత్రాన్ని రూపొందించాడు. తన ఆవిష్కరణతో మహిళల జీవితాల్లో మార్పు తెచ్చిన అరుణాచలం కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. అరుణాచలం ప్రస్థానాన్ని అక్షయ్ కుమార్ సతీమణి ట్వింకిల్ ఖన్నా 'ది శానిటరీ మ్యాన్ ఆఫ్ సేక్రెడ్ ల్యాండ్' పేరుతో కథగా రాసింది. దాని ఆధారంగా 'ప్యాడ్‌మ్యాన్' తెరకెక్కింది. అక్షయ్ ప్రధాన పాత్రలో నటించగా, ఆయన భార్యగా రాధికా ఆప్టే, ఆయన లక్ష్య సాధనలో సహకరించే యువతిగా సోనమ్ కపూర్ నటించారు.

విశేషాలు

✦ 'అమెరికాకు సూపర్‌మ్యాన్, బ్యాట్‌మ్యాన్, స్పైడర్‌మ్యాన్ ఉన్నారు. కానీ ఇండియాకు ప్యాడ్‌మ్యాన్ ఉన్నాడ'నే సంభాషణతో విడుదలైన 'ప్యాడ్‌మ్యాన్' ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. అందులో బట్లర్ ఇంగ్లిష్‌లో అక్షయ్ చెప్పే సంభాషణలు నవ్వులు పూయించడంతో పాటు ఆలోచింపజేస్తున్నాయి. దీంతో చిత్రంపై ఆసక్తి రెట్టింపైంది.

✦ ఇప్పుడు సోషల్ మీడియాలో 'ప్యాడ్‌మ్యాన్' ఛాలెంజ్ హాట్ టాపిక్‌గా మారింది. రుతుక్రమం గురించి ఉన్న అపోహలను చెరిపేయడానికి అక్షయ్ కుమార్ దీన్ని మొదలెట్టారు. ఇందులో భాగంగా ప్రముఖ సెలబ్రిటీలు శానిటరీ ప్యాడ్ పట్టుకుని సెల్ఫీలు తీసుకుని పోస్ట్ చేస్తున్నారు. ఆమీర్ ఖాన్, దీపికా పదుకొణె, కత్రినా కైఫ్, ఆలియా భట్, అనుష్క శర్మ లాంటి బాలీవుడ్ తారలతో పాటు పీవీ సింధు, రవిశాస్త్రి, గీతా ఫొగట్ తదిరత క్రీడా ప్రముఖులూ ప్యాడ్‌మ్యాన్ ఛాలెంజ్‌ను స్వీకరించారు.

✦ అరుణాచలం జీవితం ఆధారంగా రూపొందిన తొలిచిత్రం 'ప్యాడ్‌మ్యాన్' కాదు. గతేడాదే ఆయన జీవితకథతో 'ఫుల్లు' అనే చిత్రం వచ్చింది.

✦ 'ప్యాడ్‌మ్యాన్' చిత్రీకరణ సమయంలో అరుణాచలం కూడా సెట్‌కు వచ్చేవారట. అవసరమైనప్పుడు ఆయన సూచనలు ఇచ్చేవారట.

✦ ఈ నెల 9నే ఈ చిత్రం రష్యాలోనూ విడుదలవుతోంది. ఇండియాతో పాటు రష్యాలోనూ ఒకే రోజు విడుదలవుతున్న తొలి బాలీవుడ్ చిత్రమిది.

✦ అక్షయ్, ఆర్.బాల్కి కలసి పనిచేసిన తొలి చిత్రమిది.



నిద్రలేచిన దగ్గర్నుంచీ... రాత్రి పడుకునేదాకా... ఉరుకులూ... పరుగులు. ఉద్యోగం చేస్తున్నా, వ్యాపారాన్ని ఎంచుకున్నా... దాదాపు ఎనభైశాతం మంది మహిళల పరిస్థితి ఇదే. దాంతో కుటుంబానికి ముఖ్యంగా పిల్లలూ, అసలైన ఇంటిబాధ్యతలకు కేటాయించే సమయం ఎంతోకొంత తగ్గుతోందనే చెప్పొచ్చు. వర్క్, లైఫ్ బ్యాలెన్స్ చాలామంది మహిళలకు అందని ద్రాక్షే. మరెలా... దీనికిక పరిష్కారమే లేదా... ఇంతేనా...!

అక్కడా...ఇక్కడా...సరితూగేలా

పిల్లలకు ఒంట్లో బాగాలేదు. ఆఫీసులో పని చేస్తున్నా వనిత మనసంతా ఇంట్లోనే ఉంది. అటు పనీ చేయలేక, ఇటు ఇంటికీ వెళ్లలేక లోలోన మథన పడుతోంది. చిన్న పనే... రెండురోజుల ముందే చేసుకుని ఉంటే అయిపోయేది.. అని బాధపడుతోంది వనిత.

ఆదివారం వస్తే చాలు.. ఇంటిపనులతోనే సరిపోతుంది. వంటపనీ, సర్దుకోవడం, చిన్నచిన్న పనులూ, పిల్లల చదువులూ.. ఇలా వీటన్నింటితో విశ్రాంతి తీసుకునే అవకాశమే ఉండటంలేదు.. ఇల్లు కన్నా ఆఫీసులోనే నయం అంటుంది ప్రియ.

వీళ్లే కాదు... చాలామంది మహిళల పరిస్థితి ఇదే. గడియారం అయిదు గంటలు కొట్టగానే మొదలయ్యే దినచర్యకు క్షణం విరామం దొరకదు. టిఫిన్లూ, కాఫీలూ, వంటా, చిన్నచిన్న పనులు చేసుకుంటూనే ఆఫీసుకు తయారవ్వాలి. సాయంత్రం ఇంటికొచ్చే దాకా ఆ పనులు.. ఆ తరువాత మళ్లీ వంటావార్పూ... వీటన్నింటితో రోజుకి ఇరవై నాలుగు గంటలే ఎందుకు... ఇంకో గంట ఎక్కువగా ఉంటే ఎంత బాగుండు అని అనుకోకుండా ఉండలేం. అది ఎలాగూ అసాధ్యం కాబట్టి... ఉన్న సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకునే నైపుణ్యం, నేర్పు మన సొంతం కావాలి. లేదంటే సమస్యే.

యంత్రంలా మారిపోతాం...

ఎప్పటికప్పుడు విరామం, విశ్రాంతి లేకుండా, కుటుంబానికి సరిగ్గా సమయం కేటాయించలేక అదేపనిగా పనులు చేసుకుంటూ పోతే.. మనకూ, యంత్రానికి తేడా ఉండదంటారు నిపుణులు. రోజులు గడిచేకొద్దీ చేసే ప్రతిపనిమీదా ఆసక్తి తగ్గిపోతుంది. క్రమంగా ఒత్తిడీ తప్పదు. అదే జరిగితే అనారోగ్యాలు తప్పవు సరికదా.. పనిపట్ల ఏ మాత్రం ఇష్టం, ఆసక్తి ఉండదు. జీవితంలో కొత్తదనం, ఆనందం పూర్తిగా పోతుంది. పూర్తిగా నైరాశ్యం, నిరాసక్తత. అందుకే దేనికి కేటాయించాల్సిన సమయం దానికి ఉండాలంటారు నిపుణులు. సరే, మన పరిస్థితే ఇలా ఉంటే, పెద్దపెద్ద స్థానాల్లో ఉండే మహిళల పరిస్థితి కూడా ఇంతేనా.. కాదంటారు వాళ్లు. చెప్పాలంటే వాళ్లకు ఆ రెండింటినీ సమన్వయం చేసుకునే కిటుకులు తెలుసు. ఉదాహరణకు... ఉద్యోగం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోలేకపోవడం ఒక అపోహ మాత్రమే అంటారు లైమ్‌రోడ్ అనే ఆన్‌లైన్ దుస్తుల దుకాణాన్ని నిర్వహించే సుచీ ముఖర్జీ. 'వ్యాపారవేత్తగా, అమ్మగా, స్నేహితురాలిగా, కూతురిగా.. ఇలా ఎన్నో బాధ్యతలు నాపై ఉన్నాయి. వాటినీ, చేసే పనిని తలచుకుని కంగారుపడిపోతుంటాం. అమ్మో! మనవల్ల అవుతుందా అని భయపడతాం. కానీ దేనికయినా ప్రణాళిక అవసరం. ఇంట్లో నేను కుటుంబసభ్యుల సాయం తీసుకుంటా. నిజాయతీగా ఉండే సహాయకుల్ని పెట్టుకున్నా. అన్నీ పనులు నేనే చేయాలని చూడను. స్నేహితుల నెట్‌వర్క్‌ని ఎప్పటికప్పుడు విస్తరించుకుంటా. అవసరం అనుకుంటే వాళ్ల సాయం తీసుకోవడానికీ వెనుకాడను. ఎన్ని పనులున్నా సరే.. పిల్లల్ని రాత్రి నిద్రపుచ్చడం, పొద్దున్నే స్కూల్లో దింపడం, వాళ్ల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం నాకున్న బాధ్యతల్లో ముఖ్యమైనవిగా పెట్టుకున్నా కొన్నాళ్లక్రితం. ఇక, పని గురించి చెప్పాలంటే పక్కా ప్రణాళిక రూపొందించుకుని ఆ ప్రకారం పూర్తిచేస్తా...' అంటుందామె. ఆమె మాత్రమే కాదు. ఉన్నతస్థానాల్లో ఉన్న చాలామంది మహిళలు అలాంటి కిటుకులే పాటిస్తారు. ఒత్తిడి ఉన్నా వీలైనంతవరకూ అధిగమించేలా చూసుకుంటారు. మరి వాళ్లు అనుసరించే వాటిల్లో... మనం కూడా కొన్ని పాటిద్దామా...

ఆ కిటుకులు తెలియాలి...

చెప్పినంత సులువు కాదు కానీ... సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం తెలిస్తే చాలు. ముఖ్యంగా...

ప్రణాళిక: పని ఏదయినా సరే.. ప్రతిదానికీ ఇంత సమయం అని పెట్టుకోవాలి. అందులోనే కచ్చితంగా పూర్తిచేయగలగాలి. ఈ ప్రణాళికను రోజువారీ మాత్రమే కాదు, వారం, నెలా, మూణ్నెళ్లకోసారి పెట్టుకోవాలి.



సాయం తీసుకోండి: 'అయ్యో ఫోన్ బిల్లు కట్టలేదు. ఈరోజే ఆఖరి తేది. రేపయితే ఫైన్ పడుతుంది.'... 'బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేయాలి'.. 'సరకులు నిండుకున్నాయి...' ఎలా అని కంగారు పడే బదులు. వీటన్నింటినీ ఎప్పటికప్పుడు పూర్తిచేసుకోవాలి. అలాగే అన్నీ మీరే చేయాలని చూడకూడదు. పనుల్నీ విభజించుకోవాలి. అవసరం అయితే కుటుంబసభ్యుల సాయం తీసుకోవాలి. సాంకేతికతనూ సద్వినియోగం చేసుకోవచ్చు. బిల్లుల్ని అంతర్జాలంలో కట్టేసేలా చూసుకోవాలి. నిత్యావసరాలకూ ఇప్పుడా సదుపాయం ఉంది కాబట్టి.. సద్వినియోగం చేసుకుంటే మంచిది.

సరిహద్దు ఉండాలి: అవును, ఆఫీసు పని అక్కడే పూర్తిచేయాలి. ఇంట్లో ఉన్నప్పుడు తప్పనిసరి అనిపిస్తే తప్ప ఆఫీసు పని చేయకూడదనే నియమాన్ని పెట్టుకోవాలి. ఇక, ఇంట్లో ఉన్నప్పుడు ఫోన్లూ, కంప్యూటరు వినియోగాన్ని అవసరం అయితేనే వాడకూడదు.

కుటుంబానికీ సమయం: ఇంట్లో ఉన్నంతసేపు పనులతో పేరుతో బిజీగా కాకుండా.. కుటుంబానికి వీలైనంత ఎక్కువ సమయం కేటాయించాలి. వాళ్లతో కబుర్లు చెప్పినా, కలిసి ఆడినా, చదివించినా, పార్కుకు తీసుకెళ్లినా.. ఇలా అన్నింట్లో వాళ్లను భాగస్వాముల్ని చేయాలి. రోజులో కనీసం ఒకపూటైనా కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేసేలా చూడాలి. కనీసం ఆరేడునెలలకోసారి కుటుంబం అంతా కలిసి ఒకటి రెండురోజులు బయటకు వెళ్లేలా ప్రణాళిక పెట్టుకోవాలి.

అన్నీ వద్దు: వారాంతం లేదా సెలవు ఉన్నప్పుడు ఇల్లు శుభ్రతా, ఇతర పనులు పెట్టుకుంటాం. కానీ అలా వద్దు. అవన్నీ మీ రోజువారీ పనుల్లో భాగం కావాలి. రోజులో ఓ పదిహేను నిమిషాలు ఇంటికోసం పెట్టుకుని ఎంత వీలైతే అంతే శుభ్రం చేసి చూడండి. కొన్నింటిని ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు పూర్తిచేసేలా చూసుకుంటే సమయం మిగులుతుంది.

మీకోసం మీరు: అన్నింటికీ సమయం పెట్టుకుంటే.. మరి మీ సంగతి.. అందుకే రోజులో కనీసం ఓ అరగంట మీకోసం పెట్టుకునేలా చూసుకోవాలి. సరైన ప్రణాళిక ఉంటే అదేమీ అసాధ్యం కాదు. వ్యాయామం చేయడం, మంచి పుస్తకం చదవడం, నచ్చిన అభిరుచిని నేర్చుకోవడం, చిత్రలేఖనం.. ఇలా ఏదో ఒకటి ఉండాలి. అప్పుడే ఒత్తిడి దరిచేరదు. వీటన్నింటితోపాటూ వ్యక్తిగత ఆరోగ్యానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మొదలుపెట్టండి: ముందు మీరు మార్చుకోవాలనుకుంటున్న అంశాలను ఒక్కోటిగా మొదలుపెట్టండి. ముందు అన్నింటికీ తక్కువ సమయం పెట్టుకోవాలి. ఆచరణలో ఏదైనా లోపం జరిగితే వెంటనే సరిదిద్దుకోవడానికి వీలవుతుంది. **- ప్రమీల**

ఇవీ తప్పనిసరి...

- ఇల్లు/ఆఫీసుకు సంబంధించి మీరు ఏ పనిచేస్తున్నా అందులో పరిపూర్ణత సాధించడానికి కృషి చేయాలి.
- ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతి రోజూ ధ్యానం, యోగా లాంటివి చేయడం అలవాటు చేసుకోండి.
- మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటూ, వ్యక్తిగత శ్రద్ధకూ ప్రాధాన్యం ఇవ్వాలి.
- మొహమాటం మానేసి.. మీ వల్ల కాదు అనుకున్న పనులకు 'నో' అని సున్నితంగా చెప్పగలగాలి.
- వీలైనంతవరకూ ఆత్మవిశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ఉండాలి.

అది సవాలే...

ఒకప్పుడు లెక్చరర్‌గా ఇంగ్లిష్, సాఫ్ట్‌స్కిల్స్ చెప్పేదాన్ని. పెళ్లయ్యాక మానేశా. పిల్లలు పుట్టారు. పదేళ్లకిందట డాక్యుమెంటేషన్ ఎక్స్‌పర్ట్, సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్‌గా కెరీర్ మార్చుకున్నా. విస్సన్ ఇన్ఫోటెక్‌లో నాలుగేళ్లుగా హెచ్ఆర్ విభాగంలో పనిచేస్తున్నా. అప్పట్లో పిల్లల్ని ఇంటికి దగ్గర్లోని క్రష్‌లో ఉంచేదాన్ని. మా చెల్లి సాయం తీసుకున్నా. నాకు ఆఫీసులో ఆలస్యం అయినప్పుడూ, వాళ్లకు సెలవులు ఉన్నప్పుడు తనే చూసుకునేది. అయితే ఉద్యోగ బాధ్యతలు పెరిగేకొద్దీ నా పనిగంటల్లోనూ మార్పు వచ్చింది. ఇప్పుడు ఇంట్లో ఉన్నంతసేపు వాళ్లకే నా పూర్తి సమయం కేటాయిస్తా. పిల్లలు కాస్త పెద్దవాళ్లయ్యారు. వారాంతంలో కుటుంబం అంతా కలిసి బయటకు వెళ్తాం. అన్నింటికీ తగినట్లుగా సరైన ప్రణాళిక వేసుకున్నా.



- అనురాధ పాగలూరు, హెచ్ఆర్ అండ్ ట్రైనింగ్ మేనేజర్, విస్సన్ ఇన్ఫోటెక్, హైదరాబాద్

మీకు నీలం రంగు జీన్స్ ఉందా..?

దాదాపు ప్రతి అమ్మాయి అల్మారాలో నీలం రంగు జీన్స్ ఉంటుంది. అయితే దానికి జతగా ఏం వేసుకోవాలో చెబుతున్నారు ఫ్యాషన్ నిపుణులు.

- సాదాగా ఉండే తెలుపు రంగు షర్టూ, దానికి జతగా గోధుమరంగు లెదర్ జాకెట్ వేసుకుంటే చక్కగా నప్పుతుంది.
- ముదురు నీలం రంగు జీన్స్‌పై లేత నీలం డెనిమ్ షర్టులూ, టాప్‌లు కూడా బాగుంటాయి. కుదిరితే కాస్త వేరే వర్ణంలో ఉండే బ్యాగ్ కానీ కోట్ కానీ వేసుకోవచ్చు.
- ముదురూ, లేత నీలం రంగు జీన్స్ ప్యాంట్ పై గులాబీ రంగు మేళవింపులో ఏమైనా నప్పుతాయి. కాస్త పొట్టిగా ఉండే కుర్తాలూ, ఎత్తుమడమల చెప్పులు వేసుకొని చూడండి. ప్రత్యేకంగా కనిపిస్తారు.
- స్కిన్నీ లేదా స్ట్రెయిట్ కట్ జీన్స్‌పై హై థై బూట్స్ ప్రయత్నించి చూడండి. వీటి మేళవింపు చలికాలంలో అయితే చక్కగా సరిపోతుంది.



- నీలంరంగు జీన్స్ మీదకు ట్రెంచ్‌కోట్, ఫ్లాట్ చెప్పులు, అలాగే చిన్న బ్యాగు వేసుకుంటే కొత్తగా కనిపిస్తారు.
- చలి ఎక్కువగా ఉన్నప్పుడు చేసే ప్రయాణాలకు నీలం రంగు జీన్స్ వేసుకుని, దానిమీద కాస్త వదులుగా ఉండే స్వెట్టర్ వేసుకుంటే సరిపోతుంది.
- యానిమల్ ప్రింట్లున్న టాప్‌లు ఏవైనా నీలిరంగు జీన్స్‌కు నప్పుతాయి. చిన్న చిన్న పార్టీలకు బాగుంటాయి.
- ఆఫీసులోని సమావేశాల్లో ముదురు నీలం రంగు జీన్స్‌కు జతగా తెలుపు రంగు చొక్కా, దాంతోపాటూ ఒక బ్లేజర్ వేసుకొని చూడండి. హుందాగా
- స్నేహితులతో పార్టీలకు వెళ్తుంటే... ఈ రంగులోనే చిరుగుల జీన్స్‌ని ఎంచుకుని చూడండి. అయితే దానిమీదకు చొక్కా కాస్త చిన్నగా ఉంటేనే అందం. ప్రత్యేకంగా కనిపించడం ఖాయం.

బంగారం వెండి
7 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం (24క్యా)	31,150	31,470	30,950	30,150
ఆర్నమెంట్	29,100	29,400	28,800	29,900
వెండి (కిలో)	39,100	39,920	40,000	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం (24క్యా)	30,850	30,120	30,890	31,110
ఆర్నమెంట్	28,610	28,580	28,890	29,110
వెండి (కిలో)	39,700	40,200	38,900	39,200
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం (24క్యా)	31,040	31,450	-------	-------
ఆర్నమెంట్	28,870	29,250	2,889	2,911 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	41.50	41.80 గ్రా

నజరానా

సాధారణ మొక్కజొన్న గింజలను ఉడికించేటప్పుడు కొన్ని పాలు కలపాలి. ఇలా చేయడం వల్ల గింజలు త్వరగా ఉడకడమే కాదు రుచి కూడా పెరుగుతుంది.

email:
vasundhara@eenadu.net

ముడివేస్తే చాలు...

సిగ సింగారం

జుట్టును అప్పుడప్పుడూ ముడేసుకుంటే చాలా హాయిగా అనిపిస్తుంది కదూ.. ఈసారి అదే ముడిని కాస్త కొత్తగా వేసుకుంటూనే అల్లేసుకుందాం. ఏటవాలుగా వచ్చే ఈ కేశాలంకరణ ప్రత్యేక సందర్భాలకు చక్కగా నప్పుతుంది. చూసేయండి మరి.





1. పాపిట పక్కనుంచి కుడివైపు ఓ పాయను, దానికి ఎడమవైపున మరోపాయను తీయాలి. మొదట తీసిన పాయనూ, ఎడమవైపున తీసిన పాయ ముడివేసినట్లుగా చేసి ఇవతలకు లాగాలి.





2. ఇప్పుడు ఆ రెండు పాయల్నీ కలపాలి. మళ్లీ అదేవిధంగా పాపిట పక్కగా కుడివైపు నుంచి మరో పాయను తీసుకుని మొదటి రెండుపాయలకు కలిపి ముడివేయాలి.



3. ఇలా ఒక్కో పాయను తీసుకుంటూ ఎడమవైపు పాయలకు కలుపుతూ ముళ్లు వేసుకుంటూ జుట్టు మధ్యవరకూ రావాలి. ఇంకా చెప్పాలంటే కుడివైపు ఉన్న జుట్టు పూర్తయ్యేవరకూ చేసుకోవాలి. ఆ తరువాత రబ్బరుబ్యాండు పెట్టుకుంటే సరిపోతుంది. చివరగా నచ్చినట్లుగా అలంకరించుకోవచ్చు.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను **www.eenadu.net**లోని వసుంధర విభాగంలో చూడొచ్చు.

కళ్లు పెద్దగా కనిపించాలా...!

కళ్లకు మేకప్ వేసుకునే విషయంలో కొన్ని చిట్కాలు పాటిస్తే పెద్దగా కనిపించేలా చేయొచ్చు. అదెలాగంటే..

- కనుబొమల కింద ఉండే ప్రదేశంలో లేత రంగును రాసుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వండి. దానివల్ల కళ్లు పెద్దగా కనిపిస్తాయి.
- కళ్ల కింద నల్లటి వలయాలుంటే కూడా కళ్లు చిన్నగా అనిపించే అవకాశం ఉంటుంది. అందుకే కాస్త కన్సీలర్‌ను రాసుకుంటే, అవి కాస్త పెద్దవిగా అనిపిస్తాయి.
- కనుబొమలను ఎప్పుడూ సరైన ఆకృతిలో ఉంచుకోవాలి. . అలాచేస్తే కళ్లకూ, కనుబొమలకు మధ్య ఉన్న ప్రాంతం విశాలంగా అనిపించి చిన్నగా అనిపించవు..
- కొంతమంది కళ్లు పెద్దగా కనిపించాలని చుట్టూ ఐలైనర్ రాస్తుంటారు. దీనివల్ల ఇంకా చిన్నగా కనబడతాయి. దానికి బదులు పైవైపు మాత్రమే రాసుకుంటే మేలు.



- పై రెప్పకు ఐలైనర్ రాస్తున్నప్పుడు మొదలునుంచీ కాకుండా కాస్త మధ్యలో నుంచి కంటి చివరివరకు పొడిగించండి. అలాగే కింది రెప్పకు రాయకపోవడమే మంచిది.
- కంటి మొదళ్ల దగ్గర తెలుపు లేదంటే ఏదైనా లేత రంగు ఐషాడో రాసుకోవాలి. దానివల్ల కూడా కళ్లు పెద్దగా అనిపిస్తాయి. అలాగే కాస్త లేత రంగుల మేళవింపులో షిమ్మర్ రాసుకున్నా బాగుంటుంది.
- కళ్లు కాస్త ఉబ్బినట్లుగా ఉన్నా అవి చిన్నగా కనిపించొచ్చు. అందుకే కళ్లమీద కీరదోసా, బంగాళదుంపను చక్రాలుగా తరిగి కాసేపు ఉంచుకోండి. ఫలితం ఉంటుంది.
- మస్కారా విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందే. ముందుగా దట్టంగా కాకుండా కొద్దిగా రాసుకున్న తర్వాత రెండోసారి కాస్త ఎక్కువగా రాయండి. దీనివల్ల కంటిరెప్పలు కూడా సరైన ఆకృతిలో ఉంటాయి.

ఓ మతపెద్ద కథ ఇది!



మతపెద్ద ఆధ్వర్యంలో ముస్లింలు నమాజు చేయడం ఆనవాయితీ. అయితే అక్కడ మతపెద్దగా దాదాపు మగవారే కనిపిస్తారు. మహిళలకు ఆ అవకాశం ఉండదు. కేరళ మలప్పురం జిల్లాలోని వాందూర్‌లో మాత్రం ఓ మహిళ నమాజు చేయిస్తూ కనిపిస్తారు. ఈమె పేరు జమిద. ఇప్పటి వరకూ మనదేశంలో మత పెద్దగా మహిళలు వ్యవహరించలేదు. ఇలా జరగడం మొదటిసారి. ఇటీవల స్థానిక ఖురాన్ సున్నత్ సొసైటీ ఈ నిర్ణయం తీసుకుంది. చురుకుగా వ్యవహరించే జమిదా బీబీకి ఆ సొసైటీ ఈ బాధ్యతలు అప్పగించింది. 'వారు ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణం మహిళలకు ఖురాన్ విరుద్ధం కాదు.. ఇందులో మానవులు అని మాత్రమే సంబోధిస్తారు. కానీ ఆడా, మగా అంటూ తేడా చూపించరు. ఇదే అందరికీ చెప్పదల్చుకున్నాం' అంటుంది జమిద. ఇంతకీ ఆమె ఈ స్థాయికి ఎలా వచ్చిందంటే...

కేరళలోని పతానంతిట్ట జిల్లాలో సైనిక కుటుంబంలో జమిద పదమూడో సంతానంగా జన్మించింది. మలప్పురంలోని అరబిక్ కళాశాలలో ఉన్నత విద్యనభ్యసించింది. ఆ సమయంలో తన సందేహాలన్నింటినీ ఉపాధ్యాయులను అడిగి, తెలుసుకునేది. కానీ వారంతా జమిద ప్రశ్నలను ప్రతికూలంగా తీసుకోవడమే కాకుండా, ఆమెను తరగతులకు రానిచ్చేవారు కాదు. తరువాత ఆమె విద్యాభ్యాసం ముగియడంతో వివాహమైంది. జమిదకు ఇద్దరు పిల్లలు కానీ పదమూడేళ్ల వైవాహిక జీవితంలో వచ్చిన ఒడిదొడుకులతో విడాకులు తీసుకుంది. అరబిక్ భాషను బోధించే తరగతులను నిర్వహించేది. ఆ తరువాత కొజీకోడ్‌లోని ఖురాన్ సున్నత్ సొసైటీలో చేరింది. మత పెద్దలతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొనడం, ఉపన్యాసాలివ్వడంలో ఆమె ముందుండేది. దాంతో సొసైటీ పెద్దలు ఆమెను ప్రార్థనలు చేయించే మతపెద్దగా నియమించారు. గణతంత్ర దినోత్సవం నాడే వారు చేసిన ఈ ప్రకటన సంచలనాన్ని కలిగించింది. అప్పటి నుంచి ప్రతి శుక్రవారం జమిద ప్రార్థనలు చేయిస్తోంది. అంతేకాదు ముస్లిం మహిళల సాధికారత కోసం పలు కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. లింగ వివక్షా, తలాక్ వంటి పలు అంశాలపై ముస్లిం మహిళలకు అవగాహన కల్పిస్తోంది.

రాగిపాత్రలు మెరవాలంటే!

ప్రస్తుతం రాగి పాత్రల వినియోగం ఎక్కువైంది. నీళ్లు తాగడానికీ, ఆహారపదార్థాలు వండుకోవడానికీ, ఇలా రకరకాలుగా ఉపయోగిస్తున్నారు. తరచూ వాడుతున్నా.. రోజూ ఉపయోగిస్తున్నా... అవి తళతళా మెరవాలంటే... ఇలా చేసి చూడండి.



- సగంకోసిన నిమ్మకాయ ముక్కపై ఉప్పు వేసి రాగిపాత్రలను తోమితే మెరుస్తాయి. నిమ్మరసం, ఉప్పూ మిశ్రమాన్ని పాత్రల అడుగు భాగంలో, అంచులకు బాగా రుద్దీ అరగంట తరువాత శుభ్రం చేయాలి.
- నిమ్మకాయలు అందుబాటులో లేనప్పుడు వెనిగర్‌తో కూడా ప్రయత్నించొచ్చు. అరకప్పు వెనిగర్‌లో పెద్ద చెంచా ఉప్పు వేసి బాగా కలిపి, ఈ మిశ్రమంతో రాగిపాత్రల్ని తోమితే చాలు.
- వంటసోడాలో కాస్త నిమ్మరసం లేదా, కేవలం వంటసోడాతోనే తోమినా కూడా చాలు. పాత్రలు మెరుస్తాయి.
- ఇంట్లోనే పాలిషర్‌ను ప్రత్యేకంగా తయారు చేసుకోవచ్చు. ఏదైనా పిండీ, ఉప్పూ, డిటర్జెంట్‌పొడిని సమపాళ్లలో తీసుకోవాలి. కొద్దిగా వెనిగర్, నిమ్మరసం, నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని సీసాలో భద్రపరుచుకోవచ్చు. అవసరమైనప్పుడు ఈ ద్రావణంతో రాగిపాత్రలను శుభ్రం చేసుకోవాలి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

యూపీఎస్సీ- సివిల్ సర్వీసెస్ 782, ఫారెస్ట్ సర్వీస్ 110 ఖాళీలు

కేంద్రంలోని వివిధ సర్వీసుల్లో 782 సివిల్స్, ఫారెస్ట్ సర్వీస్‌లో 110 ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ ప్రకటన జారీచేసింది.

అర్హత: సివిల్ సర్వీసెస్‌కు ఏదైనా డిగ్రీ, ఐఎఫ్ఎస్‌కు సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ (ఆఖరు సంవత్సరం డిగ్రీ చదువుతున్నవారూ అర్హులే).

వయసు: ఆగస్టు 1, 2018 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. (ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయ:పరిమితిలో సడలింపులు వర్తిస్తాయి).

ఎంపిక విధానం: ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 07.02.2018 నుంచి 06.03.2018 వరకు.

ప్రిలిమినరీ ఎగ్జామ్ తేది: 03.06.2018.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, అనంతపురం, తిరుపతి.

వెబ్‌సైట్: www.upsc.gov.in

ఎన్‌బీసీసీ ఇండియా లిమిటెడ్

న్యూదిల్లీలోని నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) ఇండియా లిమిటెడ్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఇంజినీర్ తదితర పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 145

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

వెబ్‌సైట్: http://nbccindia.com/

ప్రవేశాలు

ఐఐఎస్ఈఆర్, పుణె

కోర్సులు: ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, పీహెచ్‌డీ

అర్హత: ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులకు సైన్సు సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, పీహెచ్‌డీ కోర్సులకు ఆయా సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ లేదా బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించి ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్

వెబ్‌సైట్: www.iiserpune.ac.in

ఫెలోషిప్స్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్

1) పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ (పీడీఎఫ్)- 10 ఖాళీలు 2) సీనియర్ అకడమిక్ ఫెలోషిప్ (ఎస్ఏఎఫ్)- 10 ఖాళీలు

కాలవ్యవధి: 2 సంవత్సరాలు **ఎంపిక:** ప్రెజెంటేషన్ కమ్ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** 13.03.2018

వెబ్‌సైట్: http://ichr.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.



ప్రపంచాన్ని సమూలంగా మార్చేస్తున్న ఎలక్ట్రానిక్స్ రంగంలో అద్భుతమైన అభివృద్ధి వల్ల విభిన్న స్పెషలైజేషన్లతో దూసుకుపోతోంది. అభ్యర్థికి అపార అవకాశాలను అందించే ఈ కోర్సులను అమెరికాలోని ఎన్నో ప్రముఖ విశ్వవిద్యాలయాలు ఆఫర్ చేస్తున్నాయి. మన విద్యార్థులు తమ అభిరుచులూ, ప్రావీణ్యాలూ బేరీజు వేసుకుని ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్లతో పీజీ చేస్తే వారికిక ఆకాశమే హద్దు! యూఎస్‌లో అందుబాటులో ఉండే సరికొత్త ఎలక్ట్రానిక్స్ కోర్సులూ, వాటి విశేషాలను పరిశీలిద్దాం!

యూఎస్

ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో ఎన్నో ప్రత్యేకతలు!

ఎలక్ట్రానిక్స్ వినియోగం మన నిత్య జీవితంలో ఒక భాగమైపోయింది. ఇది లేకుండా ఈ ప్రపంచాన్ని ఊహించడమూ కష్టమే. వంట నుంచి సంగీతం వరకూ ఉపయోగించే పరికరాలూ, స్టవ్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్.. ఇలా మనం వాడేవన్నీ ఎలక్ట్రానిక్సే.

ఆటోమోటివ్ ఇంజిన్స్ నుంచి ఆటోమేటెడ్ ఎక్విప్‌మెంట్ వరకూ అన్ని శ్రేణి పరికరాల ప్రొడక్షన్ సెట్టింగుల్లో ఎలక్ట్రానిక్ సాంకేతికతనే ఉపయోగిస్తున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను ఆరోగ్య రంగంలో రోగనిర్ధారణ, చికిత్సకు సంబంధించిన పరిశోధనలు, వ్యాధుల నివారణోపాయాలతోపాటు జన్యుసంబంధమైనవాటికీ ఉపయోగిస్తున్నారు.


శుభకర్ ఆలపాటి
డైరెక్టర్, గ్లోబల్ ట్రీ

మంచి ఉద్యోగావకాశాలు, జీతం, నిరంతర పరిశ్రమ అభివృద్ధి కారణంగా ప్రతి రెండో విద్యార్థి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదవాలని కోరుకుంటున్నాడని అధ్యయనాలు చెపుతున్నాయి. సొంత ఆలోచనలను అద్భుతమైన సాంకేతికాభివృద్ధిగా మలచడంలో ఈసీఈ ఇంజినీర్లు ముందుంటున్నారు. ఇటువంటి విధులకు లోతైన పరిజ్ఞానం అవసరమవుతుంది. ఈ కారణంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో కొన్ని ఉపశాఖలు ఏర్పడ్డాయి. ఈ రంగానికి యూఎస్‌ఏలో ఎంతో విలువ ఏర్పడి విస్తృత అవకాశాలు పెరిగాయి.

అమెరికాలో ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన పీజీ స్పెషలైజేషన్లలో మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ ఫోటానిక్స్, నానో టెక్నాలజీ, బయో మెడికల్ ఇమేజింగ్, బయో ఇంజినీరింగ్ అండ్ అకాస్టిక్స్ (బీఐబీఏ), పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్, రోబోటిక్స్, స్పిన్‌ట్రానిక్స్ ఎంతో ప్రాచుర్యం పొందాయి.

మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ ఫోటానిక్స్

కంప్యూటర్లు, పర్సనల్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్ ఆటోమేటివ్ సిస్టమ్స్, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు, లేజర్లలో గొప్ప అభివృద్ధికి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లోని మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ ఫోటానిక్స్‌లో వచ్చిన మార్పులే కారణం.

యూఎస్‌ఏలో దీనికి సంబంధించి ఎన్నో విశ్వవిద్యాలయాలు పరిశోధన అవకాశాలతోపాటు ఉద్యోగావకాశాలూ అందిస్తున్నాయి. పరిశోధన జరిగే కొన్ని విశ్వవిద్యాలయాలు.. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాంటా బార్బరా, యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయి (అర్బానా షాంపెయిన్). మరికొన్ని పరిశోధన సంస్థలు

- అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ ఫోటానిక్స్ (ఏఐఎం)
- ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ ఎఫిషియన్సీ (ఐఈఈ)
- కాలిఫోర్నియా నానోసిస్టమ్స్ ఇన్‌స్టిట్యూట్ (సీఎన్ఎస్ఐ)
- నానోటెక్: యూసీఎస్‌బీ నానో ఫాబ్రికేషన్ ఫెసిలిటీ

కెరియర్: స్థానిక సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో ఒరిగన్, సౌత్‌వెస్ట్ వాషింగ్టన్‌ల్లో కొత్త ఉద్యోగావకాశాలు ఏర్పడుతున్నాయి. అపార అవకాశాలున్న సంస్థల్లో ఇంటెల్ కార్పొరేషన్, సోలార్ వరల్డ్, ఎఫ్ఈఐ, కాస్‌కేడ్ మైక్రోటెక్, మైక్రోచిప్, ఆన్ సెమీ, మ్యాక్సిమ్, ట్రిక్వింట్, సిల్‌ట్రానిక్స్, ఇతర సెమీ కండక్టర్ సంస్థలున్నాయి.

మైక్రో ఎలక్ట్రానిక్స్, ఫోటానిక్స్ ఇంజినీర్ల సరాసరి వార్షిక వేతన శ్రేణి రూ.33.73 లక్షల నుంచి రూ.98.14 లక్షల వరకూ ఉంది.

బయోమెడికల్ ఇమేజింగ్, బయో ఇంజినీరింగ్, అకాస్టిక్స్ (బీఐబీఏ),

ఎలక్ట్రికల్ ఇంజినీర్ల అనలిటికల్ టూల్స్ .. వైవిధ్యంగా ఉండే బయో ఇంజినీరింగ్, మెడిసిన్, అల్ట్రాసోనిక్స్, అకాస్టిక్స్, ఆడియో ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ మ్యూజిక్, హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్ అంశాల్లో చక్కని కెరియర్లకు వర్తిస్తాయి. ఉదాహరణకు బయోమెడికల్ సిస్టమ్స్-వాటి ఎన్విరాన్‌మెంట్స్‌ల మధ్య సంబంధాలను అధ్యయనం చేయటంలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌కు ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్ అండ్ కాంప్లెక్స్ సిస్టమ్స్ అనాలిసిస్‌లో ఉండే ప్రావీణ్యం ఎంతో పనికొస్తుంది.

పర్డ్యూ యూనివర్సిటీ నార్త్‌వెస్ట్, యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయి (అర్బానా షాంపెయిన్), డ్యూక్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా డేవిస్‌లలో బయోమెడికల్ ఇమేజింగ్, బయో ఇంజినీరింగ్‌లలో పరిశోధనలు జరుగుతున్నాయి. న్యూజనరేషన్ స్టెతస్కోపులను అభివృద్ధికి సిగ్నల్ ప్రాసెసింగ్, ఫిల్టరింగ్ అల్గారిదమ్స్‌లను ఉపయోగిస్తున్నారు.

కెరియర్: బయోమెడికల్ ఇంజినీరింగ్ రంగం వేగంగా పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా జీవనస్థితిగతులు మెరుగుపరిచే మెడికల్, ఇంజినీరింగ్ ప్రపంచాలకు చెందిన బయోమెడికల్ ఇంజినీరింగ్ విస్తృతమైన ఉపాధి అవకాశాలకు తెరతీస్తోంది.

ఉద్యోగావకాశాలు ఎక్కువగా సెల్యులర్, టిష్యూ, జెనెటిక్, క్లినికల్, రిహాబిలిటేషన్ ఇంజినీరింగ్‌లలో ఉంటాయి. అదనంగా బయో ఇన్‌స్ట్రుమెంటేషన్, బయోమెటీరియల్స్, బయో మెకానిక్స్, డ్రగ్ డిజైన్ అండ్ డెలివరీ, మెడికల్ ఇమేజింగ్, ఆర్థోపెడిక్ సర్జరీ, ఫార్మాస్యూటికల్స్, సిస్టమ్స్ ఫిజియాలజీ రంగాల్లోనూ అవకాశాలుంటాయి.

సంవత్సరానికి వేతనం రూ. 51.98 లక్షలు ఉంటుంది.

పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లోని ఈ విభాగం ఎలక్ట్రిక్ ఎనర్జీని ప్రాసెస్, డెలివర్ చేసే డివైసెస్, సిస్టమ్స్‌పై దృష్టిపెడుతుంది. ఇందులో భాగమయ్యే స్థూల అంశాలు: ఎలక్ట్రో మెకానిక్స్, లార్జ్ ఎలక్ట్రిక్ పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్ తాలూకు డిజైన్, ఆపరేషన్; మాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రిక్ ఎనర్జీ కన్వర్షన్ మెథడ్స్, హైపవర్ లెవెల్స్‌లో ఎలక్ట్రానిక్ డివైసెస్ అప్లికేషన్, ఆల్టర్నేటివ్ ఎనర్జీ. దీనిలో అందించే కోర్సులు కవర్ చేసే కాన్సెప్టులు- రిన్యూవబుల్ ఎలక్ట్రిక్ ఎనర్జీ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ మెషిన్స్, పవర్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌ఫార్మర్స్, ఎలక్ట్రానిక్ మోటార్ కంట్రోలర్స్, స్విచింగ్ పవర్ కన్వర్టర్స్. అడ్వాన్స్‌డ్ కోర్సులుగా అడిషనల్ అప్లికేషన్స్ ఆఫ్ డివైసెస్ అండ్ ఎలక్ట్రో మాగ్నెటిక్ ఫీల్డ్స్ ఉంటాయి.

ఈ ఫీల్డుల్లో పరిశోధన యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయి (అర్బానా షాంపెయిన్), యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ (ఆస్టిన్), యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్‌ల్లో జరుగుతోంది. ఎనర్జీ కన్వర్షన్ రిసెర్చి, పవర్ మాగ్నెటిక్స్, జెనెటిక్ ఆప్టిమైజేషన్ మొదలైన అత్యున్నత ప్రయోగశాలలు అమెరికాలో ఉన్నాయి.

కెరియర్: భవిష్యత్తులో గొప్ప కెరియర్‌ను అందించగలిగేది పవర్ సిస్టమ్స్ ఇంజినీరింగ్. ఈ రంగంలో ఉద్యోగాలను అందించేవారిలో- మెటల్స్, ఆటోమొబైల్, ఆయిల్, డేటా పరిశ్రమలున్నాయి. ఇంకా లార్జ్ పవర్ సిస్టమ్స్‌కు చెందిన ఆపరేటర్లు, బిల్డర్లు; పవర్ సెమీ కండక్టర్స్, ఇతర పవర్ ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్లు, వినియోగదారులు; రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్ కంట్రోల్స్, ట్రాన్స్‌పోర్టేషన్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్లు, వినియోగదారులు కూడా ఉపాధికి దోహదం చేసేవారే.

సంవత్సరానికి వేతనం రూ. 62.89 లక్షలు ఉంటుంది.

రోబోటిక్స్ అండ్ అటానమస్ సిస్టమ్స్

రోబోటిక్ అండ్ అటానమస్ సిస్టమ్స్ (ఆర్ఏఎస్) ఇంటరాక్టివ్‌గా, పరస్పర అనుసంధానంగా ఉండే టూల్స్. ఇవి మనం నివసించే ప్రపంచంలో ఎన్నో ఉపయోగకరమైన విధులు నిర్వర్తించటానికి ఉపయోగపడతాయి. నిర్ణయాలు తీసుకునే ఈ సిస్టమ్స్ విభిన్న స్థాయి అటానమీలతో సురక్షిత రవాణా, సమర్థ ఆరోగ్య పరిరక్షణ, వృద్ధుల సంక్షేమం లాంటి సవాళ్లను ఎదుర్కోవటానికి సాయపడతాయి. ఇంజినీరింగ్ ఎలిమెంట్స్ అయిన డిజైన్, రోబోటిక్స్ టెస్టింగ్, ఆటోమేషన్, అటానమీలను ఈ రంగం ఉపయోగించుకుంటుంది.

అమెరికాలోని ఎన్నో టాప్ ర్యాంకింగ్ విశ్వవిద్యాలయాల్లో ఈ రంగంలో పరిశోధనలు జరుగుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా, యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో బౌల్డర్, కొలరాడో స్టేట్ యూనివర్సిటీలు రోబోటిక్స్ అండ్ ఆటానమస్ సిస్టమ్స్‌లో ఎన్నో పరిశోధన ప్రాజెక్టులు కొనసాగిస్తున్నాయి.

కెరియర్: అమెరికాలోని ఉత్పత్తి క్షేత్రాల్లో ఆటోమేషన్, రోబోటిక్స్ ప్రవేశం కొనసాగుతూనేవుంది. వేగవంతమైన ఉత్పత్తి, మేటి నాణ్యత, వృథాను అరికట్టటం, ప్రమాదకర విధుల నుంచి కార్మికుల బదులు యంత్రాలను వాడటం ద్వారా సంపూర్ణ భద్రత ఇవన్నీ వీటి ప్రయోజనాలే. అటానమస్ సిస్టమ్స్ ఇంజినీర్, రోబోటిక్స్ అండ్ అటానమస్ ఆర్కిటెక్ట్, రోబోటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్, సిస్టమ్స్ ఎనలిస్ట్ (రోబోటిక్స్ కంట్రోల్ ఇంజినీర్) హోదాల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

ఈ రంగంలో పనిచేసే ఇంజినీర్ల వార్షిక వేతనం రూ. 49.41- రూ.71.87 లక్షల మధ్య ఉంటుంది.

స్పిన్‌ట్రానిక్స్

దీన్ని స్పిన్ ఎలక్ట్రానిక్స్ అని కూడా అంటారు. ఎలక్ట్రాన్, దానితో అనుబంధంగా ఉండే అయస్కాంత కదలికలను దీనిలో అధ్యయనం చేస్తారు. సాంప్రదాయిక ఎలక్ట్రానిక్స్‌తో పోలిక ఉన్నప్పటికీ ప్రాథమికంగానే రెంటికీ తేడా ఉంది. డైల్యూట్ మాగ్నెటిక్ సెమీ కండక్టర్స్, క్వాంటం కంప్యూటింగ్‌లలో స్పిన్‌ట్రానిక్స్ పాత్ర కనిపిస్తుంది.

స్పిన్‌ట్రానిక్స్‌లో పరిశోధనను మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహిస్తోంది.

కెరియర్: ఈ రంగంలో నిపుణులను కేవలం ఇంజినీర్లు అనకుండా శాస్త్రవేత్తలు అని వ్యవహరిస్తారు. వీరు సంపాదించే జీతం సంవత్సరానికి రూ. 48.13 లక్షల నుంచి రూ.64.17 లక్షల వరకూ ఉంటుంది.

రిమోట్ సెన్సింగ్ అండ్ స్పేస్ సైన్స్

అంతరిక్ష వాతావరణంపై అవగాహన పెంచుకునే అవసరం సమాజానికి పెరుగుతూవస్తోంది. అంతరిక్ష ఆధారిత కమ్యూనికేషన్, నేవిగేషన్ సిస్టమ్స్‌పై ఆధారపడటం ఎక్కువైంది. ఈ వాతావరణంలో జరిగే వివిధ భౌతిక, రసాయనిక ప్రక్రియలు తెలుసుకోవటం వల్ల తగిన టెక్నాలజీలను అభివృద్ధి చేయటం, ప్రయోగించటంలాంటివి సాధ్యమవుతాయి. అంతరిక్ష వాతావరణం నుంచి సమాచారాన్ని పొందటానికి సమర్థంగా ఉపయోగపడేది రిమోట్ సెన్సింగ్.

అమెరికాలోని చాలా కొద్ది విశ్వవిద్యాలయాల్లోనే ఈ రంగంలో పరిశోధనలు జరుగుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయి (అర్బానా షాంపెయిన్), పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ మొదలైనవి వీటిలో కొన్ని.

కెరియర్: స్పేస్ సైన్స్‌లో కెరియర్ అంటే అది వ్యోమగామి (ఆస్ట్రోనాట్) గా తయారవ్వటానికి మాత్రమే పరిమితమైంది కాదు. ఈ రంగంలో విభిన్న రకాలైన ఇంజినీర్లు పనిచేసే అవకాశం ఉంది. ఉదాహరణకు...ఏరోస్పేస్/ ఏరోనాటికల్ ఇంజినీర్లు, ఏవియానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్లు, కంప్యూటర్ ఇంజినీర్లు, మెటీరియల్స్ ఇంజినీర్లు, మెకానికల్ ఇంజినీర్లు, రోబోటిక్స్ ఇంజినీర్లు, స్పేస్‌క్రాఫ్ట్ ఇంజినీర్లు.



ఈ రంగంలో పనిచేసే ఇంజినీర్ల సగటు వార్షిక వేతనం రూ. 62.89 లక్షలు ఉంటుంది.

నానో టెక్నాలజీ

నానోటెక్నాలజీ నేటి కంప్యూటర్ చిప్ తయారీదారులతోపాటు దాని కొత్త చిప్ టెక్నాలజీల అభివృద్ధికీ తోడ్పడుతోంది. నానో ఎలక్ట్రానిక్స్, నానో ఫోటానిక్ అప్లికేషన్ల విస్తృత శ్రేణి అవసరాలకు తగ్గ కొత్త మెటీరియళ్ల అభివృద్ధితోపాటు న్యూపాయింట్ ఆఫ్ కేర్ నానో బయో ఎలక్ట్రానిక్ సెన్సార్లు, ఎన్నో ఇతర అప్లికేషన్ల తయారీకీ సాయపడుతోంది.

యూఎస్ఏలో నానోటెక్నాలజీకి సంబంధించి మూడు ప్రపంచ ప్రసిద్ధి పరిశోధన కేంద్రాలున్నాయి. ◗ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఫొటో ఓల్టాయిక్ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ◗ 3డీ సిస్టమ్స్ ప్యాకేజింగ్ రిసెర్చ్ సెంటర్ ◗ సెంటర్ ఫర్ ఎంఈఎంఎస్ అండ్ మైక్రో సిస్టమ్స్ టెక్నాలజీస్ (సీఎంఎంటీ)

నానోటెక్నాలజీపై పరిశోధన అవకాశం అందించే మరికొన్ని సంస్థలు.. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాంటా బార్బరా, యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయి (అర్బానా షాంపెయిన్), జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సునీ పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్- ఆల్బెనీ క్యాంపస్.

కెరియర్: ఎలక్ట్రానిక్స్/సెమీ కండక్టర్, మెటీరియల్స్ సైన్స్, టెక్స్‌టైల్స్, పాలిమర్స్, ప్యాకేజింగ్, ఆటో అండ్ ఏరోస్పేస్ పరిశ్రమల్లో, స్పోర్టింగ్ గూడ్స్, బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ సైన్స్, ఫోరెన్సిక్స్ మొదలైన రంగాల్లో నానో టెక్నాలజీ విద్యార్థులకు అద్భుతమైన ఉపాధి అవకాశాలున్నాయి. నానో టెక్నాలజీని ఉపయోగించి తయారుచేసిన ఉత్పత్తులకు అమెరికా మార్కెట్ చాలా విలువ ఇస్తుంది.

నానో టెక్నాలజీ ఇంజినీర్ల వార్షిక వేతనం రూ. 34.33 లక్షల నుంచి 98.15 లక్షలవరకూ ఉంటుంది.

Grandstanding... ఎప్పుడు ఉపయోగించాలి?

ENGLISH LANGUAGE SKILLS

ఇతరుల నుంచి మెప్పు పొందాలని ఏదైనా చేయడం, చెప్పడం చేస్తుంటారు కొందరు. దాన్ని సూచించే వ్యక్తీకరణ ఇంగ్లిష్‌లో ఉంది. ఏమిటది? ఉదాహరణల సాయంతో నేర్చుకుందాం!

Sankar: I am surprised why Subba Rao does not know what is happening in the country (దేశంలో ఏం జరుగుతోందో సుబ్బారావుకు తెలీకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది).


ఎం. సురేశన్

Prabhakar: He never reads any newspaper, and he is often out to lunch (అతనెప్పుడూ వార్తాపత్రికలను చదవడు. వాస్తవాలతో సంబంధం లేకుండా ఉంటాడు).

Sankar: He always talks about things that happened years ago. In spite of it, he believes in grandstanding (సంవత్సరాల కింద జరిగిన విషయాల గురించే మాట్లాడుతుంటాడు. అది కూడా ఇతరులకు తన మీద ఉన్న మంచి అభిప్రాయాల గురించే మాట్లాడుతుంటాడు).

Prabhakar: On the other hand, our close friend Sathish eyeballs everything very carefully and is very accurate in his information (దీనికి విరుద్ధంగా మన ముఖ్య స్నేహితుడు సతీష్ ప్రతిదానినీ నిశితంగా పరీక్షించి ప్రతి సమాచార విషయంలో చాలా కచ్చితంగా ఉంటాడు).


Sankar: I have told Subba Rao a number of times to watch the TV news and read the newspaper every day. But he pays a deaf ear (సుబ్బారావుతో నేను చాలాసార్లు చెప్పాను, టీవీ వార్తలు చూడమనీ, వార్తాపత్రికలను రోజూ చదవమనీ. కానీ నా సలహా పెడచెవిన పెడతాడు).

Prabhakar: That is the trouble with him. He is more bothered about earning money than anything else. All that matters to him is just money. He is very successful at that (అదే అతనితో చిక్కు. అతనికి డబ్బు సంపాదన విషయంలో తప్ప దేనిమీదా శ్రద్ధ లేదు. డబ్బే అతనికి లోకం. దాని విషయంలో అతను చాలా సమరుడు).

Sankar: Another thing with him is he is a miser. He just visits all shops, looks at the things there, but never buys anything (ఇంకో విషయం ఏమిటంటే అతను ఉత్త పిసినారి. అన్ని షాపులకూ వెళతాడు, అక్కడి వస్తువులన్నింటినీ గమనిస్తాడు, కానీ దేన్నీ కొనడు).

Prabhakar: I dinned into his ears to spend the money he earns for at least his comforts. But he does not listen (తన సుఖాలకైనా తాను సంపాదించుకునే డబ్బు ఖర్చు పెట్టుకోమని చాలాసార్లు చెప్పాను. కానీ నా మాట వినడు).

Sankar: He is incorrigible. Even his wife and children are fed up with him (అతన్ని మనం సరిదిద్దలేం. అని భార్యా పిల్లలు కూడా అతనంటే విసిగిపోయారు).



Now let us look at the words and phrases from the conversation:

1. Out to lunch = Out of touch with reality / the real world (వాస్తవ ప్రపంచంతో సంబంధం లేకపోవడం).

Sumanth: Krishna does not know what is happening at college. He is not in touch with the on-goings in the college (కృష్ణకు కాలేజ్‌లో ఏం జరుగుతోందో తెలీదు. కాలేజ్‌లో జరిగే విషయాలతో సంబంధం లేకుండా ఉంటాడు).

Sekhar: He has been out to lunch for a few months now. How can he know? (కొన్ని నెలలుగా అతను జరుగుతున్న వాస్తవాలతో సంబంధం లేకుండా ఉన్నాడు. అతనికే విషయమైనా ఎలా తెలుస్తుంది?)

2. Grandstanding = Acting or speaking in a way to attract the good opinion of others (ఇతరుల సదభిప్రాయాలను పొందే లక్ష్యంతో ఏదైనా చేయడం, చెప్పడం)

Malathi: Kamala knows nothing about anything. Still she impresses people (కమలకు ఏ విషయమూ తెలీదు. అయినప్పటికీ ఇతరుల్లో తనంటే సదభిప్రాయం కలిగిస్తుంది).

Mounika: She is very good at grandstanding. She is very showy and can impress others (ఆ విషయంలో ఇతరులను చాలా బాగా మెప్పిస్తుంది/ ఇతరుల్లో సదభిప్రాయాన్ని కలిగిస్తుంది. తను బాగా డాబు ప్రదర్శించగలదు, ఇతరులను ఆకట్టుకోగలదు).

3) Eyeball = Look closely at someone (పరీక్షగా ఒకరిని/ ఒక వస్తువును చూడటం).

Penchalaiah: Utham is haphazard. He never looks closely at anything or studies it (ఉత్తమ్‌కు ఒక ప్రణాళిక, పద్ధతి ఏమీ లేదు. దేనినీ సరిగా చూడడు, తెలుసుకోడు).

Sathyam: He does not care to eyeball anything. He is very indifferent (దేనినీ పరీక్షగా పరిశీలించడు. అతనికి నిర్లక్ష్యం ఎక్కువ).

రైల్వేలో 62,907 గ్రూప్-డి పోస్టులు



దేశంలోని పలు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు సంయుక్తంగా 62,907 గ్రూప్-డి పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేశాయి. వీటికి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. కంప్యూటర్ బేస్డ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు. ట్రాక్‌మెన్, గేట్‌మెన్, పాయింట్స్‌మెన్, హెల్పర్, పోర్టర్ మొదలైన పోస్టులు గ్రూప్-డి పరిధిలో ఉన్నాయి.

విద్యార్హత: కొన్ని విభాగాలకు పదోతరగతి ఉత్తీర్ణత. మిగిలిన వాటికి పదోతరగతితోపాటు ఐటీఐ లేదా నేషనల్ అప్రెంటిస్ సర్టిఫికెట్ ఉండాలి (ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లు అనర్హులు)

వయఃపరిమితి: జులై 1, 2018 నాటికి 18 నుంచి 31 ఏళ్లు (ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయఃపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి)

ఎంపిక విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష ద్వారా

వేతనం: ఎంపికైనవారికి రూ.18,000 మూలవేతనంగా చెల్లిస్తారు. దీంతోపాటు ఇతర ఆలవెన్సులు ఉంటాయి.

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు రూ. 250; జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500

దరఖాస్తులు: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ: ఫిబ్రవరి 10 ఉదయం 10 గంటల నుంచి

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: మార్చి 12, 2018

సివిల్స్‌లో ఓడినా విజేతలు కావొచ్చు

ముఖాముఖీకి హాజరై ఎంపికకాని అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్లో యూపీఎస్సీ నిర్ణయం • సివిల్స్ ప్రకటన విడుదల

ఈనాడు, హైదరాబాద్: లక్షల మందిని దాటుకొని సివిల్ సర్వీసెస్ ముఖాముఖీలకు హాజరుకావడం అంత సులభమేమీ కాదు. ముఖాముఖీకి హాజరైనవారిలో ఉద్యోగాలకు ఎంపిక కానివారు సగంమంది ఉంటారు. అయితే... అలాంటి అభ్యర్థుల వివరాలను వారి అంగీకారం మేరకు వెబ్‌సైట్లో ఉంచాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్ణయించింది. తద్వారా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వారిని ఇతరత్రా ఉద్యోగాలకు ఎంపిక చేసుకునే అవకాశముంటుందన్నది కమిషన్ ఆలోచన. మరోవైపు సివిల్ సర్వీసెస్ ఉద్యోగ ప్రకటనను యూపీఎస్సీ విడుదల చేసింది. అందులో ఈ విషయాన్ని పేర్కొంది. ఈసారి మొత్తం 782 ఖాళీలకు ప్రకటన జారీచేసింది. ప్రాథమిక పరీక్ష జూన్ 3న జరుగనుంది. తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మంది దరఖాస్తు చేసి ఉంటారని అంచనా. దేశవ్యాప్తంగా ఈసారి ప్రాథమిక పరీక్షకు 72 నగరాలు, పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్, ఏపీలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో పరీక్ష కేంద్రాలుంటాయి. యూపీఎస్సీ తాజా నిర్ణయంపై సివిల్స్ శిక్షణ నిపుణుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ- "ముఖాముఖీకి ఎంపికయ్యారంటే దాని వెనుక రెండు మూడు సంవత్సరాల నిరంతర కృషి ఉంటుంది. విషయ పరిజ్ఞానం, విశ్లేషణ సామర్థ్యం ఉంటేనే చివరి మెట్టయిన ముఖాముఖీకి వెళ్తారు. ఒక రెండు మార్కుల్లో ఎంపిక కానంత మాత్రాన వారి శక్తి సామర్థ్యాలను తక్కువగా చూడలేం. వారి వివరాలను జనబాహుళ్యం (పబ్లిక్ డొమైన్)లో ఉంచాలన్న యూపీఎస్సీ నిర్ణయం స్వాగతించాల్సిందే" అని అన్నారు.



'ఆక్వాక్స్ ఇండియా–2018' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని తదితరులు

మార్చి 15 నుంచి అంతర్జాతీయ చేపల ప్రదర్శన: మంత్రి తలసాని

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలో మత్స్యకారులను మరింత ప్రోత్సహించేందుకు వచ్చే నెల 15 నుంచి 18 వరకు హైటెక్స్‌లో అంతర్జాతీయ చేపల ప్రదర్శన (ఆక్వాక్స్ ఇండియా-2018)ను నిర్వహిస్తామని మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ప్రదర్శన పోస్టర్‌ను బుధవారం సచివాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా మత్స్య పరిశ్రమలో వస్తున్న మార్పులు, యంత్ర సామగ్రి, అధునాతన పరిజ్ఞానం, కొత్త చేపలు, రొయ్యల జాతులు వంటివాటిని ఇందులో ప్రదర్శిస్తారని తెలిపారు. 'సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వా కల్చర్' సంస్థ సహకారంతో రాష్ట్ర మత్స్య శాఖ దీన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ ప్రదర్శన దక్షిణాసియాలో ఇదే తొలిసారని చెప్పారు. సుమారు 25 దేశాల నుంచి వివిధ కంపెనీల ప్రతినిధులు, దేశం నలుమూలల నుంచి మత్స్యకారులు సైతం హాజరవుతారన్నారు.

14 నుంచి 'మైనింగ్ టుడే' అంతర్జాతీయ సదస్సు

హాజరుకానున్న వివిధ దేశాల ప్రతినిధులు

ఈనాడు, హైదరాబాద్: ఖనిజాలఅన్వేషణలో వస్తున్న మార్పులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తెలంగాణలో మైనింగ్, అనుబంధ రంగాల్లో ఉన్న అవకాశాలపై చర్చించే 'మైనింగ్ టుడే' అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కాబోతోంది. హైటెక్స్‌లో ఫిబ్రవరి 14 నుంచి 17 వరకు నాలుగు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలతోపాటు ఆఫ్రికా దేశాల నుంచి ఖనిజాన్వేషణ నిపుణులు హాజరుకానున్నారు. తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఫిక్కీ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. మైనింగ్‌టుడే సదస్సు ప్రారంభోత్సవానికి కేంద్ర ఉక్కుశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, గవర్నర్ నరసింహన్ హాజరుకానున్నారు. ఖనిజాన్వేషణ రంగంలో అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ వంటి అంశాలను చర్చించడంతోపాటు..నూతన ఉత్పత్తుల్ని సదస్సులో ఆవిష్కరించే అవకాశం ఉంది.

మైనింగ్ శాఖ అధికారుల డైరీ ఆవిష్కరించిన కేటీఆర్: గనులశాఖాధికారుల 2018 డైరీని గనులశాఖ మంత్రి కేటీఆర్ బేగంపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. గనులశాఖ సంచాలకుడు సుశీల్‌కుమార్‌తోపాటు..ఆ శాఖాధికారుల సంఘం నేతలు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీకి సహకారం అందిస్తాం

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ వెల్లడి

తెలంగాణ ఆర్టీసీకి తమ వంతు సహకారాన్ని అందిస్తామని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్‌భవన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావుతో సమావేశమయ్యారు. అనంతరం ఫ్లెమింగ్ మాట్లాడుతూ. . "ఎలక్ట్రిక్ బస్సులు, స్మార్ట్ కార్డులతోపాటు ఖర్చును తగ్గించుకునేందుకు సౌరవిధానాన్నీ ఆర్టీసీ అమలుచేస్తుండటం అభినందనీయమన్నారు.

యూరోపియన్ ఏఎన్ఎంల వేతనాలు పెంపు

ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలో పనిచేస్తున్న యూరోపియన్ ఏఎన్ఎంలు, అదనపు ఏఎన్ఎంల వేతనాలు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతమున్న వేతనం నెలకు రూ.10,020 కాగా..దాన్ని రూ.21,230కు పెంచుతూ ఆరోగ్య వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులిచ్చారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 800 మంది లబ్ధిపొందే అవకాశాలున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి. గతంలో యూరప్ దేశాల ఆర్థికసాయంతో కొన్ని ఆరోగ్య పథకాలను అమలుచేశారు. ఆ నిధులతో నడుస్తున్న పథకాల్లో పనిచేయడానికి నియమించిన వారిని యూరోపియన్ ఏఎన్ఎంలుగా పిలుస్తున్నారు.

పౌరసరఫరాల శాఖపై తమిళనాడు అధికారుల అధ్యయనం


తమ రాష్ట్రంలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తున్నామని ఇందులో భాగంగా తెలంగాణలో రెండు రోజులపాటు పర్యటించనున్నట్లు తమిళనాడు పౌరసరఫరాల శాఖ సీఐడీ అదనపు డీజీ డాక్టర్ ప్రతీప్ వి ఫిలిప్ తెలిపారు. ఆయన నేతృత్వంలోని అధికారుల బృందం బుధవారం తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌తో సమావేశమైంది. ఇక్కడ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేసి తమ రాష్ట్రంలో అమలు చేసే ఆలోచనలో ఉన్నట్లు ప్రతీప్ వివరించారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు పీఈటీ పరీక్షలు

ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి శారీరక అర్హత పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఈనెల 16, 17వ తేదీల్లో శారీరక సామర్థ్య పరీక్షలు(పీఈటీ) పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. పురుష అభ్యర్థులకు ఈనెల 16న, మహిళా అభ్యర్థులకు 17న బండ్లగూడ ఎక్సైజ్ అకాడమీలో ఉదయం 5 గంటలకు ఈ పరీక్షలు ఉంటాయి. అర్హులైన అభ్యర్థులు హాల్‌టికెట్‌తో హాజరుకావాలని, వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం

రెండోసారి ఎన్నిక • 60 మందికి కార్యవర్గంలో చోటు



నల్గొండ వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నల్గొండలో జరిగిన సీపీఎం రాష్ట్ర మహాసభల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఖమ్మం జిల్లాకు చెందిన తమ్మినేని వీరభద్రం రెండోసారి ఎన్నికయ్యారు. కార్యవర్గంలోకి 60 మందిని తీసుకున్నారు. 13 మందిని కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వారిలో ఎస్.వీరయ్య, సీహెచ్ సీతారాములు, జి.నాగయ్య, చుక్కా రాములు, నంద్యాల నర్సింహారెడ్డి, సున్నం రాజయ్య, బి.వెంకట్, టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, పి.సుదర్శన్‌రావు, జి.రాములు, డీజీ నర్సింహారావు ఉన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మల్లు స్వరాజ్యం, సారంపల్లి మల్లారెడ్డి, పి.రాజారావులను, ఆహ్వానితులుగా మరో తొమ్మిది మందిని ఎన్నుకున్నారు.

ఏ ఊరైనా 'మావూరి'దే!

- **భూ ఆక్రమణల్లో ఘనాపాటి మావూరి శివభూషణ్**
- **బంజారాహిల్స్‌లో రూ. 275 కోట్ల భూముల కబ్జా**
- **అస్లాం.. రాజ్‌నాథ్ పేర్లతో తప్పుడు పత్రాలు**

ఈనాడు – హైదరాబాద్

హైదరాబాద్.. శివారు ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువైన భూములను ఘరానా నేరగాళ్లు కబ్జాలు చేస్తూనే ఉన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి తామే సొంతదారులుగా చెలామణి అయ్యేవారు కొందరైతే.. పదుల ఎకరాలు తనవేనంటూ అడ్డంగా అమ్మేస్తున్న ల్యాండ్ మాఫియాలు మరికొన్ని. ఇలాంటి మాఫియాలో కీలక పాత్రధారి మావూరి శివభూషణ్! నిజాం వారసుల నుంచి భూములు కొన్నామని, కాందీశీకుల భూములపై హక్కులు ఉన్నాయంటూ బంజారాహిల్స్, ఆసిఫ్‌నగర్, భోజగుట్టలలో ప్రభుత్వ స్థలాలను అక్రమించిన ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, న్యాయవాది శైలేష్ సక్సేనాలకు ప్రధాన అనుచరుడు ఇతడు. కేవలం మూడేళ్ల వ్యవధిలో 275 కోట్ల విలువైన భూములను వీరు ఆక్రమించారు. వీరందరినీ హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ పోలీసులు గతేడాది అరెస్ట్ చేశారు. తాజాగా కొత్వాల్‌గూడలో 1,820 ఎకరాల ప్రభుత్వ భూమికి అతడే యజమాని అని సమాచారం రావడంతో సీసీఎస్ పోలీసులు ఆరా తీస్తున్నారు. తాము గతంలో అరెస్టు చేయగా, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడని సీసీఎస్ అధికారులు తెలిపారు.

ఇక్బాల్ ఇస్లాంఖాన్.. ఈ భూములన్నీ నావే..

ఆసిఫ్‌నగర్ భోజగుట్టలోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయాలని దీపక్‌రెడ్డి, శైలేష్ సక్సేనా, మావూరి శివభూషణ్‌లు కొన్నేళ్ల క్రితం పథకం వేశారు. శివభూషణ్ పేరును ఇక్బాల్ ఇస్లామ్‌ఖాన్‌గా మార్చి ఓటరు గుర్తింపు కార్డు, పాన్‌కార్డు, ఇతర కార్డులు తయారు చేశారు. నిజాం నవాబు ఇనాంగా ఇచ్చిన వారిని నుంచి 78 ఎకరాల 72 గుంటలను కొన్నామంటూ నకిలీ పత్రాలు సృష్టించారు. ఇనాం పొందిన వారి పేర్లు కూడా వీరే సృష్టించారు. వాటిని కోర్టులో సమర్పించడంతో వారికి అనుకూలంగా ఐదేళ్ల క్రితం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అది ప్రభుత్వ భూమిగా భావించి గుడిసెలు వేసుకున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించేందుకు యత్నించారు. గుడిసెలు వేసుకున్న వారు రూ.లక్ష, రూ.2 లక్షలు వీరికి ఇచ్చి మరోచోట గూడు దొరికే వరకూ ఇక్కడే ఉంటామని చెప్పారు. సీసీఎస్ పోలీసుల దర్యాప్తులో వీరు సృష్టించిన పత్రాలు నకిలీవని తేలింది.

రాజ్‌నాథ్ ఠాగూర్‌గా..


బంజారాహిల్స్‌లోని 3.37 ఎకరాల స్థలం వ్యవహారంలో మావూరి శివభూషణ్ రాజ్‌నాథ్ ఠాగూర్‌గా నటించాడు. కాందీశీకుల భూమికి తాను వారసుడిని దాన్ని దీపక్ రెడ్డి, శైలేష్ సక్సేనాలను ఇచ్చేశానంటూ పత్రాలు సృష్టించాడు. వీటిని కోర్టులో సమర్పించి తమకు హక్కులు ఇవ్వాలంటూ దీపక్‌రెడ్డి, శైలేష్ సక్సేనాలు కోరారు. వాస్తవానికి ఈ స్థలాన్ని రాధాకృష్ణ చౌదరి సోదరులు చాలా ఏళ్ల క్రితమే కొనుగోలు చేశారు. ఇతర వ్యాపారాలుండడంతో నిర్మాణాలు చేపట్టలేదు. మూడేళ్ల క్రితం రియల్‌ఎస్టేట్ సంస్థతో స్థలం అభివృద్ధి, వ్యాపార సముదాయం నిర్మాణంపై ఒప్పందం కుదుర్చుకున్నారు. సదరు రియల్‌ఎస్టేట్ సంస్థ నిర్మాణ పనులు చేపట్టేందుకు వెళ్లగా.. దీపక్‌రెడ్డి, శైలేష్ సక్సేనా అనుచరులు కోర్టు ఉత్తర్వులను చూపించారు. దీంతో రాధాకృష్ణ చౌదరి సోదరులు పోలీసులను ఆశ్రయించారు. సీసీఎస్ పోలీసులు తప్పుడు పత్రాలని నిర్ధరించి దీపక్‌రెడ్డి బృందాన్ని అరెస్ట్ చేశారు.

ఇస్లాంఖాన్‌ను 'చంపేశారు'!

భోజగుట్టలో ఇక్బాల్ ఇస్లాంఖాన్ పేరుతో కబ్జాచేసుకున్న భూములను ఇతరులకు విక్రయించేందుకు దీపక్‌రెడ్డి, శైలేష్, మావూరి శివభూషణ్‌లు మరో పథకాన్ని అమలు చేశారు. ఇక్బాల్ ఇస్లాం ఖాన్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. అనంతరం ఇక్బాల్ కుమారుడంటూ సరికొత్త పాత్రను సృష్టించారు. ఈ పాత్ర పోషించేందుకు సికింద్రాబాద్‌లో ఉంటున్న చిరు వ్యాపారి మహ్మద్ బషీర్‌ను ఒప్పించారు. అతడి పేరును షకీల్ ఇస్లాం ఖాన్‌గా మార్చారు. ఆ పేరుతో నకిలీ ఓటర్, పాన్ కార్డులను సృష్టించారు. తర్వాత ఎఫ్.ఐ.ఆర్ సాయంతో తన తండ్రి భూములు తనకే చెందాలంటూ కోర్టులో పత్రాలు దాఖలు చేశారు. అసలు ఇక్బాల్ ఇస్లాం ఖాన్ అనే వ్యక్తే లేడని నేరపరిశోధన విభాగం ఏసీపీ విజయ్‌కుమార్ దర్యాప్తులో తేలడంతో బషీర్‌ను అరెస్ట్ చేశారు.

కొత్వాల్‌గూడ భూముల్లో 'వలస' పక్షులు!

- **ఎనిమీ భూములుగా ప్రకటించాలని కోరుతున్న పాకిస్థాన్ 'కాందిశీకులు'**



ఈనాడు, హైదరాబాద్: మన రెవెన్యూ రికార్డుల్లోని డొల్లతనానికి నిదర్శనమిది.. భూ వివాదాల్లో సరికొత్త కోణమిది.. ఒకవైపు రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన ముమ్మరంగా సాగుతుండగానే ఊళ్లకు ఊళ్లనే భోంచేస్తున్న పెద్ద మనుషుల బాగోతం బయటపడుతుండడం విశేషం. హైదరాబాద్ శివారులోని శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామ పరిధిలోని పేదల భూములను అడ్డం పెట్టుకొని రూ. కోట్లు దండుకొనే ప్రయత్నాలు నిరంతరంగా సాగుతూనే ఉన్నాయి..ఈ గ్రామంలోని భూములను కుదవపెట్టి రూ.కోట్లు దండుకునే ప్రయత్నం ఒకవైపు జరుగుతుంటే ఇంతకంటె పెద్దఎత్తున ఆ భూములన్నీ తమకు చెందినవేనని.. వాటిని 'ఎనిమీ' భూములుగా ప్రకటించాలని కోరుతూ పాకిస్థాన్ వెళ్లి స్థిరపడ్డ వ్యక్తులు కొందరు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు ముంబయిలోని ప్రాంతీయ సెటిల్‌మెంట్ కమిషనర్‌వద్ద విచారణ ప్రారంభమైంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇవ్వాలని రెవెన్యూ యంత్రాంగానికి ఉత్తర్వులు వచ్చాయి. ఆ భూముల్ని ఎనిమీ ఆస్తిగా ప్రకటిస్తే వాటిపై స్థానికులు పూర్తిగా హక్కులు కోల్పోతారు. అందుకే రెవెన్యూ యంత్రాంగం వాటిపై సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే ఒకటిరెండుసార్లు రంగారెడ్డిజిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల సమక్షంలో సమీక్షలు జరిగాయి.. కొత్వాల్‌గూడలోని భూములన్నీ స్థానికులకే చెందుతాయని నిర్ధారించేలా అన్ని ఆధారాలతో దస్త్రాన్ని తయారు చేస్తున్నారు.. త్వరలోనే ఈ దస్త్రాన్ని ప్రాంతీయ సెటిల్‌మెంట్ కమిషనర్‌కు పంపుతామని రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు. కొత్వాల్‌గూడలోని సర్వేనంబర్లు 1నుంచి 174 పరిధిలో దాదాపు 2,740 ఎకరాలు ఉంటాయి. ఒకసారి ఎనిమీభూములుగా ప్రకటిస్తే ఇక ఆ చెర నుంచి తప్పించడం చాలా కష్టమవుతుంది. అందువల్ల ఈభూములపై కన్నేసిన వారి ప్రయోజనాలు నెరవేరకుండా జాగ్రత్తలుతీసుకుంటున్నారు.

రుణం కోసం..: కొత్వాల్‌గూడ భూములను ఎనిమీ భూములుగా చూపించి.. తద్వారా లబ్ధి పొందాలనే ప్రయత్నాలు ఒకవైపు జరుగుతుంటే ఒక ప్రభుత్వ సంస్థకు కుదవపెట్టి దాదాపు రూ. 332 కోట్లను రుణంగా పొందిన వ్యవహారం తాజాగా కలకలం సృష్టిస్తోంది. గోవా కేంద్రంగా పనిచేసే ఒక సంస్థ ఈ రుణాన్ని తీసుకొని తిరిగి చెల్లించకపోవడంతో ఇది చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించి సమర్పించిన ధ్రువపత్రాలు. ఈ తంతు జరిగిన తీరుపై రెవెన్యూవర్గాలు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నాయి. నకిలీ ధ్రువపత్రాల సాయంతో ఈ దందా జరిగిందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ది ప్రాజెక్ట్ అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ (పీఈసి) నుంచి కొందరు వ్యక్తులు ఒక సంస్థ పేరుతో రుణం పొందేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం ఏవైనా ఆస్తులను తనఖా పెట్టాల్సి రావడంతో సయ్యద్ మహమ్మద్ హసన్ నుంచి అతనికి చెందిన కొత్వాల్‌గూడలోని 1,820ఎకరాల భూములను శివభూషణ్ అనే వ్యక్తి 1977లో కొన్నట్లు పత్రాలు చూపించారు.. వాటిని 2014 ఫిబ్రవరి 2న పీఈసి సంస్థకు తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారు.

అవి నకిలీపత్రాలేనా..: రుణం కోసం అడుగడుగునా దొడ్డిదారినే ప్రయత్నాలు జరిగాయి.. నకిలీ ధ్రువపత్రాలతోనే ఈ దందా సాగించారని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులు కూడా అభిప్రాయపడుతున్నారు. గతంలో ఉన్న 'ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్' సదుపాయాన్ని వినియోగించుకున్నారు. కొత్వాలగూడలోని 1 నుంచి 170 సర్వే నంబర్ల పరిధిలో ఉన్న భూమిని 1977లో రిజిస్ట్రేషన్ చేసినట్లు చూపించినా తనఖా సందర్భంగా అఫిడవిట్ మాత్రమే సమర్పించారని తెలిసింది. భూములను కొనుగోలుచేస్తే రికార్డుల్లో తన పేరుతో మ్యుటేషన్ చేయించుకోవాలి. గ్రామంలోని భూమిని తన అధీనంలోకి తెచ్చుకోవాలి.. ఇవేవీ జరగలేదు. ఈనాటికీ రెవెన్యూ రికార్డుల్లో స్థానికుల పేర్లే కనిపిస్తున్నాయి తప్ప శివభూషణ్ తదితరుల పేర్లు కనిపించడం లేదు. రిజిస్ట్రేషన్ దస్త్రాల్లోనూ మార్పులు కనిపించడంలేదు. అలాగే తనఖా సందర్భంగా ఎల్.బి.నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎలాంటి లింకు పత్రాలు సమర్పించలేదని అక్కడి అధికారి ఒకరు నిర్ధారించారు. మొత్తంమీద ఈ వ్యవహారం అంతా దొడ్డిదారినే సాగినట్లు స్పష్టమవుతోంది. రుణం భారీగా ఇచ్చేప్పుడు.. క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించాల్సిన పీఈసీ సంస్థ ప్రతినిధులు ఇప్పుడు ఈ లావాదేవీలు సరైనవేనా అని ఆరాతీయడాన్ని కూడా సందేహిస్తున్నారు.

పేదలకు నష్టం జరగదు

– కలెక్టర్ రఘునందనరావు

కొత్వాల్‌గూడ గ్రామ భూముల తాకట్టు విషయంలో ఆ గ్రామస్థులకు ఎలాంటి నష్టం వాటిల్లదని కలెక్టర్ అభయమిచ్చారు. అవన్నీ ఇప్పటికీ స్థానిక పట్టాదారుల పేరుతోనే ఉన్నాయని స్పష్టం చేశారు. ఇతరుల పేర్లు ఎక్కడా నమోదు కాలేదన్నారు. అందువల్ల స్థానికులు ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని తెలిపారు. ఈ విషయమే పీఈసి సంస్థకు తెలియజేస్తామన్నారు.

అద్భుత విధానం టీఎస్ఐపాస్

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అనుమతులు స్వీయ ధ్రువీకరణ విధానం (టీఎస్ఐపాస్) అద్భుతమైనదని, ఇది చక్కటి ఫలితాలను సాధిస్తోందని రాష్ట్ర విద్యుత్ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఈ విధానాన్ని విజయవంతం చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం, పారిశ్రామికవేత్తలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. టీఎస్ఐపాస్ అమలులో రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు పొందిన కాలుష్యనియంత్రణ మండలి కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, కర్మాగారాల సంచాలకులు చంద్రమోహన్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ రమణ ప్రసాద్, పరిశ్రమల జేడీ, ఏడీలు సురేశ్, చంద్రశేఖర్‌లను రాష్ట్ర పారిశ్రామికవేత్తల సమాఖ్య (టిఫ్), పాశమైలారం పరిశ్రమల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. . 'పారిశ్రామిక రంగంలోని అన్ని సమస్యలకు టీఎస్ఐపాస్ పరిష్కారం చూపింది. ప్రవేశపెట్టడంలోనే కాదు దానిని నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత తెలంగాణదే. సత్వర అనుమతులు, నిరంతర విద్యుత్ ఇతర సౌకర్యాల ద్వారా పారిశ్రామిక రంగం కళకళలాడుతోంది. పనిచేసే అధికారులను అన్ని విధాలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది' అని తెలిపారు. టిఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్ఐపాస్ తెలంగాణకే గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాశమైలారం పరిశ్రమల సంఘం ఛైర్మన్ దుర్గాప్రసాద్, ఐలా ఛైర్మన్ చందుకుమార్‌లు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి

నేడు తేలికపాటి వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో గురువారం తెలంగాణలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి తెలిపారు. బుధవారం సైతం అక్కడక్కడ చిరు జల్లులు కురిశాయని, ఆకాశం మేఘావృతమైందని వివరించారు. గత రెండు నెలల్లో రాష్ట్రంలో ఎక్కడా వర్షాలు లేవు. బుధవారం తెల్లవారుజామున ఆదిలాబాద్‌లో 13, హైదరాబాద్‌లో 16, మహబూబ్‌నగర్‌లో 20 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిపూట ఇంకా పెరుగుతాయని అంచనా. బుధవారం పగలు ఎండ లేనందునా పలు ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది.

తెలుగును అర్థం చేసుకునేదీ 20% లోపే

- **6-9 తరగతుల వారిలో చూసిరాతలే అధికం**
- **సొంతగా జవాబులు రాయకున్నా మార్కులు వేస్తున్నారు**
- **సైన్స్ ప్రయోగాలు చేయకుండానే రికార్డులు రాయిస్తున్నారు**
- **పాఠశాలల తనిఖీలపై రాష్ట్ర పర్యవేక్షణ బృందాల నివేదిక తేల్చిన వాస్తవాలు**

ఈనాడు, హైదరాబాద్: 'తెలుగులో ఒక పేరాను అనర్గళంగా చదివి అర్థం చేసుకోగలగడం, సొంతగా రాయగల్గిన వారు ప్రాథమిక పాఠశాలల్లో 5-10 శాతం వరకు, ఉన్నత పాఠశాలల్లో 15-20 శాతం కంటే మించి ఉండరు' ... తెలంగాణ పాఠశాల విద్యాశాఖ జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడులను తనిఖీ చేసి...విద్యార్థులను పరీక్షించి ఇచ్చిన నివేదిక చెబుతున్న వాస్తవం ఇదీ. చదువులో వెనకబడిన వారిని మెరుగుపరిచేందుకు 3 ఆర్ కార్యక్రమాన్ని విద్యాశాఖ అమలు చేస్తోంది. అంటే ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, అంకగణితం చేయగలిగి ఉండాలి. ఆ కార్యక్రమం అమలు తీరును బృందాలు పరిశీలించాయి. మొత్తం 1226 ప్రాథమిక, ప్రాథమికోన్నత, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను సందర్శించాయి. ఇక ఆంగ్లం విషయానికొస్తే ప్రాథమిక స్థాయిలో ఏ పదాలనైనా పిల్లలు చదవలేకపోతున్నారు. ఆంగ్లంలో ఒక పేరాను అనర్గళంగా చదవడం, తప్పులు లేకుండా రాయగలిగేవారు ఎవరూ లేరు. ఉన్నత పాఠశాలల్లో మాత్రం 15 శాతం వరకు ఉన్నారు. ఆదర్శ పాఠశాలల్లో కొంత మెరుగ్గా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి సగటు హాజరు 83 శాతం, ఉన్నత పాఠశాలల్లో 84 శాతంగా ఉన్నట్లు తేలింది.

పిల్లల ప్రగతి ఇదీ...: ప్రారంభ పరీక్షలో రాష్ట్ర ప్రగతి 16 శాతం ఉంటే అంత్య పరీక్షలో 42 శాతం ఉంది. అంత్యపరీక్షలో రాష్ట్ర సగటు(42 శాతం) కంటే చాలా తక్కువగా మహబూబ్‌నగర్ జిల్లా 22, ఆదిలాబాద్ జిల్లా 18 శాతంతో వెనకబడి ఉన్నాయి. రాష్ట్ర సగటుకంటే అత్యధికంగా సూర్యాపేట- 72, ఖమ్మం- 66, నిజామాబాద్- 65 శాతం ప్రగతితో ముందంజలో ఉన్నాయి.

నిరంతర సమగ్ర మూల్యాంకనం పరిస్థితి...: దాదాపు అన్ని తరగతుల్లో ఎక్కువ పాఠశాలల్లో పిల్లల జవాబులు ఒకరివి ఒకరు చూసి రాసినట్లే ఉన్నాయి. విద్యార్థులు సొంతగా జవాబులు రాయకున్నా మార్కులు కేటాయిస్తున్నారు. గైడ్లలో చూసి రాయడం, ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే రాయటం జరుగుతోంది. 6, 7 తరగతుల్లో భాషల్లో పుస్తక సమీక్షలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. కేజీబీవీల్లోనూ పుస్తక సమీక్షలు దాదాపు అందరివీ ఒకేలా ఉంటున్నాయి. చాలా చోట్ల సైన్స్ ప్రయోగాలు నిర్వహించకుండానే ప్రయోగశాల రికార్డులను రాయిస్తున్నారు.

ఉపాధ్యాయుల హాజరు పరిస్థితి: ప్రాథమిక పాఠశాలల్లో గద్వాల జిల్లా 65 శాతం, కామారెడ్డి 67, ఆదిలాబాద్ జిల్లా 70 శాతంతో కింది స్థానాల్లో ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో రంగారెడ్డి జిల్లా 62, ఆదిలాబాద్ 70, యాదాద్రి భువనగిరి జిల్లా 74 శాతంతో హాజరులో అడుగున ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో సిరిసిల్ల జిల్లా 98 శాతం, సంగారెడ్డి, మెదక్ 95, ఆసిఫాబాద్ 94 శాతంతో అగ్రస్థానంలో ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలు 95 శాతంతో అగ్రస్థానంలో నిలిచాయి.

బడి సంచి బరువు తగ్గలేదు: ప్రాథమిక పాఠశాలల్లో 3-6 కిలోల వరకు, ఉన్నత పాఠశాలల్లో 6-10 కిలోలు, కేజీబీవీల్లో 5-10 కిలోల వరకు బడి సంచి బరువు ఉంది. అవసరానికి మించి నోటు పుస్తకాలు, గైడ్లు ఉన్నాయి.

ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయాలి: ఈటల

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయాలని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ కోరారు. ప్రభుత్వం, మంత్రులు ఉద్యమ స్ఫూర్తితోనే పనిచేస్తున్నారని ఉద్యోగులు గుర్తించాలన్నారు. బుధవారం సచివాలయంలో ఖజానా ఉద్యోగుల డైరీని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత అధికారులదేనని చెప్పారు. కేవలం రాజకీయ వ్యవస్థతోనే పనులు పూర్తికావన్నారు. సీఎం కేసీఆర్ కేసీఆర్ ఆలోచనలు, ప్రభుత్వ విధానాలతో తెలంగాణ అనేక అంశాల్లో మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు.

ఉన్నత కోర్సులు చేసినవారూ దరఖాస్తు చేసుకోవచ్చు

ఫార్మసిస్టు పోస్టులపై టీఎస్‌పీఎస్సీ

ఈనాడు, హైదరాబాద్: వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టు గ్రేడ్-2 పోస్టులకు ఫార్మసీలో ఉన్నత కోర్సులు చేసిన వారూ దరఖాస్తు చేసుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ప్రకటనలో ఇంటర్మీడియట్, డీఫార్మసీ, ఫార్మసీ మండలిలో రిజిస్ట్రేషన్ అర్హతలుగా నిర్ణయించారు. తాజాగా ఫార్మసీలో ఉన్నత కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు.


ఇక తెలుగులోనూ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన ఉత్తర్వులను ఇకపై ఆంగ్లంతోపాటు తెలుగులోనూ జారీచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతీశాఖ దీనిని విధిగా పాటించాలని సూచించారు. ఐటీశాఖ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని నవీకరిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వెబ్‌సైట్లను తాజాగా మార్చాలనీ, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి సత్ఫలితాలను సాధించాలన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన ప్రభుత్వశాఖల ప్రత్యేక ప్రధాన, ముఖ్య కార్యదర్శులతో సమావేశమయ్యారు. వ్యవసాయం, ఆర్థిక, రెవెన్యూ, ప్రణాళిక, హోం, పరిశ్రమలు, ఐటీ, అటవీ, పౌరసరఫరాలు, నీటిపారుదలశాఖల పనితీరుపై సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ- 'ప్రజలకు అర్థమయ్యే రీతిలో సమాచారం ఉండాలి. మాతృభాష తెలుగులో ఉత్తర్వులివ్వడం వారికి ఎనలేని మేలు చేస్తుంది. ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశాలు, నిధుల కేటాయింపులు, ఇతరత్రా విషయాలన్నీ వారికి తెలుస్తాయి. ఆంగ్ల ఉత్తర్వులన్నింటినీ తెలుగులో ఇచ్చేందుకు అనువాదశాఖ ద్వారా చర్యలు తీసుకోవాలి. 'మీ సేవ' మరింత పారదర్శకంగా ఉండాలి. నీటిపారుదల, వ్యవసాయశాఖలు సంయుక్తంగా పంటల సాగుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. బిందు సేద్యాన్ని ప్రోత్సహించాలి. తక్కువ నీటితో ఎక్కువ ఉత్పత్తి సాధించాలి. నీటిపారుదల, మత్స్యశాఖలు సమన్వయంతో పనిచేసి చేపల పెంపకాన్ని పెంచాలి. ఆబ్కారీ, జీఎస్టీ, రిజిస్ట్రేషన్లు, గనుల ఆదాయాన్ని పెంచాలి. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలి. పారిశ్రామిక ప్రాజెక్టులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేయాలి." అని సూచించారు. ఉన్నతాధికారులు రాజేశ్వర్ తివారి, జయేశ్ రంజన్, శాలినీ మిశ్ర, అధర్‌సిన్హా, రామకృష్ణారావు, సోమేశ్‌కుమార్, రజత్‌కుమార్, వికాస్‌రాజ్, ఆర్వీ చంద్రవదన్, నదీం అహ్మద్, సీవీ ఆనంద్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ఎన్ఎస్ఎస్ ద్వారా ప్రత్యేక క్యాంపు

ఈనాడు, హైదరాబాద్: ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అన్ని విద్యా సంస్థల వద్ద జాతీయ సేవా శిబిరం(ఎన్ఎస్ఎస్) వాలంటీర్ల ద్వారా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అనూప్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఓటు హక్కు పొందే వారి కోసం శుక్రవారం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2018 జనవరి 1 నాటికి 18-19 సంవత్సరాలు నిండిన యువకులు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఓటర్ల నమోదు కోసం ఈ నెల 14వరకు అవకాశముంది. అందులో భాగంగా ఓటు హక్కు వయసు వచ్చిన విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని అనూప్ సింగ్ వెల్లడించారు.

9న విట్ ఏపీలో విటోపియా-2018



మాట్లాడుతున్న శేఖర్ విశ్వనాథన్

గుంటూరు, న్యూస్‌టుడే: అమరావతిలో ఏర్పాటుచేసిన విట్-ఏపీ విశ్వవిద్యాలయం తొలి సారిగా జాతీయ స్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవానికి సిద్ధమైంది. విట్ ఏపీ 'విటోపియా- 2018' పేరిట ఈ నెల 9 నుంచి విశ్వవిద్యాలయం ఆవరణలో జాతీయ క్రీడా సాంస్కృతిక ఉత్సవం నిర్వహించనున్నట్లు విట్ ఏపీ ఉపాధ్యక్షుడు శేఖర్ విశ్వనాథన్ బుధవారం పేర్కొన్నారు. దీనికి దేశం నలుమూలలనుంచి 300 మంది విద్యార్థులు విచ్చేస్తున్నారని చెప్పారు. బాలీవుడ్ గాయకుడు బిన్నీదయాళ్, టాలీవుడ్ గాయని దామిని బాట్లచే సంగీత కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు.

'సార్వత్రిక' పరీక్షల రుసుముల చెల్లింపు గడువు 20

ఈనాడు, హైదరాబాద్: ఏప్రిల్ లేదా మే నెలలో జరిగే సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్ సొసైటీ) పది, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈనెల 9 నుంచి 20 వరకు రుసుము చెల్లించాలని సంస్థ సంచాలకుడు వెంకటేశ్వర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.25 ఆలస్య రుసుంతో ఈనెల 27 వరకు, రూ.50 ఆలస్య రుసుంతో మార్చి 6వరకు పరీక్ష రుసుం చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ
▼ 113	▼ 22
34083	10477



○ కీలక రుణ రేటు(రెపో)లో మార్పు లేదు. 6 శాతంగానే ఉంచారు.

○ రివర్స్ రెపో రేటు(5.75%), మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ(ఎమ్ఎస్ఎఫ్), బ్యాంక్ రేటు(6.25 %)లు కూడా యథాతథమే.

○ పరపతి విధాన ధోరణి తటస్థం.

○ పెట్రోలు, డీజిల్ ధరలు జనవరిలో ఎక్కువగా పెరిగాయి. అంతక్రితం పెరిగిన అంతర్జాతీయ ముడి చమురు ధరల ప్రభావం ఇపుడు ప్రతిఫలించింది.

○ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా నమోదు కావొచ్చు. ఇక 2018-19 ప్రథమార్థంలో 5.1-5.6 శాతానికి

ప్రధానాంశాలు

చేరొచ్చు. ద్వితీయార్థంలో మాత్రం 4.5-4.6 శాతానికి పరిమితం కావొచ్చు.

○ 2017-18లో స్థూల విలువ జోడించిన(జీవీఏ) వృద్ధి 6.6 శాతానికి చేరొచ్చు. ఆ తర్వాతి ఏడాది అది 7.2 శాతానికి పెరగవచ్చు.

○ జీఎస్‌టీ స్థిరీకరణతో ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించనుంది.

○ పెట్టుబడులు పుంజుకుంటున్న సంకేతాలు ముందుగానే కనిపిస్తున్నాయి.

○ ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)లకు మూలధన పునర్నిర్మాణ పథకాన్ని ప్రకటించిన నేపథ్యంలో రుణ వృద్ధి పుంజుకుంటుందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది.

○ అంతర్జాతీయ గిరాకీ మెరుగవుతున్నందున ఎగుమతులు కూడా రాణించొచ్చు.

○ గ్రామీణ, మౌలిక రంగాలపై బడ్జెట్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

○ వడ్డీ రేట్ల యథాతథ స్థితికి అయిదు మంది సభ్యులు సానుకూలంగా ఓటు వేయగా.. ఒకరు మాత్రం పావు శాతం పెంచాలని కోరారు.

○ తదుపరి పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) సమావేశం ఏప్రిల్ 4-5న.

ఎమ్‌సీఎల్ఆర్‌తో బేస్ రేటు అనుసంధానం

ఆర్‌బీఐ కీలక రేట్లు తగ్గించినప్పటికీ.. ఒక్కోసారి బ్యాంకులు వాటిని వినియోగదార్లకు బదిలీ చేయడానికి ఆలస్యం చేస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఏప్రిల్ 1 నుంచి ఎమ్‌సీఎల్ఆర్‌ను ప్రామాణిక రుణ రేటు(బేస్ రేటు)తో ఆర్‌బీఐ అనుసంధానం చేయనుంది. ఏప్రిల్ 1, 2016న నిధులపై వ్యయాలకు అనుగుణంగా నిర్ణయించే రుణాల రేటు (ఎమ్‌సీఎల్ఆర్)ను అమల్లోకి తీసుకురావడం ద్వారా ప్రస్తుత ప్రామాణిక రేటుతో అనుసంధానమై ఉన్న రుణాలు సైతం ఎమ్‌సీఎల్ఆర్ వ్యవస్థలోకి వస్తాయని ఆర్‌బీఐ భావించింది. కానీ అలా జరగకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

ద్రవ్యోల్బణం భగ్గుమంటుంది

• అధిక ప్రభుత్వ వ్యయాలే కారణం • ద్రవ్య లోటుతో సవాళ్లే

• పరపతి సమీక్షలో ఆర్‌బీఐ వ్యాఖ్యలు • కీలక రేట్లు యథాతథం • తటస్థ వైఖరి కొనసాగింపు

ముంబయి: ప్రభుత్వ అధిక వ్యయాల కారణంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అంచనా వేసింది. అదే సమయంలో ద్రవ్యలోటు మరింత పెరిగితే సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది కూడా. ద్రవ్యోల్బణం పెరగడానికి ద్రవ్యలోటు కూడా కారణం అవుతుందని అంటోంది. మరో పక్క, ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్‌పటేల్ ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీ(ఎమ్‌పీసీ) కీలక రేట్లను యథాతథంగా ఉంచింది. రెపో రేటును 6 శాతం వద్ద; రివర్స్ రెపో రేటును 5.75 శాతం వద్ద కొనసాగించింది. తన ఆరో ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో తటస్థ వైఖరిని కొనసాగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే ఆఖరి సమీక్ష కావడం గమనార్హం.

ఇదీ ద్రవ్యోల్బణం సంగతి: డిసెంబరులో ద్రవ్యోల్బణం 17 నెలల గరిష్ఠ స్థాయి అయిన 5.21 శాతానికి చేరింది. బడ్జెట్ 2018-19లో ద్రవ్యలోటు లక్ష్యాన్ని పెంచిన నేపథ్యంలో ఈ ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుందని కూడా ఆర్‌బీఐ అభిప్రాయపడింది. తాజా బడ్జెట్‌లో గ్రామీణ రంగానికి, ఆయుష్మాన్ భారత్‌లకు అధిక కేటాయింపుల కారణంగా ద్రవ్యలోటు పెరగవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'అయితే ఇంకా వ్యయాలపై నిర్దిష్ట గణాంకాల కోసం వేచిచూస్తున్నామని.. అందుకే కొంత ప్రభావం ఉండొచ్చని అంచనా వేస్తున్నప్పటికీ.. ఇపుడే ఎంత అని చెప్పలేమ'ని ఉర్జిత్ పటేల్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 2017-18 నాలుగో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది.

వృద్ధి మెరుగవుతోంది..: పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు ప్రభావాలు తగ్గుతున్న నేపథ్యంలో వృద్ధి పరంగా కొంత మెరుగుదల కనిపిస్తోందని.. 2018-19లో భారత్ 7-7.5 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మాత్రం వృద్ధి అంచనాను 6.6 శాతానికి తగ్గించింది. అంతక్రితం (డిసెంబరు సమీక్షలో) ఈ అంచనాను 6.7 శాతంగా పేర్కొంది. గతేడాది ఫిబ్రవరి నుంచి సర్దుబాటు ధోరణిలో ఉన్న ఆర్‌బీఐ ఇపుడు తాజా తటస్థ వైఖరికి మారినట్లు ప్రకటించుకుంది. ఆర్‌బీఐ చివరి సారిగా ఆగస్టు 2017న జరిగిన పరపతి విధాన సమీక్షలో రెపో రేటులో (పావు శాతం) కోత వేసింది.

చిన్న పరిశ్రమలకు ఆర్‌బీఐ బాసట

చిన్న పరిశ్రమలకు బాసటగా రిజర్వ్ బ్యాంక్ కొన్ని చర్యలు ప్రకటించింది. ఇందుకు ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష వేదికైంది. జీఎస్‌టీ అమలు, పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రభావానికి లోనైన సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీ(ఎమ్ఎస్ఎమ్ఈ)లకు ఊరట కల్పించింది. బ్యాంకులకు ఇవి చెల్లించాల్సిన బకాయిలను తీర్చడానికి అదనంగా 180 రోజుల సమయాన్ని ఇచ్చింది. 'వస్తువులు, సేవల పన్ను(జీఎస్‌టీ) కింద వ్యాపారాల నమోదు కారణంగా చిన్న కంపెనీలకు నగదు ప్రవాహంపై ప్రభావం పడింది. దీంతో అవి బ్యాంకులకు, ఎన్‌బీఎఫ్‌సీలకు బకాయిలను చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయ'ని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్.ఎస్. విశ్వనాథన్ పేర్కొన్నారు.

❖ ఆగస్టు 31, 2017 నాటికి జీఎస్‌టీ కింద నమోదైన ఎమ్ఎస్ఎమ్ఈలకు ఈ వెసులుబాటు వర్తిస్తుంది. అయితే జనవరి 31, 2018 నాటికి వాటి బకాయిలు రూ.25 కోట్లు మించి ఉండరాదు.

❖ సెప్టెంబరు 1, 2017 నుంచి జనవరి 31, 2018 మధ్య ఉన్న బకాయిలను 180 రోజుల కంటే ఎక్కువ కాకుండా ఉన్న సమయంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు స్వీకరించాలి.

❖ ప్రాధాన్యతా రంగం కింద సేవల రంగంలోని ఎమ్ఎస్ఎమ్ఈలకు రుణ పరిమితులను సైతం ఎత్తివేసింది. 'ఆర్థిక వ్యవస్థలో సేవల రంగానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రస్తుతం ఉన్న రూ.5 కోట్లు; రూ.10 కోట్ల రుణ పరిమితులను తొలగిస్తున్నాం. దీని ప్రకారం ఎమ్ఎస్ఎమ్ఈలకు ఉన్న అన్ని బ్యాంకు రుణాలకు ప్రాధాన్య రంగం కింద ఎటువంటి పరిమితులు లేకుండా రుణం స్వీకరించడానికి అర్హతను ఇస్తున్నామ'ని ఆర్‌బీఐ పేర్కొంది.

❖ ఈ తరహా మరికొన్ని చర్యలనూ ఆర్‌బీఐ ప్రకటించింది. అందులో దేశీయ బ్యాంకులతో పాటు.. విదేశీ బ్యాంకులకూ వర్తించేవీ ఉన్నాయి.

ఎన్‌బీఎఫ్‌సీలపై ఫిర్యాదుకు అంబుడ్స్‌మన్

బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)లపై వినియోగదార్లకున్న ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడానికి అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ఈ నెలాఖరుకల్లా నిబంధనలను తీసుకురానున్నట్లు తెలిపింది. దశల వారీగా అమలు చేయనున్న ఈ వ్యవస్థను తొలుత డిపాజిట్లు స్వీకరించే ఎన్‌బీఎఫ్‌సీలకు వర్తింపజేస్తారు. వీటి ఆస్తుల పరిమాణం రూ.100 కోట్లు, ఆ పైన ఉండాలి. 'ప్రస్తుతం బ్యాంకుల కోసం ఉన్న ఈ వ్యవస్థకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది ఉచితమే కాక. . వేగవంతమైనది కూడా'నని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ బి.పి. కనుంగో పేర్కొన్నారు.

ఏడో రోజూ నిరాశే

• కొనసాగిన సూచీల నష్టాలు • ఆర్‌బీఐ పరపతి సమీక్ష నేపథ్యం

సమీక్ష

వరుసగా ఏడో రోజూ సూచీలకు నిరాశే మిగిలింది. అంతర్జాతీయ సంకేతాల దన్నుతో ఆరంభ ట్రేడింగ్‌లో బలంగా పుంజుకున్న మార్కెట్లకు ఆర్‌బీఐ కళ్లెం వేసింది. ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ.. వృద్ధి అంచనాలను తగ్గించడం సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. ద్రవ్యోల్బణ ఒత్తిడితో రేట్ల పెంపునకు దారితీయొచ్చన్న అంచనాలు ఇందుకు తోడయ్యాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

అంతర్జాతీయ మార్కెట్ల అండతో సెన్సెక్స్ ఉదయం 34,563.30 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ.. 34,666.33 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. గరిష్ఠ స్థాయి వద్ద మదుపర్లు లాభాలు స్వీకరించడంతో సూచీ నష్టాల్లోకి జారుకుంది. ఆర్‌బీఐ సమీక్ష ప్రకటన అనంతరం మరింత డీలాపడిన సెన్సెక్స్.. చివరకు 113.23 పాయింట్ల నష్టంతో 34,082.71 దగ్గర స్థిరపడింది. గత ఏడు సెషన్లలో సూచీ 2,200 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ సైతం 21.55 పాయింట్లు తగ్గి 10,476.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,446.40-10,614 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ ఆర్‌బీఐ సమీక్ష నేపథ్యంలో రేట్ల ఆధారిత షేర్లు మిశ్రమంగా కదలాడాయి. బ్యాంక్ షేర్లలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, ఫెడరల్ బ్యాంక్ 0.45% వరకు పెరిగాయి. పీఎన్‌బీ, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బీఓబీలు 2.18% వరకు డీలాపడ్డాయి. వాహన షేర్లలో అశోక్ లేలాండ్, ఐషర్ మోటార్స్, టాటా మోటార్స్, హీరో రాణించగా.. మహీంద్రా, మారుతీ షేర్లు తగ్గాయి. స్థిరాస్తి షేర్లలో యునిటెక్, గోద్రేజ్ ప్రోపర్టీస్, ఐబీ రియల్ ఎస్టేట్‌లు రాణించిన వాటిలో ఉన్నాయి.

స్పైస్‌జెట్ జోరు: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం 32 శాతం పెరగడంతో స్పైస్‌జెట్ షేరు పరుగులు తీసింది. ఒకానొకదశలో 7.46 శాతం దూసుకెళ్లిన షేరు.. చివరకు 3.98 శాతం లాభంతో రూ.134.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో 16 నష్టాలు చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్ 2.03%, విప్రో 1.85%, ఎల్ అండ్ టీ 1.58%, యెస్ బ్యాంక్ 1.58%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.37%, టీసీఎస్ 1.34%, హిందుస్థాన్ యునిలీవర్ 1.11%, యాక్సిస్ బ్యాంక్ 0.96%, ఎం అండ్ ఎం 0.96% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి.


అరబిందో ఫార్మా లాభం రూ.595 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి అరబిందో ఫార్మా ఏకీకృత నికర లాభం స్వల్పంగా పెరిగింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికర లాభం 2.8 శాతం వృద్ధితో రూ.578.6 కోట్ల నుంచి రూ.595 కోట్లకు పెరిగిందని అరబిందో ఫార్మా వెల్లడించింది. ఆదాయం 11 శాతం వృద్ధితో రూ.4,336.1 కోట్లుగా నమోదైంది. 2016, డిసెంబరుతో ముగిసిన మూడు నెలలకు ఆదాయం రూ.3,906.2 కోట్ల మేరకు ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 100 శాతం రెండో మధ్యంతర డివిడెండును బోర్డు సిఫారసు చేసింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017-18	నికర లాభం/(నష్టం) 2016-17	మొత్తం ఆదాయం 2017-18	మొత్తం ఆదాయం 2016-17
సిప్లా	401	375	3914	3647
ఐషర్ మోటార్స్	520.5	418.19	2269.01	2071.42
ఈఐడీ ప్యారీ	107.91	178.84	3635.76	3514.66
సోలార్ ఇండస్ట్రీస్	54.15	47.57	465.68	421.51
జైడస్ వెల్‌నెస్	36.16	25.14	132.4	111.82
వోల్టాస్	100.44	81.56	1374.67	1200.12
రిలయన్స్ హోమ్ ఫైనాన్స్	46	23	421	270
సిటీ యూనియన్ బ్యాంక్	154.79	126.62	439.87	373.89
గాయత్రీ ప్రాజెక్ట్స్	46.51	14.15	908.34	521.68
కావేరీ సీడ్స్	5.43	3.55	70.63	67.92



7వ తేదీన ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా(ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	340
బెంగళూరు	365	చెన్నై	380
8న		చిత్తూరు	373
విజయవాడ/గోదావరి	335	నమక్కల్	365

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్, జనగాం వారి ప్రాథమిక ప్రకటన
ఫారం-VI
(చట్టం 30/2013లోని సెక్షన్ 11(1)లోని సబ్‌రూల్ (1) రూల్ (19) ప్రకారం)

జిల్లా గెజిట్ నెం.ఎల్ఎ/జిఎన్/01/2018 తేది : 11.01.2018
జిల్లా కలెక్టర్, జనగాం ఫైల్ నెం.బి1/3292/2017 తేది : 11.01.2018
ప్రత్యేక ఉపకలెక్టర్ జనగాం ఫైల్‌నెం.ఎ3/223/2017 తేది : 21.12.2017

తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, జనగాం గారి ఆదేశానుసారం జనగాం జిల్లా, జనగాం మండలములోని సిద్దెంకి గ్రామములో సుమారు భూమి విస్తీర్ణం ఎ.4-06 గుంటలు గల భూమి ప్రజాప్రయోజనార్థం అనగా జె.చొక్కారావు గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కొరకు బొమ్మకూర్ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువకు కి.మీ.0.975 నుండి 1.900 (టిఇ) వరకు 3ఎల్-5టిఇ-డి-7ఎల్ కాలువ త్రవ్వకం నిమిత్తము ఈ దిగువ చూపిన భూమి అవసరము అయిఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం 2013 (నెం.30/2013)లోని సెక్షన్ 6(2) మరియు 10(4) ననుసరించి మినహాయించిన పరిధిలో ఉన్నందున చాప్టర్-2లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.

ఇట్టి ప్రాజెక్టు నిర్మాణం భూసేకరణ ద్వారా (-) కుటుంబాలు పై గ్రామాలలో నిర్వాసితులు గావించబడుదురు. నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాధి అంశాలకు జాయింట్‌కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ జనగాం గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు నెం.19 రెవిన్యూ (జె.ఎ అండ్ ఎల్.ఎ) తేది :11.02.2017 ప్రకారం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించబడినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద జనగాం జిల్లా, జనగాం మండలములోని సిద్దెంకి గ్రామములో సుమారు విస్తీర్ణం ఎ.4-06 గుంటలు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము : సిద్దెంకి మండలము : జనగాం జిల్లా : జనగాం

"బొమ్మకూర్ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువకు కి.మీ.0.975 నుండి 1.900 వరకు (టిఇ) 3ఎల్-5టిఇ-డి-7ఎల్ కాలువ త్రవ్వకం"

క్రమ సంఖ్య	సర్వే నెం./ భూసేకరణ చేయు విస్తీర్ణం (ఎ.గు)	భూమి రకం (ఖుష్కి/ తరి)/ భూమి విధం	పట్టాదార్లు/అనుభవదార్లు	హద్దులు
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

[illegible]

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, జనగాం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు. భూసేకరణ విషయంలో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల 30/2013 చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, జనగాం/ప్రత్యేక ఉపకలెక్టర్ (భూ.సే), ఆర్ & ఆర్ యూనిట్-1, నీటి పారుదల ప్రాజెక్టులు జనగాం గార్లకు ఇట్టి ప్రకటన జారీచేసిన (60) రోజుల లోపల లిఖిత పూర్వకంగా తెలియజేయవలసి ఉన్నది.

సం/-	సం/-	సం/-
ప్రత్యేక ఉపకలెక్టర్ భూ.సే. ఆర్ & ఆర్ యూనిట్-1 నీటి పారుదల ప్రాజెక్టులు,జనగాం	సంయుక్త కలెక్టర్, జనగాం	జిల్లా కలెక్టర్, జనగాం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
జిల్లా కలెక్టర్ కార్యాలయము, సూర్యాపేట
ఫారం VI (ప్రాథమిక ప్రకటన)

[illegible]




హీరో ఎక్స్‌పల్స్‌తో కంపెనీ ఎండీ, సీఈఓ పవన్ ముంజాల్



బీఎండబ్ల్యూ 6 సిరీస్ గ్రాన్ టూరిస్మోతో సచిన్

సొగసు చూడతరమా.. చూపు మరల్చగలమా..
రెప్పమూసి తెరిచేలోపే కొత్తకొత్త అందాలు..
ఒక పక్క మోడళ్ల సోయగాలు..
మరోవైపు ప్రముఖుల సందడి..
ఇంజినీరింగ్ ప్రతిభకు తోడు సాంకేతిక ఆవిష్కరణలు
భవిష్యత్ మాదేంటున్న విద్యుత్ వాహనాల జోరు..
ఇదీ మొత్తంగా 2018 ఆటో ఎక్స్‌పో మాయాజాలం

చూపు మరల్చగలమా..

- కనువిందు చేస్తున్న వాహన ప్రదర్శన
- విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యం
- కొత్త కార్ల హొయలు.. ఆకట్టుకున్న బైకులు

రెండేళ్లకోసారి జరిగే భారత వాహన ప్రదర్శన (ఆటో ఎక్స్‌పో-2018) మరోసారి అబ్బురపరిచింది. భవిష్యత్ వాహనాలకు చిరునామాగా మారిన ఈ ప్రదర్శనలో కంపెనీలు తమ కొత్త మోడళ్లతో ఆకట్టుకున్నాయి. ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏసీఎంఏ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్)లు సంయుక్తంగా ఈ వాహన ప్రదర్శనను గ్రేటర్ నోయిడాలో నిర్వహిస్తున్నాయి. తొలి 2రోజులు మీడియాకు, వాణిజ్య ప్రముఖులను మాత్రమే అనుమతిస్తారు. 14 వరకు జరిగే ఈ ప్రదర్శనకు 9 నుంచి ప్రజలను అనుమతిస్తారు.

వారెవ్వా.. కాన్సెప్ట్‌ఫ్యూచర్‌ఎస్ (మారుతీ సుజుకీ)

ఈసారి వాహన పండగ మారుతీ సుజుకీ 'కాన్సెప్ట్‌ఫ్యూచర్‌ఎస్'తో ప్రారంభమైంది. ఈ కాన్సెప్ట్ కాంపాక్ట్ కారు 'ఎస్‌యూవీ'లను పోలి ఉంది. కొత్త కారుతో భారత యుటిలిటీ వాహనాల విపణిలో వాటా పెంచుకోవడంపై మారుతీ దృష్టి పెట్టింది. సంప్రదాయ కాంపాక్ట్ కారు డిజైన్‌లకు ఇది పూర్తి విభిన్నంగా ఉండటం గమనార్హం. విద్యుత్ వాహన కాన్సెప్ట్ 'ఇ-సర్వైవర్ కాన్సెప్ట్' సైతం కంపెనీ విడుదల చేయనుంది.

కొత్త ఎలైట్ ఐ20 సిద్ధం.. (హ్యుందాయ్)

ప్రీమియం కాంపాక్ట్ హ్యాచ్‌బ్యాక్ మోడల్ ఎలైట్ ఐ20 మోడల్‌లో కొత్త వెర్షన్‌ను హ్యుందాయ్ వాహన ప్రదర్శనలో ఆవిష్కరించింది. పెట్రోల్ వెర్షన్ ధర రూ.5.34- 7.9 లక్షల మధ్య ఉండగా, డీజిల్ వెర్షన్ ధర రూ.6.73 - 9.15 లక్షలు (ఎక్స్‌షోరూమ్ దిల్లీ)గా ఉంది. డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్స్ వంటి భద్రతా ఫీచర్లు ఇందులో ఉన్నాయి. పెట్రోల్ వెర్షన్‌లో ఆటోమేటిక్ వేరియంట్‌ను సైతం కంపెనీ ఈ ఏడాదిలో తీసుకురానుంది. 'లోనిక్' పేరుతో కొత్త విద్యుత్ వాహనాన్ని సైతం కంపెనీ ప్రదర్శించింది.

విద్యుత్ బొనాంజా (టాటా మోటార్స్)

దేశీయ వాహన దిగ్గజం విద్యుత్ వాహనాలపై దృష్టి పెట్టింది. చిన్న, వ్యక్తిగత వాహన విభాగంలో ఆరు విద్యుత్ వాహనాలను ప్రదర్శించింది. ఇందులో 12ఎం విద్యుత్ బస్సు, మ్యాజిక్, ఐరిస్, టియాగో, టిగోర్, రేస్‌మో విద్యుత్ వేరియంట్లు ఉన్నాయి. ఇదే సమయంలో 'హెచ్5ఎక్స్‌కాన్సెప్ట్' లగ్జరీ ఎస్‌యూవీ, ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ '45ఎక్స్ కాన్సెప్ట్' మోడళ్ల నమూనాలను సైతం విడుదల చేసింది. 'స్మార్ట్ మొబిలిటీ, స్మార్ట్ సిటీస్' థీమ్‌తో కంపెనీ ఈ మోడళ్లను ప్రవేశపెట్టింది.

టీయూవీ స్టింగర్.. వైవిధ్యభరితం (మహీంద్రా)

ఆరు కొత్త ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ వాహనాలు, ఇతర మోడళ్లను మహీంద్రా అండ్ మహీంద్రా విడుదల చేసింది. దక్షిణ కొరియా విభాగం సంగ్‌యాంగ్‌కు చెందిన జీ4 రెక్స్‌టాన్ ఎస్‌యూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఏడాది చివర్లో రెక్స్‌టాన్ విడుదల కానుంది. ఎస్‌యూవీగా మార్చుకోదగిన టీయూవీ స్టింగర్ సైతం ఆకట్టుకుంది.

ట్రెజోర్‌ను చూద్దామా.. (రెనో)

విద్యుత్ కాన్సెప్ట్ కార్లు ట్రెజోర్, జోయ్ ఇ-స్పోర్ట్ నమూనాలను వాహన ప్రదర్శనలో ఫ్రాన్స్ దిగ్గజం రెనో ఆవిష్కరించింది. రెండు సీట్లు కలిగిన ఎలక్ట్రిక్ కూపే ట్రెజోర్ పొడవు 4.7 మీటర్లు, వెడల్పు 2.18 మీటర్లు. ఇక జోయ్ ఇ-స్పోర్ట్ 3.2 సెకన్లలోనే 100 కి.మీ వేగాన్ని అందుకోగలదు.

మేం వచ్చేస్తున్నాం.. (కియా మోటార్స్)

భారత విపణిలోకి కియా మోటార్స్ అడుగుపెట్టనుంది. కంపెనీ 2019 నుంచి 2021 మధ్య భారత్‌లో ప్రత్యేకమైన కాంపాక్ట్ విద్యుత్ వాహనం సహా పూర్తి శ్రేణిని కంపెనీ ఆవిష్కరించింది. భారత్ విపణి కోసం 'ఎస్‌పీ కాన్సెప్ట్' ఎస్‌యూవీని కంపెనీ ప్రదర్శించింది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఇది విపణిలోకి రానుంది. ఆంధ్రప్రదేశ్ ప్లాంట్ నుంచి ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యూవీ ఉత్పత్తి కానుంది. ఈ ప్లాంట్ వార్షిక సామర్థ్యం 3 లక్షల యూనిట్లు. కియా ప్రదర్శించిన మిగిలిక కార్లలో సిటీ కారు పికాంటో, ప్యాసింజర్ కారు రియో, క్రాస్‌ఓవర్ స్టోనిక్, 7 సీట్ల సోరెంటో ఉన్నాయి.

యారిస్‌ను నడిపేద్దామా.. (టయోటా)

మధ్య శ్రేణి ప్రీమియం సెడాన్ 'యారిస్'ను టయోటా కిర్లోస్కర్ మోటార్ విడుదల చేసింది. హోండా సిటీ, మారుతీ సుజుకీ సియాజ్, హ్యుందాయ్ వెర్నాలతో ఈ కారు పోటీపడనుంది. 1.5 పెట్రోల్ ఇంజిన్, 7 ఎయిర్‌బ్యాగ్‌లు, రూఫ్ మౌంటెడ్ ఎయిర్ వెంట్స్, అన్ని చక్రాలకు డిస్క్ బ్రేక్‌లు వంటి అధునాతన ఫీచర్లు ఇందులో ఉన్నాయి. ఈ కారు బుకింగ్‌లు ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్నాయి.

విలాసంగా.. మేబ్యాక్ ఎస్650 (బెంజ్)

దిగ్గజ మోడల్ మేబ్యాక్ ఎస్650ను మెర్సిడెస్ బెంజ్ ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.2.73 కోట్లు. ఇదే సమయంలో భవిష్యత్ విద్యుత్ వాహన నమూనా 'ఈక్యూ'ను కంపెనీ విడుదల చేసింది. ఈ-క్లాస్ ఆల్ టెరాయిన్ సెడాన్ మోడల్‌ను సైతం వాహన ప్రదర్శనలో కంపెనీ ప్రదర్శించింది.

200 సీసీ ఎక్స్‌పల్స్, రెండు కొత్త స్కూటర్లు (హీరో)

200 సీసీ అడ్వెంచర్ మోటార్ సైకిల్ ఎక్స్‌పల్స్, రెండు కొత్త 125సీసీ స్కూటర్లు మ్యాస్ట్రో ఎడ్జ్, డ్యూయట్‌లను హీరో మోటోకార్ప్ ఆవిష్కరించింది. ఈ ఏడాదిలోనే ఇవి విపణిలోకి రానున్నాయి. హీరో ఇన్నోవేషన్ కేంద్రంలో వీటిని రూపొందించింది.

వైజడ్‌ఎఫ్-ఆర్15 3.0 (యమహా)

స్పోర్ట్ బైకు వైజడ్‌ఎఫ్-ఆర్15 3.0 వెర్షన్‌ను యమహా మోటార్ విడుదల చేసింది. దీని ధర రూ.1.25 లక్షలు. రేసింగ్ బ్లూ, థండర్ గ్రే రంగుల్లో లభించనుంది. స్కూటర్ మోడల్ ఫ్యాసినోపై మరింత దృష్టి పెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది.

క్రియాన్ స్కూటర్.. భళారే


టీవీఎస్ మోటార్ విద్యుత్ స్కూటర్‌తో కనువిందు చేసింది. దాని పేరు క్రియాన్. కేవలం 5.1 సెకన్లలోనే ఇది 0 నుంచి 60 కి.మీ వేగాన్ని అందుకోగలదు. 80 శాతం ఛార్జింగ్ 60 నిమిషాల్లోనే చేయవచ్చు. అంతేకాకుండా 220 సీసీ సామర్థ్యం కలిగిన సింగిల్ సిలిండర్ ఇంజిన్ బైకు 'జెప్పెలిన్' నమూనాను సైతం కంపెనీ ఆవిష్కరించింది. పర్యావరణహితమైన అపాచీ ఆర్‌టీఆర్ 200 పై ఎథనాల్ మోడల్‌ను సైతం అందుబాటులోకి తెచ్చింది. దీని గరిష్ఠ వేగం గంటకు 129 కి.మీ.

యాక్టివా 5జీ వస్తుందోచ్ (హోండా)

160సీసీ బైకు ఎక్స్-బ్లేడ్ సహా 10 కొత్త మోడళ్లను హోండా మోటార్‌సైకిల్ ప్రదర్శనలో ఉంచింది. ఎక్స్-బ్లేడ్ బైకు వచ్చే నెలలో విడుదల కానుంది. ఇక యాక్టివా 5జీ సైతం ఆహుతులను ఆకట్టుకుంది.


రెనో విద్యుత్ కారు ట్రెజోర్


ఆఫ్టెక్ మోటార్స్ మోటార్‌సైకిల్ నైట్ రైడర్




టయోటా యారిస్ కాన్సెప్ట్ కారు


టాటా విద్యుత్ బస్సు


రెనో ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ కారు జోయ్ ఇ-స్పోర్ట్


హోండా బ్లేడ్


కియా మోటార్స్ నైరో


హోండా కాన్సెప్ట్ కారు


టీవీఎస్ ఎలక్ట్రిక్ స్కూటర్ క్రియాన్


హ్యుందాయ్ ఎలైట్ ఐ20


టాటా హెచ్5ఎక్స్

భారతీయ ఔషధ సంస్థల చూపు మావైపే

ఐడీఏ ఐర్లాండ్ భారత డైరెక్టర్ తనాజ్

ఈనాడు, హైదరాబాద్: భారతీయ ఫార్మా సంస్థలు యూరప్‌లో అడుగుపెట్టేందుకు ఐర్లాండ్‌ను ఒక మార్గంగా ఎంచుకుంటున్నాయని ఐడీఏ ఐర్లాండ్ భారత డైరెక్టర్ తనాజ్ బుహారివాలా తెలిపారు. జీవశాస్త్ర రంగానికి ఆ దేశం ఒక కేంద్రంగా మారుతోందని, గత 50 ఏళ్లుగా అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలు అందుకు తోడ్పడుతున్నాయన్నారు. ప్రపంచ స్థాయిలో పేరుపొందిన పదికి పైగా ఫార్మా కంపెనీలు ఐర్లాండ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఫిబ్రవరి 22-24వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 15వ బయోఆసియా-2018 సదస్సుకు అంతర్జాతీయ భాగస్వామిగా ఐర్లాండ్ వ్యవహరిస్తోంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భారతీయ ఫార్మా పరిశ్రమలు కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నాయనీ, ముఖ్యంగా ఎఫ్‌డీఏ నోటీసులు ఫార్మా కంపెనీలకు ఇబ్బందిగా మారుతోందన్నారు. వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలకు, ఫార్మా రంగంలో పెట్టుబడులకు ఐర్లాండ్‌లో మంచి అవకాశాలున్నాయన్నారు. మరో ఆరు నెలల్లో హైదరాబాద్‌కు చెందిన 3, ముంబయి నుంచి 2, అహ్మదాబాద్ నుంచి 1 బయోఫార్మా కంపెనీలు ఐర్లాండులో తమ కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నద్ధం వ్యక్తం చేశాయని తెలిపారు.

రాష్ట్రంలో ఫార్మా అభివృద్ధికి దోహదం.. కేటీఆర్: బయోఆసియా 15వ సదస్సుకు ఐర్లాండ్ సరైన భాగస్వామి అని తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి కేటీ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2016లో ఐర్లాండ్‌ను సందర్శించినప్పుడు లైఫ్‌సైన్సెస్, బయోఫార్మా రంగాల అభివృద్ధికి సంబంధించి అవసరమైన అన్ని వసతులూ ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. తెలంగాణలో ఫార్మా రంగం వృద్ధికి, రెండు దేశాల మధ్య బలమైన వ్యాపార సంబంధాలు ఏర్పడేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బయోఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి ఐర్లాండ్‌లో ఉన్న అవకాశాలను తెలుసుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడనుందని పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ తెలిపారు. తెలంగాణ ఫార్మా పరిశ్రమలు అంతర్జాతీయంగా వృద్ధి చెందేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు.

అందుబాటు ధర ఇళ్లపై జీఎస్‌టీ వద్దు

దిల్లీ: సామాన్య, మధ్యతరగతి వర్గీయులు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా అందుబాటు ధరల్లో నిర్మిస్తున్న ఇళ్లు, ఫ్లాట్లకు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూలు చేయొద్దని భవన నిర్మాణదార్లను ప్రభుత్వం ఆదేశించింది. అందుబాటు ధర గృహ నిర్మాణ ప్రాజెక్టులకు జీఎస్‌టీ 8 శాతం కాగా, ఇన్‌పుట్ క్రెడిట్ రూపేణ నిర్మాణదార్లకు దాదాపు అంతేమొత్తం లభిస్తుంది కనుక, వారిపై భారమేమీ పడదని వివరించింది. 'ఇన్‌పుట్ క్రెడిట్‌గా లభించిన మొత్తాలను కనుక మినహాయించి, ఫ్లాట్/ఇల్లు ధరను ప్రకటిస్తే, అప్పుడు మాత్రమే అందుబాటు ధర ఇళ్ల కొనుగోలుదార్ల వద్ద జీఎస్‌టీ వసూలు చేసుకోవచ్చు' అని తెలిపింది.

- రుణం జతచేసిన రాయితీ పథకం కింద అందుబాటు ధర నిర్మాణాలు చేపడితే, వాటికి రాయితీ రేటు 12 శాతం అమలు చేసేందుకు జీఎస్‌టీ మండలి జనవరి 18న ఆమోదం తెలిపిందని గుర్తు చేసింది.
- అయితే ఇల్లు, ఫ్లాట్ విలువలో భూమి ధరకు సంబంధించి మూడోవంతు పన్నును మినహాయిస్తున్నందున, వాస్తవానికి వర్తించే జీఎస్‌టీ రేటు 8 శాతం అవుతుందని, జనవరి 25 నుంచి ఇది అమల్లోకి వచ్చిందని తెలిపింది.
- వినియోగించే ముడి పదార్థాలు, ఇల్లు-ఫ్లాట్ నిర్మాణానికి వినియోగించే భారీయంత్రాలకు జీఎస్‌టీ రేటు 18 శాతం, 28 శాతం అవుతుంది. అయితే అందుబాటు ధర ఇళ్ల ప్రాజెక్టులకు మాత్రం అమలయ్యే జీఎస్‌టీ రేటు 8 శాతమేనని స్పష్టం చేసింది. అందువల్ల భవన నిర్మాణదారు/అభివృద్ధి దారు కూడా నిర్మాణ సేవలకు సంబంధించి జీఎస్‌టీని నగదు రూపంలో చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే పూర్తయిన నిర్మాణంపై జీఎస్‌టీ చెల్లించేందుకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లు తమ పద్దు పుస్తకాల్లో ఉండాలని, ఆర్థిక శాఖ పేర్కొంది. అందువల్ల ఫ్లాట్లపై చెల్లించిన జీఎస్‌టీని కొనుగోలుదార్ల వద్ద వసూలు చేయాలనుకోవడం మానాలని విస్పష్టంగా ఆదేశించింది.

3 రకాల పథకాలకూ వర్తింపు

అందరికీ ఇళ్లు సమకూర్చేందుకు ఉద్దేశించిన ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన (పట్టణ) పథకం కింద (1) ప్రస్తుత మురికివాడలను కదిలించకుండా అదే భూమిలో చేపట్టే గృహ నిర్మాణాలు, (2) భాగస్వామ్య పద్ధతిలో చేపట్టే అందుబాటు ధర గృహాలు, (3) వ్యక్తిగత ఇంటి నిర్మాణం, విస్తరణకు జీఎస్‌టీ రాయితీ రేటు అయిన 12 శాతం వర్తిస్తుంది.

అంకురాలపై తీవ్ర చర్యలు వద్దు

అంకుర సంస్థల నుంచి పన్ను బకాయిలు వసూలు చేసేందుకు తీవ్ర చర్యలకు దిగవద్దని ఆదాయపు పన్ను విభాగాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) ఆదేశించింది. కొత్తగా ఏర్పాటైన సంస్థలు మనుగడ సాగించేలా చూడాలని పేర్కొంది. 'ఏంజెల్ పన్ను' తమకు ఇబ్బందికరంగా మారిందని ఇటీవల పలు అంకుర సంస్థలు ప్రభుత్వానికి తెలిపిన నేపథ్యంలో, సీబీడీటీ తాజా ఆదేశాలు జారీ చేసింది. వినూత్న ఆలోచనలకు కార్యరూపం ఇచ్చేందుకు అంకుర సంస్థలు ఏర్పాటవుతుండగా, ఏంజెల్ పెట్టుబడిదారులు ఆ సమయంలో వాటికి పెట్టుబడులు పెడుతుంటారు. ఇవి ఐటీ చట్టంలోని 56 (2) సెక్షన్ పరిధిలోకి వస్తాయి. దీని ప్రకారం.. తక్కువమందితో ఏర్పాటయ్యే కంపెనీ కనుక తన షేర్లను సహేతుక మార్కెట్ విలువ కంటే అధిక మొత్తానికి కేటాయిస్తే, అధిక విలువను కంపెనీకి ఆదాయం వచ్చిందని భావిస్తూ, పన్ను విధిస్తున్నారు. ఈ రూపంలో 'ఏంజెల్' ఫండ్‌ల సాయంపై పన్ను విధిస్తున్నందున, అంకుర సంస్థలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. అందువల్ల పన్ను బకాయిల వసూలుకు బలవంతపు చర్యలకు దిగవద్దని ఐటీ విభాగానికి సూచించింది.

వార్షిక టర్నోవర్ ఆధారంగా గుర్తింపు

ఎంఎస్‌ఎంఈలపై మంత్రివర్గ నిర్ణయం

దిల్లీ: ఇప్పటివరకు ప్లాంటు, యంత్రాలపై పెట్టిన పెట్టుబడుల ఆధారంగా సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి వాణిజ్య సంస్థలు (ఎంఎస్‌ఎంఈ)గా గుర్తిస్తుండగా, ఇకపై ఆయా సంస్థల వార్షిక టర్నోవర్ ఆధారంగా ఆ గుర్తింపు ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన మార్పులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్త నిబంధనల ప్రకారం..

- రూ.5 కోట్లు, అంతకంటే తక్కువ టర్నోవర్ కలిగినవి సూక్ష్మ సంస్థలుగా గుర్తిస్తారు.
- రూ.5-75 కోట్ల టర్నోవర్ కలిగినవి చిన్న సంస్థలుగా పరిగణిస్తారు.
- రూ.75-250 కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థలను మధ్యస్థాయి సంస్థలుగా లెక్కిస్తారు.

కొత్త మార్పులు జీఎస్‌టీకి అనుగుణంగా ఉండటంతో, దేశంలో వాణిజ్య నిర్వహణ, కొత్త సంస్థల ప్రారంభం సులభమవుతుందని మంత్రివర్గం అభిప్రాయపడింది.

జ్వరం.. తగ్గేప్పుడే జాగ్రత్త!

డెంగీ జ్వరం అనగానే భయపడిపోనక్కర్లేదు. చాలా కొద్దిమందిలోనే దీనివల్ల తీవ్రమైన 'సివియర్ డెంగీ' సమస్యలు తలెత్తుతాయి కాబట్టి శ్రద్ధ మాత్రం తప్పదు.


దోమల సంతలాగే.. డెంగీ జ్వరాలూ మళ్లీ ముసురుకుంటున్నాయి. డెంగీ అనగానే ఇప్పుడు కంగారుపడి వణికిపోవాల్సిన పనిలేదుగానీ.. అలాగని ఈ జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం ముంచుకొస్తుందన్న వాస్తవాన్ని మాత్రం మరవకూడదు. ముఖ్యంగా డెంగీ అని నిర్ధారించినప్పుడు జ్వరం వచ్చినప్పుడే కాదు.. జ్వరం తగ్గిన తర్వాత కూడా కొద్దిరోజులపాటు జాగ్రత్త అవసరం.

మొదటిసారి సమస్య ఉండదు

- ఎవరికైనా డెంగీ జ్వరం మొదటిసారి వచ్చినప్పుడు అదే తగ్గిపోతుంది. సాధారణంగా రెండోసారి వచ్చినప్పుడే తీవ్ర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.
- ఈ సీజన్లో ఏ లక్షణాలతో జ్వరం వచ్చినా వైద్యులను సంప్రదించి డెంగీ యాంటిజెన్ (ఎన్ఎస్-1) పరీక్ష చేయించుకుంటే అది డెంగీనో, కాదో వెంటనే తెలిపోతుంది.

- జ్వరం తీవ్రంగా ఉన్నా అదేమంత ప్రమాదకరం కాదు, ఆ జ్వరం 2, 3 రోజుల్లో తగ్గిపోతుంది. జ్వరం తగ్గే దశలోనే చాలా జాగ్రత్తగా ఉండాలి.
- వైద్యుల సలహా పాటించటం, జ్వరం తగ్గుతున్నా కూడా ఉండటమంటే ఆసుపత్రిలోనే ఉండటం ముఖ్యం. ఎందుకంటే ఒంటి మీద మచ్చలు రావటం, ప్లేట్‌లెట్లు పడిపోవటం వంటి సమస్యలు తలెత్తేది ఈ దశలోనే.

పిల్లలను స్కూళ్లకు దోమలు కుట్టకుండా పొడుగు చేతుల చొక్కాలు, ప్యాంట్లు, సాక్సుల వంటివి వేసి పంపాలి.



డెంగీ దోమ చాలా స్పెషల్



- డెంగీ జ్వరానికి కారణమయ్యే టైగర్ దోమలు ఎక్కువగా పగటిపూటే.. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఎక్కువగా కుడతాయి.
- ఇంట్లోనే కాదు.. స్కూళ్లు, ఆఫీసులు, బ్యాంకులు, దుకాణాలు.. ఇలా అన్నిచోట్లా వీటితో జాగ్రత్తగా ఉండాల్సిందే.

- డెంగీ జ్వరంలో రక్త పరీక్షలు కీలకం. జ్వరం తగ్గే దశలో ఇవి తప్పనిసరి.
- డెంగీ అనగానే ప్లేట్‌లెట్‌ల పరీక్ష ఒక్కటే కాదు, దాంతో పాటు రక్తం ఎంత చిక్కగా ఉందో చెప్పే హెమటోక్రిట్/పీసీవీ పరీక్ష మరింత ముఖ్యం.

- పరీక్షా ఫలితాలను బట్టి వైద్యులు చికిత్స నిర్ధారిస్తారు. రక్తంలో హెమటోక్రిట్ సాధారణ స్థాయికి చేరుకుని, కనీసం 1, 2 రోజులు నిలకడగా ఉంటూ, ప్లేట్‌లెట్ల సంఖ్య పెరుగుతున్నప్పుడే ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లాలి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

డెంగీలో..

ఐబూప్రోఫెన్, నిముసులైడ్, డైక్లోఫెనాక్ వంటి నొప్పులు తగ్గించే మందులు వాడకూడదు. కాబట్టి ఈ సీజన్లో జ్వరం వస్తే ప్యారాసెటమాల్ ఒక్కటే మేలు.

రాఫెల్ ఒప్పందం పెద్ద కుంభకోణం

- **లోక్‌సభలో కాంగ్రెస్ ఆరోపణ**
- **శ్వేతపత్రం విడుదలకు డిమాండ్**

దిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు కేంద్ర సర్కారు కుదుర్చుకున్న ఒప్పందం అతిపెద్ద కుంభకోణమని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ఒప్పందంపై ప్రధాని నరేంద్రమోదీ స్పష్టతనివ్వాలనీ, ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలనీ డిమాండ్ చేసింది. మంగళవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్పమొయిలీ మాట్లాడుతూ- ఏమాత్రం పారదర్శకత లేని ఒప్పందం ద్వారా దేశ భద్రతతో ప్రభుత్వం ఆడుకొంటోందని ఆరోపించారు. 'ఈ ఒప్పందంలో అనేక నియమ నిబంధనల్ని తుంగలో తొక్కారు. జాతీయ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారు. ఖజానాకు వాటిల్లిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు?' అని ప్రశ్నించారు. మంచి బడ్జెట్టును ఇచ్చేలా స్వతంత్రంగా పనిచేసేందుకు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి ప్రభుత్వం అనుమతించలేదని ఆయన విమర్శించారు. దీర్ఘకాలిక మూలధన లబ్ధి పన్నును ప్రవేశపెట్టి, సెక్యూరిటీస్ లావాదేవీల పన్నును మాత్రం తొలగించకపోవడంలో అర్థం లేదన్నారు. జీఎస్టీ అమలులో ఆంధ్రప్రదేశ్ రూ.5100 కోట్లు, కర్ణాటక రూ.5059 కోట్లు నష్టపోయాయని చెప్పారు. దావోస్‌లో ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ ఆయనకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకూ మధ్య ఎలాంటి తేడా లేదన్నారు.

రాఫెల్ వివరాలు వెల్లడించడం దేశ భద్రతకు ముప్పు: కేంద్రం

దిల్లీ: రాఫెల్ యుద్ధవిమానాల ధర తదితర వివరాలను వెల్లడించడం రక్షణపరమైన సన్నద్ధతకు, దేశ భద్రతకు ముప్పు తెస్తుందని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. గోప్యత పాటించాల్సినందువల్లనే మునుపటి యూపీఏ సర్కారు కూడా రక్షణరంగ కొనుగోళ్ల ధరలను బయటపెట్టలేని అశక్తతను వ్యక్తం చేసిందని రక్షణశాఖ గుర్తుచేసింది. 'వస్తువువారీగా వివరాలను వెల్లడిస్తే ఆ విమానాల్లో వాడే ఆయుధ వ్యవస్థలు, విమాన రూపకల్పనకు సంబంధించిన వివరాలు తెలిసిపోతాయి. 2008లో భారత్-ఫ్రాన్స్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం గోప్యతను కాపాడాల్సి ఉంది. ఏ కోణంలో చూసినా యూపీఏ చేసుకున్న ఒప్పందం కంటే మేం కుదుర్చుకున్నదే మెరుగైనది. యూపీఏ ఊహాజనితంగా బేరమాడి రూపొందించిన ఒప్పందం పదేళ్లలో ఒక కొలిక్కి రాలేకపోయింది. తీవ్రత ఉన్న విషయంపై విపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయి. విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నాయి' అని ప్రకటన పేర్కొంది. యూపీఏ హయాంలో జరిగిన చర్చల్లో సాంకేతికత బదలాయింపు అంశం లేదనీ, కేవలం తయారీ వరకే అది పరిమితమనీ వివరించింది. భారత వాయుసేనకు ఉన్న అత్యవసరాల దృష్ట్యా అంతర్ ప్రభుత్వాల ఒప్పందం కుదుర్చుకున్నామనీ, దానిలో అన్ని పద్ధతుల్నీ పాటించామనీ స్పష్టం చేసింది. రాఫెల్ ఒప్పందంపై వివరాలు పార్లమెంటుకు తెలియకుండా కేంద్రం దాచిపెడుతోందని సీపీఎం విమర్శించింది. వివరాలు వెల్లడించి చిత్తశుద్ధి చాటుకోవాలని కోరింది.

ఆరోపణలు మానండి.. అడిగిన ప్రశ్నలకు జవాబులివ్వండి!

- **ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు**



దిల్లీ: ప్రధాని మోదీ పార్లమెంటులో ఆరోపణలు చేయడానికి బదులు దేశం అడుగుతున్న ప్రశ్నలకు జవాబులు చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సూచించారు. ప్రధానంగా రాఫెల్ ఒప్పందంపైన.. రైతుల సమస్యలు, యువతకు ఉద్యోగాల కల్పన తదితర అంశాలపై ప్రధాని సమాధానాలివ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా ప్రధాని లోక్‌సభలో మాట్లాడిన అనంతరం రాహుల్ గాంధీ బుధవారం విలేకర్లతో మాట్లాడారు. "ప్రతిపక్ష నేతను కాదు, ప్రధానమంత్రిని.. అన్న విషయం మోదీ మరిచిపోయినట్లున్నారు. దేశం అనేక ప్రశ్నలడుగుతుంటే.. ఆయన జవాబులు చెప్పడం లేదు. ప్రధాని కాంగ్రెస్‌పై బహిరంగసభల్లో విమర్శలు చేసుకోవచ్చు.. కానీ పార్లమెంటులో కాదు. లోక్‌సభలో మోదీ మాట్లాడిన తీరు రాజకీయ, ప్రచార ప్రసంగంలా ఉంది. రైతులకు గిట్టుబాటు ధర, రుణమాఫీ వంటి అంశాలకు బదులు వెదురు, తేనెటీగల గురించి మాట్లాడుతున్నారు." అని రాహుల్ విమర్శించారు. గంటసేపు మాట్లాడిన ప్రధాని రాఫెల్ ఒప్పందంపై ఒక్కముక్క కూడా ప్రస్తావించలేదని విమర్శించారు. ఇందులో కుంభకోణం ఉందా? లేదా? వంటి పలు ప్రశ్నలు వేసిన రాహుల్ వీటికి ప్రధాని జవాబులు చెప్పాలని డిమాండ్ చేశారు.

పాత పల్లవే.. : సోనియా

ప్రధాని కొత్తగా చెప్పిందేమీ లేదని.. పాతవాటినే మళ్లీ చెప్పారని సోనియా గాంధీ విమర్శించారు. ప్రధాని గొప్ప వక్త కావచ్చని.. అయితే ప్రసంగం మొత్తం తప్పుదారి పట్టించే వివరాలు, అర్ధసత్యాలతో నిండిపోయిందని కాంగ్రెస్ నేత శశిథరూర్ విమర్శించారు.

ఇక కాంగ్రెస్ నోటి నుంచి 'రాఫెల్' రొద!

ప్రచారాస్త్రాల్లో అవినీతి అంశాలకూ చోటు

ఈనాడు, దిల్లీ: ఇంతవరకు కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించాలంటే... అసహనం, నిరుద్యోగిత వంటి అంశాలపై ఆధారపడుతూ వస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇకపై కొన్ని అవినీతి ఆరోపణలనూ ఉపయోగించనుంది. రాఫెల్ విమానాల కోసం ఫ్రాన్స్‌తో కుదిరిన ఒప్పందంలో అవినీతి చోటు చేసుకొందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బుధవారం పార్లమెంటు వెలుపల ఆరోపిస్తే, పార్టీ సీనియర్ నేత ఆనంద్‌శర్మ రాజ్యసభ వేదికగా అదే అంశాన్ని లేవనెత్తారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇలాంటి అంశాలను తెరపైకి తీసుకురానున్న విషయం స్పష్టమవుతోంది. తమది పారదర్శక ప్రభుత్వమనీ, అవినీతి మరకలూ లేవని చెబుతున్న సర్కారు మాటలు వాస్తవం కాదని చెప్పాలనేది కాంగ్రెస్ ప్రయత్నం. రాఫెల్ విమానాల అసలు ధర ఎంతో చెప్పడానికి రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సుముఖత వ్యక్తం చేయడంలేదు. ఒప్పందం ప్రకారం అది గోప్యంగా ఉంచాల్సిన విషయమని ఆమె అంటున్నారు. ప్రజల సొమ్ముతో చేసిన కొనుగోలులో ధర చెప్పడం రహస్యమెలా అవుతుందని ఆనంద్‌శర్మ ప్రశ్నిస్తున్నారు. ఇంతకు ముందు కాంగ్రెస్ ఎంపీ రాజీవ్ గౌడ కూడా ఈ విమానాల ఒప్పందం గురించి సభలో నిలదీశారు.

అప్పుడు వారు... ఇప్పుడు వీరు.. : ఒక్కో జెట్ కోసం రూ.526.1 కోట్లు చెల్లించేందుకు యూపీఏ సర్కారు హయాంలో చర్చలు జరిపితే మోదీ సర్కారు రూ.1570.80 కోట్లు చొప్పున చెల్లించిందనేది కాంగ్రెస్ అనుమానం. 126 రాఫెల్ విమానాలను కొనాలనేది యూపీఏ సర్కారు నాటి ఆలోచనే. ఒప్పందం అప్పుడే కుదిరినా సంతకాలు జరగలేదు. అప్పట్లో విపక్షంగా భాజపా అనేక సందేహాలు లేవనెత్తింది. 2014లో భాజపా అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందాన్ని రద్దు చేసినట్లే భావించారు. 36 విమానాలు కొనుగోలు చేయబోతున్నామని 2015లో ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లినప్పుడు మోదీ అకస్మాత్తుగా ప్రకటించారు.

ఆధార్‌తో డ్రైవింగ్ లైసెన్సుల అనుసంధానం

దిల్లీ: నకిలీ వాహన చోదక అనుమతుల్ని ఏరివేసే లక్ష్యంతో.. డ్రైవింగ్ లైసెన్సులతో ఆధార్ సంఖ్యను అనుసంధానించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. అన్ని రాష్ట్రాల కోసం ఎప్పటికప్పుడు సమాచారం నమోదయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను సైతం సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో రహదారి భద్రతపై న్యాయస్థానం ఏర్పాటు చేసిన కమిటీ జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన సుప్రీం ధర్మాసనానికి ఈ అంశాన్ని తెలిపింది. ఈ అంశంపై గత ఏడాది నవంబర్ 28న రోడ్డురవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శితో సమావేశమయ్యామనీ, నకిలీ లైసెన్సుల్ని తొలగించడంతో పాటు, పలు అంశాలు చర్చించినట్లు కమిటీ తన నివేదికలో పేర్కొంది. కొత్త సాఫ్ట్‌వేర్‌తో అన్ని రాష్ట్రాలు అనుసంధానమవుతాయనీ, దీనికి నకిలీ, దొంగ లైసెన్సులు రూపొందించడం సాధ్యం కాదని వెల్లడించింది. దీనికి సంబంధించి ఈనెల 22,23 తేదీల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు కమిటీ తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. రహదారి భద్రత నిధిని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలను కోరినట్లు కమిటీ తెలిపింది. అన్ని రాష్ట్రాలకు కలిపి కేంద్రీకృత డేటాబేస్‌ను ఎన్ఐసీ రూపొందిస్తోందనీ, అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందనీ, డ్రైవర్లు చేసే అన్ని నేరాలు అందులో నమోదవుతాయని వివరించింది. పాదచారులకు సౌకర్యాల్ని కల్పించాలని అన్ని రాష్ట్రాలకు సూచించినట్లు పేర్కొంది. సుప్రీం ధర్మాసనం ఈ అంశాన్ని ఏప్రిల్ 23కు వాయిదా వేసింది. ఆధార్‌కు రాజ్యాంగ బద్ధతను సవాలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆధార్ సమాచారం సురక్షితం

కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడి

దిల్లీ: ఆధార్ సమాచారం పూర్తి సురక్షితంగా ఉందని కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. లోక్‌సభలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 120 కోట్లమందికి ఆధార్ కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. 57 కోట్ల బ్యాంకు ఖాతాలు ఆధార్‌కు అనుసంధానమైనట్లు చెప్పారు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) అత్యంత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థను కలిగి ఉందని వెల్లడించారు. రహస్యంగా ఉండాల్సిన ఆధార్ వివరాలేవీ బయటకు పొక్కలేదని స్పష్టం చేశారు. సమాచార భద్రతకు ప్రభుత్వం పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆధార్ సమాచారాన్ని ఎవరైనా దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తిస్తే.. వారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తామన్నారు.

బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా హమీద్ ఏకగ్రీవ ఎన్నిక

ఢాకా: బంగ్లాదేశ్ అధ్యక్ష పీఠంపై అబ్దుల్ హమీద్ మరో ఐదేళ్లపాటు కొనసాగనున్నారు. దేశాధ్యక్ష పదవికి బుధవారం ఆయన ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ అధ్యక్షుడిగా రెండో దఫా బాధ్యతలు చేపట్టనున్న ఏకైక నేత ఆయనే కావడం గమనార్హం. 74 ఏళ్ల హమీద్‌ను అధికార అవామీ లీగ్ పార్టీ నామినేట్ చేసింది.

ఖలేదా జియాపై కేసులో నేడు తీర్పు: నిధులు దుర్వినియోగం ఆరోపణలలో మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధ్యక్షురాలు ఖలేదా జియాపై నమోదైన కేసులో కోర్టు గురువారం తీర్పు వెలువరించనుంది. దీంతో ప్రభుత్వం భద్రతను పటిష్ఠం చేసింది.

'చావు' తెలివితేటలు

- **నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల సృష్టి**
- **రూ.14 లక్షల బీమా సొమ్ము కాజేసిన పురోహితుడు**
- **నల్గొండ పురపాలిక ఆర్ఐ సహా నలుగురు అరెస్టు**

సుల్తాన్‌బజార్, నల్గొండ పురపాలిక న్యూస్‌టుడే: బతికుండగానే మరణించినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి రూ.14 లక్షల మేర బీమా సొమ్మును కాజేసిన వ్యక్తి ఉదంతమిది. దీనికి సంబంధించి నలుగురు నిందితులు కటకటాలపాలయ్యారు. ఓ మహిళ పరారీలో ఉంది.

బుధవారం తూర్పు మండలం డీసీపీ శశిధర్‌రాజు కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా త్రిపురాంతకం గ్రామానికి చెందిన అరిపిరాల రవిశంకర్‌శర్మ (38) పురోహితుడు. ధూలపల్లిలోని సంజనా లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో భార్య ఉషశ్రీతో కలిసి ఉంటున్నాడు. అడ్డదారిలో డబ్బు సంపాదించే వ్యూహంలో భాగంగా జీవిత బీమా సంస్థలో తన పేరుతో ఉన్న పాలసీ తాలూకూ సొమ్మును కాజేసేందుకు పథకం రచించాడు. గతంలో నల్గొండలో నివాసం ఉన్నకాలంలో పరిచయమైన మహమ్మద్ ముజీబుల్లాఖాన్ సాయంతో నల్గొండ పురపాలిక కార్యాలయం నుంచి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందాడు. అందుకుగానూ అక్కడి ఆర్ఐకి రూ.16 వేలు లంచం ఇచ్చాడు.

తన భర్త చనిపోయాడంటూ దరఖాస్తు

దాని ఆధారంగా ఉషశ్రీ.. తన భర్త చనిపోయాడంటూ సరూర్‌నగర్, పుత్లిబౌలిలోని జీవిత బీమా కార్యాలయాలను సంప్రదించింది. ఓ పాలసీ తీసుకుని మూడేళ్లు దాటి ఉండటంతో ఎలాంటి విచారణ లేకుండానే అధికారులు దానికి సంబంధించి రూ.14,15,736 చెక్కును జారీ చేశారు.

రెండోసారి దొరికిపోయారిలా

రూ.5 లక్షల చొప్పున ఉన్న మరో రెండు పాలసీల సొమ్మును పొందేందుకు మరోసారి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో ఉషశ్రీ చైతన్యపురిలోని ఎల్ఐసీ కార్యాలయంలో దరఖాస్తు చేసింది. విచారణకు వచ్చిన అధికారులు రవిశంకర్‌శర్మ బతికే ఉన్నట్టు తెలుసుకుని అవాక్కయ్యారు. గత నెల 12న పుత్లిబౌలి శాఖ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తాన్‌బజార్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నకిలీ బాగోతాన్ని గుట్టు రట్టుచేశారు. రవిశంకర్‌శర్మ, ముజీబుల్లాఖాన్, నల్గొండ రెవెన్యూ అధికారి ఖాజా ఆరిఫుద్దీన్, ఎల్ఐసీ ఏజెంటు పుల్లారెడ్డిలను అరెస్టుచేశారు. ఉషశ్రీ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు చూపుతున్న డీసీపీ శశిధర్‌రాజు, వెనుక వరుసలో నిందితులు

రెండు ప్రైవేటు విద్యుత్ లైన్ల ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో రెండు ప్రైవేటు విద్యుత్ లైన్లను ప్రారంభించినట్లు స్టెరిలైట్ కంపెనీ వర్గాలు బుధవారం తెలిపాయి. నిజామాబాద్- శంకర్‌పల్లి, మహేశ్వరం- మహబూబ్‌నగర్‌ల మధ్య మొత్తం 236 కిలోమీటర్ల దూరం లైన్లను నిర్మాణ గడువు కంటే ముందే పూర్తి చేశారు. ఈ రెండు లైన్ల ద్వారా పవర్‌గ్రిడ్ సంస్థ రాష్ట్రాల మధ్య వెయ్యి మెగావాట్ల వరకూ విద్యుత్ సరఫరా చేయడానికి అవకాశం ఏర్పడింది. రానున్న 35 ఏళ్లపాటు ఈ కంపెనీ దీనిని నిర్వహిస్తుంది. దీనిపై విద్యుత్ సరఫరా చేసినందుకు అద్దె వసూలు చేస్తుంది.

తెలంగాణ మార్కెట్లకు పంజాబ్ ప్రశంస: తెలంగాణ వ్యవసాయ మార్కెట్లలో ఈనామ్ పథకం అమలు బాగుందని పంజాబ్ మార్కెటింగ్ మండలి అధికారులు ప్రశంసించారు. ఇక్కడ అధ్యయనానికి మండలి ఛైర్మన్ లాల్‌సింగ్ ఆధ్వర్యంలో వచ్చిన ఆరుగురి బృందం సూర్యాపేట మార్కెట్‌కెళ్లి పంటల కొనుగోలును పరిశీలించారు.

బాహుబలి నుంచి స్ఫూర్తి పొందాలి

- **జైన మతం గొప్పతనాన్ని శ్లాఘించిన రామనాథ్ కోవింద్**
- **మహామస్తకాభిషేకాలను ప్రారంభించిన రాష్ట్రపతి**

ఈనాడు- బెంగళూరు: సమాజాన్ని పట్టి పీడిస్తున్న అశాంతి, అసమానతల నిర్మూలనకు భగవాన్ బాహుబలి నుంచి స్ఫూర్తి పొందాలని రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ప్రజలకు పిలుపునిచ్చారు. కర్ణాటకలోని హాసన్ జిల్లా శ్రవణబెళగొళ వింధ్యగిరిపై వెలసిన 58.8 అడుగుల ఎత్తైన ఏక శిలామూర్తి బాహుబలి మహామస్తకాభిషేకాలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. చావుండరాయ వేదికపై మంగళవాద్య రవాల మధ్య రాష్ట్రపతి ఈ ఉత్సవ క్రతువులకు అంకురారోపణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. సమాజంలో శాంతి, అహింసల్ని పాదుగొల్పేందుకు కృషి చేసిన జైన మతం సమాజానికి అనేక ఆదర్శ సందేశాల్ని ఇస్తోందన్నారు. వైరాగ్యమూర్తి మహామస్తకాభిషేకం విశ్వశాంతికి నాందీవాచకం కావాలని రాష్ట్రపతి ఆశించారు. మహాత్యాగి బాహుబలి సందర్శనతో శాంతి పథానికి స్ఫూర్తి లభిస్తుందన్నారు.



శ్రవణబెళగొళలో బాహుబలి మహామస్తకాభిషేక క్రతువులను లాంఛనంగా ప్రారంభిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

అసూయ, ద్వేషాలకు చరమగీతాన్ని పలికేందుకు ప్రేరణ అవుతుందని రాష్ట్రపతి చెప్పారు. ఇక్కడి జైనమతం విద్య, వైద్య రంగాల్లో చేస్తున్న సేవలు ఆదర్శప్రాయాలని కొనియాడారు. జైన మత వారసత్వం దేశ ఐకమత్య సాధనకు కృషి చేస్తోందని ప్రశంసించారు.

- కన్నడంలో ప్రసంగాన్ని ప్రారంభించిన రామనాథ్ కోవింద్.. సహోదర సహోదరి వరకు, ఎల్లరిగూ నన్న సత్ ప్రేమ నమస్కారగళు' అని గళాన్ని సవరించినపుడు ఆహూతులు చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్రధాని సతీమణికి గాయాలు

జైపుర్: ప్రధాని నరేంద్ర మోదీ సతీమణి జశోదా బెన్ బుధవారం ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రాజస్థాన్‌లోని పర్సోలీ ఠాణా పరిధిలో జరిగిన ఈ ఘటనలో ఆమె బంధువొకరు మృతి చెందగా.. మరో నలుగురికి గాయాలయ్యాయి. వారంతా కోటలో ఓ కార్యక్రమానికి హాజరై చిత్తోర్‌గఢ్‌కు కారులో వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ముందు వెళుతున్న ఓ ట్రక్‌ను నడుపుతున్న చోదకుడు ఆకస్మికంగా బ్రేకులు వేయడంతో కారు వెనుక నుంచి ఢీకొట్టి చొచ్చుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో జశోదా బెన్‌కు స్వల్ప గాయాలు కాగా.. తీవ్రంగా గాయపడిన వసంత్‌భాయ్ మోదీ (67) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కారులో మెహసనా పోలీసు కమాండోలు ఇద్దరు ఉండగా వారిలో ఒకరు కూడా గాయపడినట్లు పోలీసులు తెలిపారు.

భారత్ జోక్యం చేసుకోవాల్సిందే: నషీద్

మాల్దీవుల సంక్షోభంపై భిన్నాభిప్రాయాలు

కొలంబో/ మాలె/ బీజింగ్: మాల్దీవుల్లో తలెత్తిన రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి భారత్ సైన్యం జోక్యం చేసుకోవాలని దేశ బహిష్కారంలో ఉన్న మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్ బుధవారం మరోసారి కోరారు. వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనీ, సైనిక జోక్యంతో పరిస్థితి ఇంకా సంక్లిష్టంగా మారుతుందనీ చైనా పేర్కొంది. చైనాకు సన్నిహితంగా ఉండే అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్... మాల్దీవుల్లో అత్యవసర పరిస్థితి ప్రకటించి, ఇద్దరు అగ్రశ్రేణి న్యాయమూర్తుల్ని అరెస్టు చేయించిన విషయం తెలిసిందే. వివాదాన్ని అంతర్గతంగా పరిష్కరించుకోవాలని చెప్పడమంటే తిరుగుబాటును ప్రోత్సహించడమే అవుతుందనీ, 1988లో భారతదేశం తమ దేశ సమస్యను పరిష్కరించినందున ఇప్పుడూ అలాంటి సాయం కోరుతున్నామనీ నషీద్ చెప్పారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదనేదే తమ ఉద్దేశమని చైనా స్పష్టం చేసింది. ఆ దేశం సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సి ఉందని తెలిపింది.



గగన విహారం చేస్తున్న హక్ విమానం

విజయవంతంగా హక్ గగన విహారం

ఈనాడు-బెంగళూరు: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ(హెచ్ఏఎల్) స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన రియల్ టైమ్ ఆపరేటింగ్ సిస్టమ్(ఆర్టీవోస్)ను బిగించిన హక్ విమానం విజయవంతంగా వినువీధిలో విహరించింది. 'ఆర్టీవోస్‌ను పూర్తిగా ఇక్కడే తయారు చేశాం. ఇందుకు ఖరగ్‌పూర్ ఐఐటీ సహకారాన్ని తీసుకున్నాం. తొలి ప్రయత్నంలోనే విజయాన్ని సాధించాం. సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్తినెస్ అండ్ సర్టిఫికేషన్(సెమిలాక్) సంస్థ నుంచి ప్రమాణపత్రం కూడా అందింది. ప్రస్తుతం మన దేశంలో విమానాలకు, ఏవియానిక్స్ వ్యవస్థలకు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఆర్టీవోస్‌ను అమర్చుతున్నారు. వివిధ వ్యవస్థలు సమర్థంగా, నమ్మకంగా పనిచేసేందుకు ఇవి దోహదపడతాయి'అని హెచ్ఏఎల్ ఛైర్మన్ సువర్ణరాజు తెలిపారు.

కొత్తగా 24 వైద్య కళాశాలల ఏర్పాటు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం

దిల్లీ: వైద్య, ఆరోగ్య రంగంలో మానవ వనరుల లభ్యతను పెంచడానికి రూ.14,930 కోట్లు విలువ చేసే పలు పథకాలను బుధవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇందులో 24 వైద్య కళాశాలల ఏర్పాటు కూడా ఉంది. ప్రస్తుతం ఉన్న జిల్లా వైద్య ఆసుపత్రులు, రిఫరల్ ఆసుపత్రులకు అనుబంధంగా వీటిని ఏర్పాటు చేయనుంది. ప్రతి 3-5 పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున మంజూరవుతుంది. ప్రతి రాష్ట్రానికీ కనీసం ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను కేటాయిస్తుంది. కళాశాల ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఛాలెంజ్ విధానంలో ఎంపిక చేస్తారు.

- కొత్త కళాశాలల కారణంగా దేశ వ్యాప్తంగా 10,000 ఎంబీబీఎస్, 8,000 పీజీ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. 2020-21 నాటికి ఇవి ఏర్పాటుకానున్నాయి.
- ఇది కాకుండా 2020-21 నాటికి అదనంగా 18,058 ఎంబీబీఎస్, పీజీ సీట్లు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది.
- 248 నర్సింగ్, మిడ్‌వైఫరీ స్కూళ్లు ఏర్పాటు చేయనుంది.

హైకోర్టుల్లో స్థానిక భాషలను ఉపయోగించడం ఆదర్శవంతం

రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు వ్యాఖ్య

దిల్లీ: స్థానిక భాషలను హైకోర్టుల్లో అధికార భాషగా ఉపయోగించడం ఆదర్శవంతంగా ఉంటుందని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. అందుకు విస్తృతస్థాయిలో ఏకాభిప్రాయం అవసరమని వ్యాఖ్యానించారు. మద్రాసు హైకోర్టులో తమిళాన్ని అధికార భాషగా వినియోగించేందుకు అనుమతి కోరుతూ తమిళనాడు శాసనసభ పంపిన తీర్మానాన్ని పునఃపరిశీలించాలంటూ ఏఐఏడీఎంకే ఎంపీ శశికళ పుష్ప కేంద్రప్రభుత్వాన్ని కోరగా.. వెంకయ్యనాయుడు ఈ మేరకు స్పందించారు. హైకోర్టులో తమిళం వినియోగంపై చేసిన విన్నపాన్ని కేంద్రం ఇటీవల తిరస్కరించిందని పుష్ప తెలిపారు. మరోవైపు పార్లమెంటు, అసెంబ్లీల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే అంశాన్ని కాంగ్రెస్ ఎంపీ రజనీ పటేల్ రాజ్యసభలో లేవనెత్తగా.. అది మంచి అంశమని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

పృథ్వీ-2 క్షిపణి పరీక్ష విజయవంతం

బాలాసోర్: స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధిచేసిన పృథ్వీ-2 క్షిపణిని భారత్ బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని చాందీపూర్ సమీకృత పరీక్షా వేదిక(ఐటీఆర్)పై నుంచి ఉదయం 11.35 గంటలకు దీన్ని ప్రయోగించినట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఉపరితల లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఈ ఉపరితల క్షిపణి (ఉపరితలం నుంచి ఉపరితలంపైకి) ఛేదించిందని పేర్కొన్నాయి. 350 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం పృథ్వీ-2 సొంతం. 500 నుంచి 1000 కిలోల బరువుండే "అణు వార్‌హెడ్ల'ను ఇది చక్కగా తీసుకుపోగలదు. దీనిలో జంట ఇంజిన్లున్నాయి. అధునాతన మార్గనిర్దేశన వ్యవస్థ సాయంతో ఇది ముందుకు దూసుకెళ్తుంది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదిస్తుంది. సైన్యానికి చెందిన వ్యూహాత్మక దళం (ఎస్ఎఫ్‌సీ) దీన్ని ప్రయోగించినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) నిపుణులూ ప్రయోగాన్ని పర్యవేక్షించినట్లు పేర్కొన్నాయి. 'క్షిపణి ప్రయోగ మార్గాన్ని రాడార్లు, ఎలక్ట్రో ఆప్టికల్ ట్రాకింగ్ వ్యవస్థ, టెలిమెట్రీ కేంద్రాల సాయంతో డీఆర్‌డీవో నిపుణులు పరిశీలించారు'అని తెలిపాయి. మంగళవారం చేపట్టిన అగ్ని-1, గత నెల 18న చేపట్టిన అగ్ని-5 పరీక్షలూ విజయవంతమైన సంగతి తెలిసిందే.

ఆధునిక బ్రిటన్‌వాసులూ... తొలినాళ్లలో నల్లగానే ఉండేవారు!



పునఃసృష్టి చేసిన పది వేల ఏళ్ల క్రితం నాటి అస్థిపంజరం ముఖచిత్రం

లండన్: ఆధునిక బ్రిటన్‌వాసులూ తొలినాళ్లలో నీలి కళ్లతో నల్లగా ఉండేవారట! 10,000 ఏళ్లనాటి వ్యక్తి అస్థిపంజర అవశేషాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించిన అనంతరం పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు. నైరుతి ఇంగ్లండ్‌లోని ఓ గుహలో 1903లో ఈ అస్థిపంజరం బయటపడింది. దీన్నిపై బ్రిటన్ నేచురల్ హిస్టరీ మ్యూజియం, యూనివర్సిటీ కాలేజీ లండన్ నిపుణులు అధ్యయనం చేపట్టారు. పుర్రెకు 2 మీ.మీ. రంధ్రంచేసి ఎముక చూర్ణాన్ని సేకరించారు. అనంతరం దీనికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. దీంతో తొలి ఆధునిక బ్రిటన్‌వాసులు గోధుమ వర్ణపు కళ్లతో తెల్లగా ఉండేవారన్న భావనకు విరుద్ధమైన ఫలితాలు వెలుగులోకి వచ్చాయి. "తాజా ఫలితాలుచూసి ఆశ్చర్యానికి గురయ్యాం. ఉత్తరఐరోపా వాసులకు తెల్లని మేనిఛాయ మనం ముందుకు ఊహించిన దానికంటే ఆలస్యంగా వచ్చింది. అంటే చాలాఏళ్లు వీరు నల్లగానే గడిపారు'అని పరిశోధనలో పాలుపంచుకున్న క్రిస్ స్ట్రింజెర్ తెలిపారు.

ముస్లింలను పాకిస్థానీయులని విమర్శిస్తే మూడేళ్ల జైలు

ఆ మేరకు చట్టం చేయాలన్న అసదుద్దీన్ ఒవైసీ

దిల్లీ: భారతీయ ముస్లింలను పాకిస్థానీయులంటూ విమర్శించే వారిని మూడేళ్ల జైలు శిక్ష విధించేలా చట్టం తేవాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ డిమాండు చేశారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం ఆయన మాట్లాడుతూ జిన్నా ప్రతిపాదించిన రెండు దేశాల సిద్ధాంతాన్ని భారతదేశంలో నివసిస్తున్న ముస్లింలు తిరస్కరించారని తెలిపారు. అయితే ఇలాంటి చట్టాన్ని భాజపా ప్రభుత్వం తీసుకురాదన్న విషయం తనకు తెలుసని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన తలాక్ బిల్లు మహిళలకు వ్యతిరేకమని అన్నారు.

ముస్లింలు దేశంలో ఉండాల్సిన పనిలేదు: వినయ్ కటియార్

దిల్లీ: ముస్లింలు దేశంలో ఉండాల్సిన పనిలేదని భాజపా సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వినయ్ కటియార్ వ్యాఖ్యానించారు. బుధవారం టీవీ ఛానెళ్లతో మాట్లాడుతూ ముస్లింల కారణంగానే దేశం విడిపోయిందన్నారు. వారి భూభాగంవాటా వారికి దక్కినందున; పాకిస్థాన్‌కో, బంగ్లాదేశ్‌కో వెళ్లిపోవాలని చెప్పారు. వందేమాతరాన్ని గౌరవించని వారిని, జాతీయ పతాకాన్ని అవమానం చేసేవారిని, పాకిస్థాన్ జెండాను ఎగురవేసేవారిని శిక్షించేలా పార్లమెంటులో కొత్తచట్టం తీసుకురావాలని డిమాండు చేశారు. ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ చేసిన ప్రసంగానికి నిరసనగా ఈ వ్యాఖ్య చేశారు.

దొంగతనంగా రన్‌వే పైకి

షార్జా విమానాశ్రయంలో భారతీయుడి నిర్వాకం

దుబాయ్: ఎలాగైనా విమానం ఎక్కేయాలని షార్జా అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపైకి ఓ భారతీయుడు దొంగతనంగా చేరుకున్నాడు. అయితే త్వరలో పెళ్లిచేసుకోబోయే అమ్మాయి కోసమే ఈ పని చేశానని ఆయన తెలిపారు. ప్రేమ ఎక్కువై ఇలా చేశానని, పశ్చాత్తాపం పడాలని అనుకోవట్లేదనీ వివరించారు. అతణ్ని 26ఏళ్ల ఆర్‌కేగా అధికారులు గుర్తించారు. విమానాశ్రయ గోడ దూకి, దొంగతనంగా రన్‌వేపైకి వచ్చిన అనంతరం పోలీసులు ఆయన్ను అరెస్టుచేశారు.

చాంపియన్

రెండో వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత మహిళల విజయం

శతక్కొట్టిన మంధాన



సెంచూరియన్: కోహ్లీసేనే కాదు.. పరిమిత ఓవర్ల క్రికెట్లో భారత అమ్మాయిల జట్టూ దక్షిణాఫ్రికాను హడలెత్తిస్తోంది. సూపర్ ఫామ్‌లో ఉన్న స్మృతి మంధాన (135; 129 బంతుల్లో 14×4, 1×6) శతకంతో అదరగొట్టడంతో బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు 178 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా మహిళల జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. మంధానతో పాటు హర్మన్‌ప్రీత్ కౌర్ (55 నాటౌట్), వేద కృష్ణమూర్తి (51 నాటౌట్) చెలరేగడంతో మొదట భారత్ 3 వికెట్లకు 302 పరుగులు చేసింది. ఛేదనలో పూనమ్ యాదవ్ (4/24), రాజేశ్వరి (2/14), దీప్తి శర్మ (2/34) ధాటికి దక్షిణాఫ్రికా 30.5 ఓవర్లలో 124 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ గెలుచుకుంది.



జులన్ రికార్డు: వన్డే క్రికెట్లో 200 వికెట్లు పడగొట్టిన తొలి మహిళా క్రికెటర్‌గా భారత స్పీడ్‌స్టర్ జులన్ గోస్వామి రికార్డు సృష్టించింది. దక్షిణాఫ్రికాతో రెండో వన్డేలో ఓ వికెట్ పడగొట్టడంతో ఆమె ఈ మైలురాయిని అందుకుంది. 35 ఏళ్ల జులన్‌కు ఇది 166వ వన్డే మ్యాచ్. ఆసక్తికర విషయమేంటంటే వన్డే క్రికెట్లో తొలి రెండొందల వికెట్లు పడగొట్టిన పురుష బౌలర్ కూడా భారతీయుడే. కపిల్‌దేవ్ ఈ ఘనత సాధించాడు. బెంగాల్‌లోని చక్దాహ అనే చిన్న పట్టణానికి చెందిన జులన్ 2002లో అరంగేట్రం చేసింది. 2007లో ఐసీసీ మేటి మహిళా క్రికెటర్ అవార్డును అందుకుంది.



భారత్ 5.. మాల్దీవులు 0

అలోర్ సెటార్ (మలేసియా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో ఫిలిప్పీన్స్‌ను 5-0తో చిత్తు చేసిన భారత్.. రెండో మ్యాచ్‌లో మాల్దీవులును కూడా అంతే తేడాతో మట్టికరిపించింది. తొలి సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-5, 21-6తో షహీద్ హుస్సేన్‌పై ఘనవిజయంతో భారత్‌కు శుభారంభాన్నందించగా.. మిగతా రెండు సింగిల్స్‌లో సాయిప్రణీత్ 21-10, 21-4తో అహ్మద్ నిబాల్‌ను, సమీర్ వర్మ 21-5, 21-1తో మహ్మద్ అలీని చిత్తు చేశారు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ 21-8, 21-8తో షహీద్-షహీమ్‌లపై, అర్జున్-శ్లోక్ 21-2, 21-5తో మహ్మద్ అలీ-నిబాల్‌లపై విజయాలు సాధించారు. భారత్ గురువారం తన చివరి లీగ్ మ్యాచ్‌లో ఇండొనేసియాను ఢీకొంటుంది. ఈ టోర్నీలో తమ తొలి మ్యాచ్‌లో హాంకాంగ్‌ను ఓడించిన మహిళల జట్టు.. గురువారం జపాన్‌ను ఢీకొంటుంది.

విరాట్ జోరులో మణికట్టు మాయలో..



- దక్షిణాఫ్రికా మళ్లీ చిత్తు
- కెప్టెన్ అద్భుత ఇన్నింగ్స్
- సత్తా చాటిన స్పిన్నర్లు
- మూడో వన్డేలోనూ భారత్ ఘనవిజయం

రెండో ఓవర్లో వచ్చాడు క్రీజులోకి. 50 ఓవర్లూ అయ్యాక కానీ క్రీజును విడిచిపెట్టలేదు. పిచ్ అంత తేలిగ్గా లేదు. బౌలింగ్ అంత సులువుగానూ లేదు. ఎప్పట్లా ఎడాపెడా బౌండరీలు బాదేయలేదు. ఓపిక పట్టాడు. బంతి బంతికీ కష్టపడ్డాడు. వికెట్ల మధ్య అలుపు లేకుండా తిరిగాడు. అవకాశం దొరికినపుడు అద్భుతమైన షాట్లు ఆడాడు. ఇన్నింగ్స్‌లో సగంపైగా బంతులాడి.. జట్టు పరుగుల్లో సగంపైగా తానే సాధించాడు. జట్టుకు ఊహించని స్కోరు అందించాడు.

కెరీర్లో గుర్తుండిపోయే గొప్ప ఇన్నింగ్స్ ఆడిన విరాట్ కోహ్లి శ్రమ ఊరికే పోలేదు. బౌలర్లు.. ముఖ్యంగా స్పిన్నర్లు జోరు కొనసాగిస్తూ ప్రత్యర్థి పని పట్టారు. భారత్ ఖాతాలో మరో ఘనవిజయాన్ని జమ చేశారు. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన టీమ్ఇండియా.. మిగతా మూడు వన్డేల్లో ఒక్క విజయం సాధించినా సిరీస్ సొంతమవుతుంది. వన్డేల్లో నంబర్ వన్ ర్యాంకూ పదిలమవుతుంది.

సెంచరీ నం.34

కేప్‌టౌన్


దక్షిణాఫ్రికాతో వన్డే పోరులో భారత్ ఆధిపత్యాన్ని కొనసాగించింది. హ్యాట్రిక్ విజయంతో ఆరు వన్డేల సిరీస్‌లో 3-0 ఆధిక్యం సంపాదించింది. బుధవారం మూడో వన్డేలో ఆతిథ్య జట్టును 124 పరుగుల తేడాతో చిత్తు చేసింది కోహ్లీసేన. విరాట్ (160 నాటౌట్; 159 బంతుల్లో 12×4, 2×6) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు, శిఖర్ ధావన్ (76; 63 బంతుల్లో 12×4) మెరుపులు తోడవడంతో మొదట భారత్ 6 వికెట్లకు 303 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా 40 ఓవర్లలో 179 పరుగులకే కుప్పకూలింది. యువ స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్ (4/23), యుజ్వేంద్ర చాహల్ (4/46) మరోసారి సఫారీ జట్టు పతనాన్ని శాసించారు. కోహ్లీనే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. నాలుగో వన్డే శనివారం జొహానెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

పోటీనే లేదసలు..: గత మ్యాచ్‌లో చాహల్, కుల్‌దీప్‌ల ధాటికి విలవిలలాడిన దక్షిణాఫ్రికా.. ఈ మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో ఐదుగురు మణికట్టు స్పిన్నర్లను రప్పించుకుని సాధన చేసినా ఆ ప్రభావమేమీ మ్యాచ్‌లో కనిపించలేదు. భారత యువ స్పిన్ ద్వయం మరోసారి ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను వణికించింది. అనుభవజ్ఞుడు ఆమ్లా (1)ను రెండో ఓవర్లోనే వికెట్ల ముందు బలిగొని బుమ్రా (2/32) దక్షిణాఫ్రికాను దెబ్బ తీసినప్పటికీ.. తాత్కాలిక కెప్టెన్ మార్‌క్రమ్ (32; 42 బంతుల్లో 2×4, 1×6), మిడిలార్డర్ నుంచి మూడో స్థానానికి వచ్చిన డుమిని (51; 67 బంతుల్లో 4×4) రెండో వికెట్‌కు 78 పరుగులు జోడించి జట్టులో ఆశలు రేపారు. డుమిని స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తన సమర్థతను చాటడం, మార్‌క్రమ్ కూడా నిలకడగా ఆడటంతో ఈ మ్యాచ్‌లో కుల్‌దీప్, చాహల్‌ల పప్పులుడకవనే అనుకున్నారంతా. కానీ వీళ్లిద్దరూ క్రమంగా చెలరేగిపోయారు. ముందుగా చాహల్ బౌలింగ్‌లో మార్‌క్రమ్ స్టంపౌటవగా.. తర్వాత క్లాసెన్ (6), డుమినిలను ఔట్ చేసి చాహల్ ప్రత్యర్థిని గట్టి దెబ్బ తీశాడు. డుమిని ఔటవ్వగానే దక్షిణాఫ్రికా ఓటమి ఖరారైపోయింది. తర్వాత పతనం ఎక్కడా ఆగలేదు. మిల్లర్ (25) ఒక్కడు కాస్త పోరాడాడు. కుల్‌దీప్, చాహల్ రెండు వైపులా దాడి చేస్తూ పది ఓవర్లుండగానే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించారు.

విరాట్ వెన్నెముకలా..: అంతకుముందు భారత ఇన్నింగ్స్‌కు విరాట్ వెన్నెముకలా నిలిచాడు. వైఫల్యాన్ని కొనసాగిస్తూ రోహిత్ (0) తొలి ఓవర్లోనే పెవిలియన్ చేరిపోవడంతో ఇన్నింగ్స్ ఆరంభంలోనే కోహ్లి క్రీజులోకి వచ్చాడు. తన శైలికి భిన్నంగా కోహ్లి కొంచెం నెమ్మదిగా ఆడగా.. ధావన్ ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఏ బౌలర్‌నూ లెక్క చేయకుండా ధావన్ భారీ షాట్లు ఆడాడు. అతను 42 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. కుదురుకున్నాక కోహ్లి కూడా జోరు పెంచాడు. 23 ఓవర్లకు 140/1తో భారత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. ఐతే ఈ దశలో ధావన్ ఔటవడంతో భారత్ ఇబ్బందుల్లో పడింది. ఆ తర్వాత కోహ్లికి ఎవ్వరూ సహకారం అందించలేదు. ఓ ఎండ్‌లో అతను నిలకడగా ఆడుతున్నా.. అవతల వికెట్ల పతనం కొనసాగుతూ పోయింది. రహానె (11) చెత్త షాట్ ఆడి పెవిలియన్ చేరగా.. పాండ్య (14), ధోని (10), జాదవ్ (1) కూడా క్రీజులో నిలవలేదు. అయినప్పటికీ విరాట్ పోరాటం ఆపలేదు. ఎక్కువగా తనే స్ట్రైక్ తీసుకుంటూ.. ఇబ్బడి ముబ్బడిగా సింగిల్స్, డబుల్స్ తీస్తూ.. సమయోచితంగా షాట్లు ఆడుతూ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. చివరి ఓవర్లలో అతడికి భువనేశ్వర్ (16) నుంచి సహకారమందింది. 119 బంతుల్లో సెంచరీ పూర్తి చేసిన కోహ్లి.. ఆపై జోరు పెంచాడు. మూడో అర్ధశతకాన్ని 38 బంతుల్లోనే పూర్తి చేశాడు. అతడి ధాటికి చివరి 5 ఓవర్లలో భారత్ 47 పరుగులు చేసింది. చివరి ఓవర్లో 150 మార్కు దాటిన విరాట్.. చివరి రెండు బంతులకు 6, 4 కొట్టి స్కోరును 300 దాటించాడు.







భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) రబాడ 0; ధావన్ (సి) మార్‌క్రమ్ (బి) డుమిని 76; కోహ్లి నాటౌట్ 160; రహానె (సి) ఫెలుక్వాయో (బి) డుమిని 11; పాండ్య (సి) క్లాసెన్ (బి) మోరిస్ 14; ధోని (సి) ఎంగిడి (బి) తాహిర్ 10; జాదవ్ (సి) క్లాసెన్ (బి) ఫెలుక్వాయో 1; భువనేశ్వర్ నాటౌట్ 16; ఎక్స్‌ట్రాలు 15 **మొత్తం:** (50 ఓవర్లలో 6 వికెట్లకు) **303; వికెట్ల పతనం:** 1-0, 2-140, 3-160, 4-188, 5-228, 6-236; **బౌలింగ్:** రబాడ 10-1-54-1; ఎంగిడి 6-0-47-0; మోరిస్ 9-0-45-1; ఫెలుక్వాయో 6-0-42-1; తాహిర్ 9-0-52-1; డుమిని 10-0-60-2

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ఆమ్లా (ఎల్బీ) (బి) బుమ్రా 1; మార్‌క్రమ్ (స్టంప్డ్) ధోని (బి) కుల్‌దీప్ 32; డుమిని (ఎల్బీ) (బి) చాహల్ 51; క్లాసెన్ (ఎల్బీ) (బి) చాహల్ 6; మిల్లర్ (సి) ధోని (బి) బుమ్రా 25; జోండో (సి) మనీష్ పాండే (బి) చాహల్ 17; మోరిస్ (ఎల్బీ) (బి) కుల్‌దీప్ 14; ఫెలుక్వాయో (సి) కోహ్లి (బి) కుల్‌దీప్ 3; రబాడ నాటౌట్ 12; ఇమ్రాన్ తాహిర్ (సి) కోహ్లి (బి) చాహల్ 8; ఎంగిడి (ఎల్బీ) (బి) కుల్‌దీప్ 6; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం** (40 ఓవర్లలో ఆలౌట్) **179; వికెట్ల పతనం:** 1-1, 2-79, 3-88, 4-95, 5-129, 6-150, 7-150, 8-158, 9-167; **బౌలింగ్:** భువనేశ్వర్ 7-0-41-0; బుమ్రా 7-0-32-2; పాండ్య 8-0-35-0; చాహల్ 9-0-46-4; కుల్‌దీప్ 9-1-23-4

1 వన్డేల్లో వికెట్ల మధ్య పరుగెత్తడం ద్వారా 100 పరుగులు సాధించిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా కోహ్లి నిలిచాడు

2 ఆస్ట్రేలియా తర్వాత దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై వరుసగా మూడు వన్డేలు గెలిచిన రెండో జట్టు భారత్

12 కోహ్లి వన్డే శతకాలు. అత్యధిక శతకాలు సాధించిన భారత కెప్టెన్ అతడే. మొత్తంగా కెప్టెన్లలో పాంటింగ్ (22), డివిలియర్స్ (13) ముందున్నారు

"చివరి వరకు ఎవరో ఒకరు బ్యాటింగ్ చేయాలి. ఆ పని కెప్టెన్‌గా నేనే చేయడం సంతోషంగా ఉంది. చివర్లో కండరాలు పట్టేశాయి. కానీ 300 దాటాలంటే చివరి వరకు నేనుండాలి. నాలుగో వన్డేలో ఇంకా పోరాడతాం. ఇక సిరీస్ ఎట్టి పరిస్థితుల్లో కోల్పోకూడదు"
– విరాట్ కోహ్లి

4 వన్డే క్రికెట్లో 400 ఔట్లలో పాలు పంచుకున్న నాలుగో వికెట్ కీపర్‌గా ధోని ఘనత సాధించాడు. అత్యధిక ఔట్లు చేసిన వికెట్ కీపర్ల జాబితాలో సంగక్కర (482), గిల్‌క్రిస్ట్ (472), బౌచర్ (424) ధోని (401) కన్నా ముందున్నారు.

5 ఈ పర్యటనలో రబాడ బౌలింగ్‌లో రోహిత్ శర్మ ఔటైన సందర్భాలు

నీకు నువ్వే సాటి!



కోహ్లి సెంచరీలు కొట్టడం కొత్త కాదు. కెప్టెన్ ఇన్నింగ్స్‌లు ఆడటమూ కొత్త కాదు. సహచరులు విఫలమైనపుడు అతను నిలబడి ఇన్నింగ్స్‌ను నిలబెట్టడమూ కొత్త కాదు. కానీ మూడో వన్డేలో విరాట్ ఇన్నింగ్స్‌ను ఇప్పటిదాకా అతను సాధించిన సెంచరీల్లో ఒకటిగా మాత్రమే చూడలేం! ఇది ఒక యోధుడి శారీరక ధారుడ్యానికి.. ఒక మేటి క్రికెటర్ తెలివితేటలకు.. ఒక బ్యాటింగ్ మేధావి నైపుణ్యానికి.. ఒక కెప్టెన్ అంకితభావానికి నిదర్శనం!

ఫోర్త్ అంపైర్

దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు రెండేళ్ల పాటు టీమ్ఇండియా జైత్రయాత్ర ఎలా సాగిందో తెలిసిందే. ఆ జైత్రయాత్రలో కోహ్లి సహా మిగతా ఆటగాళ్లందరూ కూడా కీలక పాత్ర పోషించారు. విరాట్ డబుల్ సెంచరీల మోత మోగించాడు. ఐతే సొంతగడ్డపై ఎలా ఆడితే ఏముంది? దక్షిణాఫ్రికాలో చూపించండి సత్తా అన్నారంతా. ఈ సవాలును నూటికి నూరు శాతం స్వీకరించి తన స్థాయి ఏంటో చాటిచెప్పాడు విరాట్. టెస్టు సిరీస్‌లో భారత్ ఓటమి పాలై ఉండొచ్చు. కానీ విరాట్ ఓడలేదు. వికెట్లు పేసర్ల స్వర్గధామాలైతేనేమి.. దక్షిణాఫ్రికా ఫాస్ట్‌బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో పరీక్ష పెడితేనేమి.. కోహ్లి మాత్రం తన ఆట తాను ఆడుతూ పోయాడు. సెంచూరియన్‌లో సహచరులంతా చేతులెత్తేసిన వేళ.. అతడి 153 పరుగుల ఇన్నింగ్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆపై జొహానెస్‌బర్గ్‌లో భారత్ అద్భుత విజయం సాధించిన మ్యాచ్‌లో రెండు విలువైన ఇన్నింగ్స్‌లతో మెరిశాడు కోహ్లి. ఇక తనకు అత్యంత ఇష్టమైన వన్డే ఫార్మాట్లోకి వచ్చేసరికి కోహ్లి పతాక స్థాయినే అందుకున్నాడు. ఆడుతున్నది భారత గడ్డ మీదా అని సందేహం కలిగేలా చెలరేగిపోతున్నాడు. మొన్న డర్బన్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ శతకం.. నిన్న సెంచూరియన్‌లో 46 పరుగుల అజేయ ఇన్నింగ్స్.. ఇప్పుడు కేప్‌టౌన్‌లో కెరీర్లో ఒక మైలురాయిలా నిలిచిపోయే మేలిమి ఇన్నింగ్స్!

అతను ఎప్పుడూ చూపించే దూకుడు బుధవారం మూడో వన్డేలో కనిపించలేదు. ఈ పిచ్‌పై బ్యాటింగ్ అంత సులువుగా ఏమీ సాగలేదు. అతను ధనాధన్ షాట్లు ఆడేసి తేలిగ్గా సెంచరీ కొట్టేయలేదీసారి. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ బలహీనపడి ఉండొచ్చు కానీ.. బౌలింగ్ మాత్రం ఇప్పటికీ ప్రమాదకరమే. ముఖ్యంగా రబాడ 145 కిలోమీటర్లకు పైగా వేగంతో ప్రతి బంతికీ పరీక్ష పెట్టాడు. మిగతా బౌలర్లూ సత్తా చాటారు. ఇలాంటి బౌలింగ్‌ను ఎంతో సంయమనంతో, పరిణతితో ఎదుర్కొన్నాడు విరాట్. షాట్లు కొట్టడానికి అన్నిసార్లూ అవకాశం లేకపోయినా.. వీలు చిక్కినపుడు మాత్రం అద్భుతమైన షాట్లు ఆడాడు. కొన్ని మంచి బంతులనూ అద్భుత రీతిలో బౌండరీలు రాబట్టిన తీరు అమోఘం.

పరిస్థితులకు తగ్గట్లు ఆటను అన్వయించుకోవడంలోనే ఒక క్రికెటర్ పరిణతి తెలుస్తుంది. సొంతగడ్డపై ఫ్లాట్ పిచ్‌ల మీద ఆడినట్లే అన్ని చోట్లా ఆడేస్తామంటే కుదరదు. ఎంతటి మేటి బ్యాట్స్‌మన్ అయినా పరిస్థితులు అంత అనుకూలంగా లేనపుడు కొంచెం తగ్గి ఆడాలి. బౌలర్లను గౌరవించాలి. విరాట్ అదే చేశాడు.

తన వికెట్ విలువేంటో విరాట్‌కు బాగా తెలుసు. అందుకే ఔటయ్యే ప్రమాదమున్న షాట్లు పెద్దగా ఆడలేదు. 50 ఓవర్ల పాటు క్రీజులో నిలిచి కూడా అతను ప్రత్యర్థి బౌలర్లకు పెద్దగా అవకాశం ఇవ్వలేదు. మూడు గంటలకు పైగా క్రీజులో నిలిచినా.. అలసట కనిపించనివ్వలేదు. ధోని, పాండ్య, జాదవ్ లాంటి వాళ్లు చేతులెత్తేయడంతో చివర్లో అతనే భారీ షాట్లు ఆడాడు. అసాధ్యం అనుకున్న 300 స్కోరును సాధించి పెట్టాడు. ఇన్నింగ్స్ చివరి రెండు బంతులకు కోహ్లి ఆడిన షాట్లు అతడి బ్యాటింగ్ మేధస్సుకు రుజువుగా నిలుస్తాయి. ఐదో బంతికి రబాడ షార్ట్ పిచ్ బంతి వేయబోతున్నాడని ముందే గ్రహించి బ్యాక్ ఫుట్ తీసుకుని పుల్ షాట్ ఆడటానికి ముందే సిద్ధమైపోవడం, 145 కి.మీకి పైగా వేగంతో వచ్చిన బంతిని అంతే వేగంతో స్టాండ్స్‌లోకి పంపించడం అమోఘం. ఇక చివరి బంతికి కూడా అడ్డదిడ్డంగా షాట్ ఆడకుండా లాంగాన్‌లో ఫీల్డర్ ముందుకున్న సంగతి గుర్తించి.. కళాత్మక స్ట్రెయిట్ డ్రైవ్‌తో బంతిని బౌండరీ బాట పట్టించిన వైనమూ అద్భుతమే. 50 ఓవర్ల పాటు క్రీజులో నిలిచిన బ్యాట్స్‌మన్ ఇన్నింగ్స్ చివర్లో అంత చురుగ్గా ఆలోచించడం, బౌలర్ మనసును చదివేసి షాట్లు ఆడటం ఆశ్చర్యం కలిగించే విషయం. ఇక్కడే కోహ్లి ప్రత్యేకత కనిపిస్తుంది.

కోహ్లి స్కోరు 160లో బౌండరీల ద్వారా వచ్చినవి 60 పరుగులే. మిగతా వందా కేవలం వికెట్ల మధ్య పరుగుతోనే సాధించాడు. అంతే కాదు.. మిగతా బ్యాట్స్‌మెన్ బౌండరీలతో కాకుండా సాధించిన 100 పరుగుల్లో అతడి భాగస్వామ్యం ఉంది. అంటే వికెట్ల మధ్య అతను 200 సార్లు పరుగెత్తాడన్నమాట. దాదాపు 50 ఓవర్ల పాటు క్రీజులో నిలిచి.. ఆద్యంతం ఏకాగ్రతతో, అత్యుత్తమంగా ఆడుతూ.. ఇంత శ్రమకు ఓర్చి ఇన్నింగ్స్‌ను నిర్మించడమంటే మాటలు కాదు. కోహ్లి ఫిట్‌నెస్ ప్రమాణాలు ఏ స్థాయివో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. కఠినమైన పిచ్‌పై మేటి బౌలర్లను ఎదుర్కొంటూ కోహ్లి సాధించిన ఈ ఇన్నింగ్స్‌లో అతడి మార్కు బ్యాటింగ్ కళాత్మకతను చూడొచ్చు. అలాగే కెప్టెన్‌గా అతడి బాధ్యతను చూడొచ్చు. విరాట్ శారీరక, మానసిక దృఢత్వాన్ని కూడా ఈ ఇన్నింగ్స్‌లో చూడొచ్చు. పరిస్థితులకు తగ్గట్లుగా ఒక ఆటగాడు ఎలా అన్వయించుకుని ఆడాలో చూపించే ఒక పాఠంలా ఇన్నింగ్స్ నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

మలింగ.. ఇక ముంబయి బౌలింగ్ గురూ



ముంబయి: శ్రీలంక పేసర్ లసిత్ మలింగ ముంబయి ఇండియన్స్ బౌలింగ్ మార్గనిర్దేశకుడిగా నియమితుడయ్యాడు. మలింగ ఐపీఎల్‌లో సుదీర్ఘకాలం ముంబయి తరఫున ఆడాడు. 110 మ్యాచ్‌ల్లో ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ముంబయితో అనుబంధాన్ని కొనసాగించడాన్ని గౌరవంగా భావిస్తున్నానని మలింగ చెప్పాడు.

మాక్స్‌వెల్ మెరుపు సెంచరీ

ఇంగ్లాండ్‌పై ఆస్ట్రేలియా విజయం



హోబర్ట్: మాక్స్‌వెల్ విధ్వంసక శతకం బాదడంతో బుధవారం జరిగిన ముక్కోణపు సిరీస్ రెండో టీ20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించింది. మాక్స్‌వెల్ ఆల్‌రౌండ్ జోరుతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొదట ఇంగ్లాండ్ 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. ఓ దశలో 14 ఓవర్లు ముగిసే సరికి 122/4తో ఉన్న ఇంగ్లాండ్.. 33 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయి అనుకున్న దాని కంటే తక్కువ స్కోరుకే సరిపెట్టుకుంది. మాక్స్‌వెల్ (3/10), అగర్ (2/15) ఇంగ్లాండ్‌ను దెబ్బతీశారు. మలన్ (50; 36 బంతుల్లో 5×4, 2×6) రాణించాడు. మాక్స్‌వెల్ మెరుపు శతకం (103 నాటౌట్; 58 బంతుల్లో 10×4, 4×6) చేయడంతో లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00